సమగ్ర సమాచార పత్రిక

# ముద్ర

www.mudranews.in

హైదరాబాద్
ఆదివారం, 01.03.2026

www.mudranews.in | @mudranews

సంపుటి:13 సంచిక: 129
పేజీలు: 12 వెల: రూ. 5

## విద్యాశాఖలో కమిషన్ చిచ్చు

### విద్యాకమిషన్ నివేదికతో తెలంగాణలో రాజకీయ వేడి

- టీచర్ల జీతాలపై ప్రభుత్వానికి కమిషన్ సూచనలు
- వేతనాల హేతుబద్ధీకరణపై ఉపాధ్యాయ సంఘాల ఆగ్రహం
- జీతాలు కాదు.. కమిషన్లు కట్ చేయాలన్న డిమాండ్
- కమిషన్ నివేదికపై బీజేపీ, బీఆర్ఎస్ తీవ్ర విమర్శలు
- రిపోర్టును మూసీలో పారేయండి: బండి సంజయ్ ఫైర్
- టీచర్ల గౌరవాన్ని దెబ్బతీసే ప్రయత్నమా? అనుమానాలు
- విద్యావ్యవస్థపై కాకుండా జీతాలపై దృష్టి ఎందుకు? ప్రశ్నలు
- విద్యా కమిషన్‌పై దుమారం
- టీచర్ల జీతాల అంశంతో ఎన్నికల వేడి పెరుగుదల




**ముద్ర, తెలంగాణ బ్యూరో:**
తెలంగాణలో విద్యాకమిషన్ సిఫార్సులపై ఉపాధ్యాయ, రాజకీయ వర్గాలు భగ్గుమన్నాయి. రాష్ట్రంలో ఉపాధ్యాయులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది వేతనాలు మార్కెట్ ప్రమాణాల కంటే గణనీయంగా ఎక్కువగా ఉన్నాయని, వీటిని సమీక్షించి హేతుబద్ధీకరించాలంటూ కమిషన్ చేసిన సిఫార్సులపై మండిపడుతున్నాయి. టీచర్లకు జీతాలు కాదు.. లీడర్లకు కమిషన్లు కట్ చేయాలి అని ఉపాధ్యాయ సంఘాలు మండిపడుతుండగా, కమిషన్ నివేదికపై బీఆర్ఎస్, బీజేపీలు భగ్గుమంటున్నాయి. ఉపాధ్యాయుల జోలికి వస్తే గుణపాఠం తప్పదని ప్రతిపక్షాలు హెచ్చరించడంతో, రాష్ట్ర రాజకీయాల్లో వేతనాల చర్చ రచ్చగా మారింది.

**నివేదికను మూసీలో పారేయండి: కేంద్రమంత్రి బండి సంజయ్**
ఉపాధ్యాయుల వేతనాలపై విద్యా కమిషన్ చేసిన సిఫార్సులపై కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్రస్థాయిలో ఫైర్ అయ్యారు. కమిషన్ ఇచ్చిన రిపోర్టును తీసుకెళ్లి మూసీలో పారేయాలి, లేదంటే ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని మిగతా 02లో


## భయం భయమే!

### సీబీఐ అప్పీల్‌తో మళ్లీ టెన్షన్ కవితకు ఊరట.. రాజకీయంగా హీట్

### క్లీన్ చిట్.. కానీ కేసు ఇంకా ముగియలేదు

- బీఆర్ఎస్‌లో అంతర్మథనం పెరుగుతోంది
- కుటుంబ చీలికలు బయటపడుతున్నాయా?
- తెలంగాణలో కొత్త సమీకరణాలా?
- కవిత కొత్త పార్టీ సంకేతాలు
- పొత్తులపై ఊహాగానాలు జోరు
- హైకోర్టు తీర్పే కీలకం
- రాజకీయాల్లో కొత్త యుద్ధం మొదలు

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
ఢిల్లీ మద్యం కేసులో 23 మందికి క్లీన్ చిట్ ఇచ్చినా.. అసలు భయం మాత్రం వీడటం లేదు. నిజానికి, కింది కోర్టు తీర్పు ఇచ్చిన రోజునే.. సీబీఐ ఆఘమేఘాలపై హైకోర్టులో అప్పీల్ చేసింది. కేసు క్లోజ్ అవ్వకుండా.. ఇంకా ఉంది అనిపించింది. ఈ కేసులో ఇంత సీరియస్‌గా ఉన్న సీబీఐ.. కింది కోర్టును ఎందుకు సంతృప్తి పరచలేకపోయింది? ఈ కేసు తీర్పు తెలంగాణ రాజకీయాలపై ఎలాంటి ప్రభావం చూపబోతోంది?.. అసలు ఈ కేసుతో కల్వకుంట్ల కుటుంబం కొంత రాజకీయ ఉపశమనానికి గురవుతుందా.. తదుపరి కవిత.. కేటీఆర్ అడుగులు ఎటువైపు అనేది ఇప్పుడు చర్చ.
ఢిల్లీ రౌస్ అవెన్యూ స్పెషల్ సీబీఐ కోర్టు జడ్జి జస్టిస్ జితేంద్ర సింగ్ ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసులో కీలక తీర్పు ఇచ్చారు. మాజీ ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, మాజీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియా, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సహా మొత్తం 23 మంది నిందితులపై సీబీఐ నమోదు చేసిన అన్ని ఆరోపణలను కోర్టు కొట్టిశారు. "ప్రైమా ఫేసీ కేసు లేదు, ఆరోపణలు ఊహాగానాలు మాత్రమే, డబ్బు మార్గం లేదు, సాక్ష్యాలు లేవు" అని కోర్టు స్పష్టం చేసింది. సీబీఐ దర్యాప్తును "ప్రీమెడిటేటెడ్ అండ్ కొరియోగ్రాఫ్డ్" (ముందుగా ప్లాన్ చేసిన, నాటకీయం) అని తీవ్రంగా విమర్శించి, దర్యాప్తు అధికారిని.. దీనిపై ప్రశ్నించాలని కూడా ఆదేశించింది. అందువల్ల ఈ కేసు క్లోజ్ అయినట్లు కనిపించింది. కానీ.. నిజానికి క్లోజ్ అవ్వలేదు. కారణం సీబీఐ.. ఈ తీర్పు వచ్చిన కొన్ని గంటల్లోనే దీనిపై ఢిల్లీ హైకోర్టులో అప్పీల్ దాఖలు చేసింది. తీర్పు వచ్చాక.. సీబీఐ ప్రతినిధి తన అధికారిక ప్రకటనలో "ట్రయల్ కోర్టు తీర్పులో దర్యాప్తులోని అనేక అంశాల్ని లెక్కలోకి తీసుకోలేదు లేదా సరిగ్గా పరిగణించలేదు కాబట్టి వెంటనే హైకోర్టులో అప్పీల్ చేస్తాం" అని చెప్పారు. ఆ తర్వాత, కొన్ని గంటలకే హైకోర్టులో అప్పీల్ చేశారు. హైకోర్టు ఈ అప్పీల్‌ను హోలీ సెలవుల మిగతా 02లో




## అండగా ఉంటాం

### మదీనా బాధితులకు సీఎం భరోసా



- పరిహారం చెక్కుల పంపిణీ
- మృతుల కుటుంబానికి రూ.5 లక్షలు
- గాయపడిన వారికి రూ.3 లక్షల
- ప్రభుత్వం మీకు అండగా ఉంటుందన్న సీఎం

03

## రూ. 5,456 కోట్లతో టీటీడీ బడ్జెట్

### శ్రీవారి ముడుపు పత్రం పథకం అమలు



- వకుళామాత ఆలయంలో గోవింద అక్షరమాల
- తిరుపతిలో కమాండ్ కంట్రోల్
- మరో అన్న ప్రసాద భవనం.. ఆధునిక వంటశాలలు
- టీటీడీ పాలకమండలి నిర్ణయం

10

## ఆవిష్కరణలు ప్రాయోగిక ఫలితాలుగా మారాలి

10

### మంత్రి ఉత్తమ్ కుమార్



## రోడ్లు ఉంటేనే పెట్టుబడులు

### బిల్డర్స్ నేషనల్ మేనేజింగ్ కమిటీ, జనరల్ కౌన్సిల్ సమావేశంలో మంత్రి కోమటిరెడ్డి


- ఆర్థికాభివృద్ధికి నిర్మాణ రంగం కీలకం
- మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధికి ప్రాధాన్యత

10



## పవర్ రికార్డ్

### ఒక్కరోజే గరిష్టంగా 6,057 మె.వా విద్యుత్ వినియోగం



- గత ఏడాది మార్చి 11న 5,816 మె.వా రికార్డ్
- ఫిబ్రవరిలోనే విద్యుత్ వినియోగం రికార్డు స్థాయికి చేరింది
- ఎండల ప్రభావంతో విద్యుత్ అవసరం పెరుగుదల

10

## పశ్చిమాసియాలో మరో యుద్ధం

### ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ భీకర దాడులు..

- ప్రతిగా అమెరికా స్థావరాలపై ఇరాన్ క్షిపణుల వర్షం
- ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ దాడులు.. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తీవ్రం
- 'లయన్స్ రోర్' ఆపరేషన్‌తో ఇజ్రాయెల్ దాడులు.. ఇరాన్ ప్రతీకార హెచ్చరికలు
- టెహ్రాన్, ఇస్ఫహాన్‌లో పేలుళ్లు.. 30 ప్రాంతాలపై క్షిపణి దాడులు
- అమెరికా స్థావరాలపై ఇరాన్ కౌంటర్ అటాక్
- ఖమేనీ లక్ష్యంగా దాడులు.. బంకర్‌లోకి వెళ్లిన సుప్రీం లీడర్
- ఎమర్జెన్సీ అలర్ట్‌లో ఇజ్రాయెల్.. గగనతలాలు మూసివేత

09



## ఏపీలో పేలుడు..

### 21 మంది మృతి

- సామర్లకోట బాణసంచా తయారీ కేంద్రంలో ప్రమాదం..
- గోదావరి కెనాల్ పక్కన భారీ పేలుడు.. గ్రామాలను వణికించిన శబ్దం
- 34 మంది కార్మికుల్లో 21 మంది మృతి, 13 మంది గాయాలు
- పేలుడు ధాటికి ఐదు కిలోమీటర్ల దూరం వరకు ప్రకంపనలు
- అగ్నికీలల్లో చిక్కుకుని కార్మికులు సజీవదహనం
- మృతుల్లో ఎక్కువ మంది మహిళలు
- పరిమితికి మించి తయారీ వల్లే ప్రమాదమా? అనుమానాలు

03





ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ రోజు స్వామి వారి కల్యాణ మహోత్సవంలో పాల్గొని స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించిన సంక్షేమ శాఖ మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్.

### పేదల ఇళ్ల జోలికి వస్తే

## భరతం పడ్తాం

### మల్కాజిగిరి ఎంపీ ఈటల

03



### ఆరోగ్య సంరక్షణకు

## హెల్త్ మిషన్-100

### రాష్ట్ర వ్యాప్తంగా 2 నుంచి జూన్ 9 వరకు నిర్వహణ

- గ్రామీణ మహిళలకు డిజిటల్ హెల్త్ ప్రొఫైల్
- టీ-డయాగ్నస్టిక్స్ ద్వారా 30 రకాల మెడికల్ పరీక్షలు ఉచితం
- 42 లక్షల మంది స్వయం సహాయక సంఘాల మహిళలకు లబ్ధి




09

ముద్ర

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన సొంత ప్రయోజనాల కోసం ఇరాన్ పై దాడి చేసి ప్రపంచవ్యాప్తంగా చమురు ధరలు, అస్థిరతకు కారణమవుతున్నారు



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
ఆదివారం 01.03.2026
www.mudranews.in | @mudranews



## టాప్ 10 పండ్ల రసాలు



### మామిడి జ్యూస్

మామిడి జ్యూస్ తీపి రుచితో పాటు విటమిన్ A, C సమృద్ధిగా ఇస్తుంది. శరీరానికి శక్తిని పెంచి, చర్మానికి కాంతిని ఇస్తుంది.

# విద్యాశాఖలో కమిషన్ చిచ్చు

(మొదటి పేజీ తరువాయి)

హెచ్చరించారు. ఉపాధ్యాయుల పట్ల సమాజంలో తప్పుడు అభిప్రాయాలు రేకెత్తించేలా ప్రభుత్వం ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. శనివారం నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన బండి సంజయ్.. ఈ రిపోర్టు ఇచ్చిన వ్యక్తులకు నైతికత, అవగాహన లేవు. ఇది ఏసీ రూమ్‌లో కూర్చుని రాసి ఇచ్చిన నివేదిక అని విమర్శించారు. ఈ విషయంలో ఉపాధ్యాయ వర్గం అంతా జాగృతం కావాలని పిలుపునిచ్చారు. డీఏ, పీఆర్సీ, రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్ ఇవ్వాలని, విద్యా శాఖకు మంత్రిని కేటాయించాలంటూ నివేదిక ఇవ్వాల్సిన కమిషన్.. అందుకు భిన్నంగా రిపోర్టు ఇచ్చిందని ఆరోపించారు. కమిషన్ చైర్మన్‌కు క్షేత్రస్థాయి పరిస్థితులు తెలియవని, ఎవరితోనూ మాట్లాడకుండా తప్పుడు నివేదిక ఇచ్చారని దుయ్యబట్టారు. సీఎం ఆదేశం మేరకే ఆకునూరి మురళి ఈ తప్పుడు నివేదిక ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**టీచర్ల జీతంపై ఎందుకీ మంట...? ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు**

ఆకునూరి మురళి కమిషన్ నివేదికపై పలువురు విద్యావేత్తలు, ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. రాష్ట్రంలోని ఓ శాఖలో సీనియర్ స్వీపర్ నెల జీతం రూ. 2 లక్షలు ఉందని స్వయంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు చెబుతుంటే, ఐఏఎస్‌కు సమానంగా వివిధ దశలను దాటుకుని వచ్చిన టీచర్లకు ఎందుకు జీతాలు మెరుగ్గా ఉండకూడదు? అని ప్రశ్నిస్తున్నారు. టీచర్స్ ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి స్పందిస్తూ ప్రస్తుతం ఉన్న విద్యావ్యవస్థను బాగుచేసేందుకు సిఫార్సులు ఇవ్వమని ప్రభుత్వం కోరితే, కమిషన్ మాత్రం జీతాల గురించి మాట్లాడుతోంది అని విమర్శించారు.

**విద్యావ్యవస్థ భ్రష్టుపట్టించేలా : మాజీ మంత్రి హరీశ్ రావు**

విద్యావ్యవస్థను భ్రష్టుపట్టించేలా సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయాలు ఉన్నాయని బీఆర్ఎస్ ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన విద్యా కమిషన్‌లో అసలు విద్యావేత్తలు ఉన్నారా? అని ప్రశ్నించారు. స్కూల్, కాలేజీ, యూనివర్సిటీ స్థాయిలో కనీసం పాఠాలు చెప్పిన అనుభవం ఉన్న విద్యావేత్త ఒక్కరినైనా కమిటీలో చూపిస్తారా అని నిలదీశారు. ఈ కమిటీ చైర్మన్ ఒక రిటైర్డ్ ఐఏఎస్. పైగా ఆయనొక ఇంజినీర్. ఆఫీసులు నడపడం వేరు, చదువులు చెప్పడం వేరు అని విమర్శించారు.ఇదీలావుంటే డీఏ, పీఆర్సీ, రిటైర్డ్ ఉద్యోగుల ప్రయోజనాల విషయంలో ఇప్పటికే ప్రభుత్వంపై విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో విద్యాకమిషన్ ఉపాధ్యాయుల జీతాల అంశాన్ని ప్రస్తావించడం రాష్ట్ర రాజకీయాల్లో కలకలం రేపుతోంది. రాబోయే అసెంబ్లీ ఎన్నికల కోసం ఇప్పటి నుంచే పార్టీలు తమ అస్త్రశస్త్రాలను సిద్ధం చేసుకుంటున్న వేళ టీచర్ల జీతాల వ్యవహారం రాష్ట్ర రాజకీయాన్ని ఎటువైపు తీసుకువెళ్లబోతోంది? ఈ విషయంలో ప్రతిపక్షాల విమర్శలకు ప్రభుత్వం ఎలా చెక్ పెడుతుంది? విద్యా కమిషన్ సిఫార్సులపై ఎలా ముందుకు వెళ్లబోతోంది? అనేది ఉత్కంఠగా మారింది.

# భయం భయమే!

(మొదటిపేజీ తరువాయి)

తర్వాత లిస్ట్ చేసే అవకాశం ఉంది. అందువల్ల ప్రస్తుతానికి కవిత ఈ కేసులో నిర్దోషిగానే ఉంటారు. కానీ.. హోలీ తర్వాత హైకోర్టు లిస్ట్ చేస్తే.. మళ్లీ ఆమె సహా 23 మంది నిందితులు అవుతారు. ఇలా ఈ కేసు ఇంకా ముగియలేదనే సంకేతాలిస్తోంది.

**ఏమిటీ తీర్పు..?**

ఈ కేసు తీర్పు తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తిగా మారింది. ఈ తీర్పు తర్వాత 2 నెలల్లో పార్టీ పెడతాననీ.. ప్రత్యక్ష రాజకీయాల్లో సత్తా చాటుతామని కవిత ప్రకటించారు. అంతేకాదు.. బీఆర్ఎస్ పార్టీ, తన అన్న కేటీఆర్‌ని ఆమె తప్పుపట్టారు. కేటీఆర్ ట్వీట్‌పై మాట్లాడుతూ.. "నా వల్ల పార్టీ అధికారం కోల్పోయిందా? సరిగ్గా పరిపాలించి ఉంటే.. ఇలా అయ్యేది కాదు" అంటూ ఫైర్ అయ్యారు. కేటీఆర్ ట్వీట్ చేసి "బీఆర్ఎస్ ఈ సో-కాల్డ్ లిక్కర్ స్కామ్ వల్ల రాజకీయంగా బలి అయింది, 2023 అసెంబ్లీ, 2024 లోక్‌సభ ఎన్నికల్లో నష్టపోయింది" అన్నారు. ఇది కొంతవరకూ నిజమే. ఈ కేసు అప్పట్లో పార్టీకి బ్యాడ్‌నేమ్ తెచ్చింది. స్వయంగా సీఎం కూతురు అరెస్ట్ అవ్వడంతో చాలా మంది కవిత తప్పు చేశారా? అందుకే అరెస్టు అయ్యారా? అందుకే బీఆర్ఎస్ పార్టీ ఆమెకు బలంగా అండగా నిలబడలేకపోతోందా? అనే సందేహాలు వ్యక్తం చేశారు. ఆమె అరెస్టును బలంగా ఖండించే విషయంలో బీఆర్ఎస్.. పెట్టాల్సినంత ఎఫర్ట్ పెట్టలేదనే విమర్శలు ఎదుర్కొంది. అటు కేసీఆర్, ఇటు కేటీఆర్ కూడా.. కవితను కాస్త దూరం పెట్టినట్లే కనిపించారు. అందుకే జైలు నుంచి రిలీజ్ అయ్యాక కవిత కూడా ఆ దూరాన్ని మరింత పెంచుకున్నారు గానీ.. దగ్గర అవ్వలేకపోయారు. అలా ఆ కుటుంబంలో చీలిక మొదలైంది.

**బీఆర్ఎస్‌లో అంతర్మథనం**

కవిత విషయంలో మనం సరిగ్గానే స్పందించామా లేదా అనే అంశంపై ఇప్పుడు బీఆర్ఎస్ పార్టీలో అంతర్మథనం జరుగుతున్నట్లు సమాచారం. అలాగే ఈ తీర్పు తెలంగాణ రాజకీయాలపై ఎలాంటి ప్రభావం చూపనుంది అనేది కూడా పార్టీలో చర్చ జరుగుతున్నట్లు తెలుస్తోంది. కవిత నిన్న ఓ మాట అన్నారు. "బీఆర్ఎస్ ఓటమికి కారణం నాయకత్వానికి ఉన్న అహంకారం, హామీలు నెరవేర్చకపోవడం" అని కేటీఆర్‌కి కౌంటర్ ఇస్తూ అన్నారు. ఇది కుటుంబ రాజకీయాల్లో లోతైన చీలికను చూపిస్తోంది. కేసీఆర్ మీద కక్ష సాధించడానికే తనను టార్గెట్ చేశారని కవిత చెప్పారు. ఎన్నికల ముందు వరకూ కేసీఆర్, కేటీఆర్ ఆమెకు మద్దతు ఇచ్చారు కానీ పార్టీ ఓటమి తర్వాత చీలిక ప్రభావం కనిపించింది. ఇక ఇప్పుడు ఆమె నెక్స్ట్ ఎన్నికల నాటికి ఇటు బీఆర్ఎస్, అటు కాంగ్రెస్ రెండు పార్టీలకూ పోటీగా ఎదిగే అవకాశాలు ఉన్నాయి. తనను జైలుకు పంపింది బీజేపీ అని భావిస్తున్న ఆమె.. కమలంతో కలిసే అవకాశాలు లేనట్లే అనుకుంటే అప్పుడు ప్రభుత్వ వ్యతిరేక ఓట్లను చీల్చుతారా? లేక.. ఏదైనా ఒక పార్టీతో పొత్తుగా వెళ్తారా అనేది ఇప్పుడే చెప్పలేం. రాజకీయాలు డైనమిక్. ఏదైనా జరగొచ్చు. ఇప్పటికైతే.. కవిత హ్యాండ్ రైజ్ చేశారు. ఈ జోరు కొన్నాళ్లు కనిపించే అవకాశం ఉంటుంది. ఆ క్రమంలో ఆమె బీఆర్ఎస్‌కి వ్యతిరేకంగా చేసే వ్యాఖ్యలు.. ఆ పార్టీకి కొంత డ్యామేజ్ చేసే ఛాన్స్ ఉంటుందని విశ్లేషకులు చెబుతున్నారు. ఐతే.. కవిత విషయంలో మొదటి నుంచి బీఆర్ఎస్ సైలెంటుగా ఉంటోంది కాబట్టి.. ఈ వ్యూహం బీఆర్ఎస్‌కి మేలే చేస్తుందనే అభిప్రాయం కూడా విశ్లేషకుల్లో ఉంది.

**కొత్త రాజకీయ యుద్ధం**

తెలంగాణ రాజకీయాల్లో బీఆర్ఎస్ ఇప్పుడు రికవరీ చేసుకోవాలంటే కుటుంబ ఐక్యత అవసరమనీ, కానీ కవిత స్వతంత్రంగా ముందుకు సాగితే మాత్రం అది.. కాంగ్రెస్, బీజేపీకి కొంత ప్లస్ అవ్వగలదనే విశ్లేషణలు ఉన్నాయి. మొత్తం మీద ఈ తీర్పు కొత్త రాజకీయ యుద్ధానికి తెరతీసేలా ఉంది. సీబీఐ అప్పీల్ ఫలితం ఏమవుతుందో చూడాలి. తెలంగాణలో మహిళా నాయకత్వం, ఫెడరలిజం, కేంద్ర-రాష్ట్ర సంబంధాలు ఇవన్నీ ఈ కేసు చుట్టూ తిరుగుతున్నాయి. ఢిల్లీ లిక్కర్ స్కాం ఆరోపణలను విచారించిన రౌస్ అవెన్యూ కోర్టు ఇచ్చిన సంచలన తీర్పు తెలుగు రాష్ట్రాల్లో కూడా భారీ రాజకీయ పరిణామాలకు వేదికకానుంది. ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియాలతోపాటు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, కేసీఆర్ కుమార్తె కల్వకుంట్ల కవితకు ఈ కేసులో పూర్తి విముక్తి లభించింది.

**తీర్పుతో విమర్శలు డొల్లేనా!**

దాదాపు మూడేళ్లుగా దేశ రాజకీయాలను కుదిపేసిన ఢిల్లీ లిక్కర్ స్కాం కేసు ట్రయల్ కోర్టు తాజా తీర్పుతో నీటి బుడగలా పేలిపోయినట్టే భావించాలి. సిబిఐ (CBI) దాఖలు చేసిన ఛార్జిషీట్‌లో సరైన ఆధారాలు లేవని, నేరపూరిత కుట్రకు సంబంధించి ఎలాంటి సాక్ష్యాలు దొరకలేదని కోర్టు తేల్చి చెప్పింది. సౌత్ లాబీ నుంచి 100కోట్ల మొత్తాన్నీ కిక్ బ్యాగ్‌గా పొందారన్న ఆరోపణలనుంచి కేజ్రీవాల్‌తో పాటు కల్వకుంట్ల కవితపై ఉన్న ఆరోపణలన్నీ కొట్టివేస్తూ కోర్టు ఆమెను నిర్దోషిగా ప్రకటించింది. మనీ ట్రయల్ జరిగిందన్న ఆరోపణలకు సరైన ఆధారాలను సీబీఐ చూపలేకపోవడం ఈ కేసులో విచారణ సంస్థ ఆరోపణలను బలహీనపరిచాయి.

**సార్వత్రిక ఎన్నికల వేళ అరెస్టులతో రాజకీయ దుమారం..**

కవితను 2024 మార్చిలో హైదరాబాద్‌లోని ఆమె నివాసం నుంచి ఈడీ అరెస్ట్ చేసింది. ఢిల్లీ తిహార్ జైలులో దాదాపు 5 నెలల పాటు గడిపారు. తన అరెస్ట్ వెనుక రాజకీయ కుట్ర జరిగిందనీ, బీజేపీ కావాలనే తనను ఇబ్బంది పెడుతోందని కవిత ఆరోపించారు. తెలంగాణలో ప్రభుత్వం కోల్పోయిన బీఆర్ఎస్ పార్టీకి కవిత అరెస్ట్ పెద్ద దెబ్బగా మారింది. కానీ తనపై ఆరోపణలను పార్టీ సరైన రీతితో స్పందించలేదని కవిత ఆక్షేపణ వ్యక్తంచేశారు. ఈ క్రమంలోనే కవితకీ బీఆరెస్ అధినేత కేసీఆర్‌కీ మధ్య దూరం పెరిగిందని తరువాత పరిణామాలు చెబుతున్నాయి. ఇప్పుడవి కవిత బీఆర్ఎస్ నే టార్గెట్ చేస్తూ కొత్త పార్టీ పెట్టుకునేలా ప్రేరేపిస్తున్నాయి.

**రెండున్నరేళ్ల వేధింపులు తొలగాయి అంటున్న కవిత..**

తాజా తీర్పుతో సత్యమే గెలుస్తుందన్న నమ్మకం పెరిగిందన్నారు కవిత. "ఎప్పటికైనా కడిగిన ముత్యంలా బయటకు వస్తానని తెలుసు. ఈ రెండున్నరేళ్లు చాలా మంది అవమానకరంగా విమర్శలు చేశారు. సోషల్ మీడియాలో ట్రోల్స్ చేసి వేధించారు. ఈ తీర్పు వారందరికీ సమాధానం"అని కవిత చెప్పారు. అండగా నిలిచిన తల్లిదండ్రులకూ, కుటుంబానికీ, జాగృతి కార్యకర్తలకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. తీర్పు అనంతరం తల్లితో మాత్రమే ఫోన్లో మాట్లాడానని తెలిపిన కవిత తదుపరి కార్యాచరణపై ఎలాంటి అడుగులు వేయనున్నారో ఆసక్తికరంగా మారింది. ఇకపై మారనున్న రాజకీయం, కొత్త పొత్తులకు తలుపులు తెరుచుకుంటాయా!

కవితపై ఆరోపణలను కోర్టు కొట్టివేయడంతో ఆమెకు భారీ ఊరట లభించినట్లైంది. బీఆర్ఎస్ తో విభేదించిన తర్వాత ఆ పార్టీ కార్యకర్తలే కవితపై లిక్కర్ కుంభకోణం ఆరోపణల వల్లే పార్టీ నష్టపోయిందని విమర్శించారు. తాజా పరిణామాల వేళ కవితకు రాజకీయంగా అవకాశాలు పెరుగుతాయనే చెప్పుకోవచ్చు. కవిత కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకునే అవకాశాలపై అంచనాలకు ఈ తీర్పు కొత్త ఊపిరులు ఊదినట్టైంది. ఒకవేళ పొత్తుకు అవకాశముంటే ఈ తాజా తీర్పు వల్ల ఆ అడ్డంకులన్నీ తొలగిపోయినట్టే. తద్వారా కేసీఆర్, బీఆరెస్ పై తమ విమర్శలను మరింత పదును పెట్టేందుకు కాంగ్రెస్ ఇదో అవకాశంగా వినియోగించుకోవచ్చు. కవిత కొత్త పార్టీ పెట్టినా కూటమిగా బీజేపీ-బీఆరెస్ పై కవిత తన దాడిని పెంచొచ్చు. మరోవైపు బీజేపీ-బీఆరెస్ మధ్య దూరం తగ్గే అవకాశాలూ లేకపోలేదు.

## ఎస్‌ఎల్‌బీసీ పునరుద్ధరణ

# పనులు వేగవంతం

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎస్.ఎల్.బి.సి పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఇప్పటికే దేవరకొండ భాగంలోని ఔట్ లెట్ సొరంగ మార్గం తవ్వకం 20 మీటర్ల మేర పూర్తి అయ్యిందన్నారు. ఎస్.ఎల్.బి.సి పునరుద్ధరణ పనుల పురోగతిపై శనివారం మంత్రి రాష్ట్ర సచివాలయంలో నీటిపారుదల శాఖా ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. శ్రీశైలం నుంచి ఇన్ లెట్ సొరంగ మార్గం పనులు ప్రారంభించడానికి సన్నద్ధమవుతున్నారని ఆయన వెల్లడించారు. సొరంగ మార్గం తవ్వకాలలో భద్రతా చర్యలకు పూర్తి ప్రాధాన్యత ఇస్తున్నట్లు వివరించారు. తవ్వకాల సమయంలో అవసరమైన గాలి ప్రసరణతో పాటు సొరంగ మార్గం తవ్వేటపుడు వచ్చే నీటిని తొలగించేందుకు చేపడుతున్న చర్యలపై ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. భూభౌతిక పరిస్థితులకనుగుణంగా టన్నెల్ బోర్ మిషన్ (టి.బి.యం) విధానాన్ని విరమించుకుని అత్యాధునిక పరిజ్ఞానంతో తవ్వకాలు ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. సురక్షిత మార్గాలు అన్వేషించి అదనంగా వెంటిలేషన్,విద్యుత్ పరికరాలు దిగుమతి చేసుకున్నట్లు వివరించారు. గతేడాది ఫిబ్రవరి నెలలో ఎస్.ఎల్.బి.సి తవ్వకాలలో దురదృష్టవశాత్తు జరిగిన ప్రమాద ఘటనను దృష్టిలో పెట్టుకొని అటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్ట చర్యలు చేపట్టాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. 2028 జూన్ నాటికి ఎస్.ఎల్.బి.సి ని పూర్తి చేసేందుకు రూపొందించిన ప్రణాళికలననుసరించి 24 గంటలు 3 షిఫ్ట్‌లలో పనులు చేపడుతున్నామన్నారు. ఈ క్రమంలో సొరంగ మార్గం-1,సొరంగ మార్గం 2లో తవ్వకాలకు సంబంధించిన ఏర్పట్లపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పూర్తి స్థాయిలో సమీక్షించారు. నిర్ణీత గడువు లోపు పూర్తి చేసి నల్లగొండ జిల్లాను సస్యశ్యామలం చేయడంతో పాటు ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించాలన్నదే ప్రభుత్వ సంకల్పమని మంత్రి ఉత్తం స్పష్టం చేశారు.




# వైరల్ కంటే నిజం ముఖ్యం

**సోషల్ మీడియాపై జస్టిస్ మహేశ్వరి వ్యాఖ్యలు**

**విజయవాడ, ఫిబ్రవరి 28:**

సోషల్ మీడియాలో ప్రజలపై “కంటెంట్” ఎందుకు రుద్దబడుతుందో తెలుసుకునే ‘వివరణ హక్కు’ అవసరం అని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జె.కె. మహేశ్వరి అన్నారు. సి.ఆర్. మీడియా అకాడమీ, స్వేచ్ఛ – ది ఫ్రీడమ్ ఫౌండేషన్ నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. సోషల్ మీడియా దుర్వినియోగాన్ని ఎదుర్కోవాలంటే పౌరులు సిద్ధంగా ఉండాలని, కంటెంట్ రూపొందించే వ్యక్తులు, సంస్థలు బాధ్యత వహించాలన్నారు. ప్రస్తుత చట్టాలు నష్టం తర్వాతే అమలవుతున్నాయని, ముందస్తు నియంత్రణ వ్యవస్థ అవసరమన్నారు.పారదర్శకత లేని అల్గోరిథంలు ప్రజల ఆలోచనలను ప్రభావితం చేస్తున్నాయని, వైరల్ కంటే నిజానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. భావ ప్రకటన స్వేచ్ఛను రక్షించుకోవాల్సిన అవసరమున్నప్పటికీ, దానిని దుర్వినియోగం చేయకూడదని అన్నారు.

సి.ఆర్. మీడియా అకాడమీ చైర్మన్ శ్రీ ఆలపాటి సురేశ్ కుమార్ సోషల్ మీడియా దుర్వినియోగాన్ని అరికట్టాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర మహిళా కమిషన్ అధ్యక్షురాలు రాయపాటి శైలజ మహిళలు ప్రధాన లక్ష్యంగా మారుతున్నారని చెప్పారు. ఐజీ ఆకె రవి కృష్ణ సోషల్ మీడియా నియంత్రణకు మరిన్ని చట్టాలు అవసరమని అన్నారు. "స్వేచ్ఛ"-ది ఫ్రీడం ఫౌండేషన్ చీఫ్, న్యాయ వాది శ్రీ రవితేజ పాదిరి సుప్రీం కోర్టు జడ్జి జస్టిస్ జె.కె. మహేశ్వరి ని, ఇతర అతిథులను సభకు పరిచయం చేశారు. సమాజ హితవు కోసం తమ సంస్థ ఇటువంటి కార్యక్రమాలు ఏర్పాటు చేస్తుందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా జస్టిస్ జె. కె. మహేశ్వరి ని, ఇతర అతిథులను ఆయన సత్కరించారు. కార్యక్రమం లో న్యాయ వాదులు, పాత్రికేయులు, పుర ప్రముఖులు, అమరావతి రైతులున్నారు.

## వైభవంగా నిత్య కల్యాణోత్సవం



**ముద్ర, భువనగిరి ప్రతినిధి:**

విశ్వేశ్వరుడైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామివారిని పట్టు పీతాంబరాలు, సుగంధభరిత పుష్పమాలలతో అలంకరించి నిత్య కళ్యాణ మహోత్సవాన్ని వేదమంత్రాలు, మంగళధ్వనుల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. శనివారం ప్రాతఃకాలంలో ఆలయంలో అర్చక స్వాములు సుప్రభాత సేవను నిర్వహించి శ్రీ మహాలక్ష్మి అమ్మవారు, ముప్పది మూడు కోట్ల దేవతలు కొలువుదీరిన గోపృష్ట దర్శనం చేయించారు. సువర్ణ బిందె తీర్థాన్ని బంగారు బావి నుంచి తీసుకువచ్చి లోకకల్యాణం కోసం శ్రీ సుదర్శన నారసింహ హవనం నిర్వహించారు. అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడి అన్నప్రసాద వితరణలో భాగంగా సుమారు 5వేల మందికి పైగా భక్తులు నిత్యాన్నప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం స్వామివారిని మాడవీధుల్లో శోభాయమానంగా ఊరేగిస్తూ భక్తుల గోవింద నామస్మరణల మధ్య తిరువీధి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం సహస్రదీప కాంతుల మధ్య స్వామివారు ఊయలలో ఆసీనులై భక్తులకు దర్శనమిచ్చారు. అర్చక స్వాములు వేదమంత్రోచ్చారణలతో కర్పూర మంగళహారతులు సమర్పించగా, భక్తులు నయనానందకరంగా దర్శించుకున్నారు. అదే సందర్భంగా జల నారాయణ స్వామివారికి కూడా మంగళహారతులు సమర్పించారు.



## కాల్వల పనులు వేగవంతం చేయాలి

**ముద్ర, భువనగిరి జిల్లా ప్రతినిధి :**

నియోజకవర్గంలోని భూనాదిగాని, ధర్మారెడ్డిపల్లి, పిల్లయిపల్లి కాల్వ ల పునర్నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని భువనగిరి శాసనసభ్యుడు కుంభం అనిల్ కుమార్ రెడ్డి నీటిపారుదల, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శనివారం ఎమ్మెల్యే శిబిర కార్యాలయం లో సాగునీటి కాల్వల పునర్నిర్మాణాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాల్వల కోసం భూసేకరణ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కాల్వ ల వెంట ఉన్న విద్యుత్ స్థంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను తొలగించి పనులు వేగవంతం చేయాలని చెప్పారు. రైతులకు సాగునీరు అందేలా చర్య లు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. బోల్లేపల్లి, భీమలిం గం, అలీనగర్ కాల్వల పునర్నిర్మాణాలకు అవసరమైన అంచనాలను సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించాలని తెలిపారు. సమావేశంలో నీటిపారుదల శాఖ ప్రధాన ఇంజినీర్ రవీందర్, భువనగిరి ఆర్డీవో కృష్ణారెడ్డి, ఎస్డిసి (భూసేకరణ) జగన్నాథరావు, నీటిపారుదల శాఖ ఈఈలు శైలేందర్, ఖుర్షిద్, డీఈ, ఏఈలు పాల్గొన్నారు.

# భ్రూణహత్యల నిర్మూలనకు కఠిన చర్యలు

**ముద్ర, భువనగిరి ప్రతినిధి :**

జిల్లాలో భ్రూణహత్యలను పూర్తిగా నిర్మూలించేందుకు విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ ఎం. మనోహర్ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కార్యాలయంలో జరిగిన జిల్లా స్థాయి సలహా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ స్థాయి వరకు అవగాహన కార్యక్రమాలు, గర్భిణీల పర్యవేక్షణ, అల్ట్రాసౌండ్ కేంద్రాల తనిఖీలు, రికార్డుల సమగ్ర పరిశీలన, సీ-సెక్షన్ (ఫారం-ఎఫ్) ఆడిట్ వంటి చర్యలను క్రమం తప్పకుండా అమలు చేస్తున్నట్లు తెలిపారు. లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం, ప్రచారం చేయడం, సహకరించడం వంటి చర్యలు చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు. జిల్లాలో ఎవరైనా భ్రూణహత్యలు, అక్రమ గర్భస్రావాలు నిర్వహించినట్లయితే సంబంధితులపై మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ చట్టం, ప్రీ-కాన్సెప్షన్ అండ్ ప్రీ-నాటల్ డయాగ్నోస్టిక్ టెక్నిక్స్ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రికార్డులు సక్రమంగా నిర్వహించని కేంద్రాలపైనా చట్టపరమైన చర్యలు తప్పవని తెలిపారు. కమిటీ సభ్యులు డాక్టర్లు ఎల్. యశోద, ఎ. వీణ, నిర్మల, శ్రీదేవి, అరుదతి, నాగరాజు, శివలింగం, తాజుద్దిన్, సాయి రెడ్డి పాల్గొన్నారు. జిల్లాలో లింగ సమానత్వం సాధనకు, బాలికల పరిరక్షణకు సమాజంలోని ప్రతి వర్గం సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు.







## శ్రీనివాస్ రెడ్డికి ఐజేయూ, టీయూడబ్ల్యూజే

# నేతల అభినందనలు

**ముద్ర, డెస్క్:**

తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ గా మరోసారి నియమితులైన సీనియర్ సంపాదకులు ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ ఐజేయు జాతీయ అధ్యక్షులు కే శ్రీనివాస్ రెడ్డికి శనివారం మీడియా అకాడమీ భవనంలో ఐజేయు జాతీయ కార్యదర్శి వై నరేందర్ రెడ్డి, టీయూడబ్ల్యూజే అధ్యక్షులు కే విరహత్ అలీ, ఐజేయు జాతీయ కౌన్సిల్ సభ్యులు ఎలిమినేటి ఇంద్రారెడ్డి కలిసి పుష్పగుచ్చాన్ని అందజేసి అభినందనలు తెలియజేశారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
01.03.2026 ఆదివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



టాప్ 10 పండ్ల రసాలు

2. కమల పండు జ్యూస్

ఇది విటమిన్ C కి మంచి మూలం, రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. అలసటను తగ్గించి శరీరాన్ని తాజాగా ఉంచుతుంది.



## నన్ను చంపేస్తారో ఏమో...!

- మంత్రి వాకిటి శ్రీహరి సంచలన ఆరోపణ

**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి :**

చేస్తున్న అభివృద్ధి అడ్డుకుంటున్నారు... అభివృద్ధిలో ముందుకు వెళ్లకుండా కాళ్లలో కట్టెలు పెట్టి కిందపడేస్తున్నారు.. అభివృద్ధి ని చూడలేక.. తన ఎదుగుదల చూసి ఓర్వలేక నన్ను చంపేస్తారో ఏమో... అని రాష్ట్ర పశు సంవర్ధక, యువజనుల, క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి సంచలన వ్యాఖ్యలు చేశారు. శనివారం మక్తల్ మండలంలోని పులిమామిడిలో సబ్ స్టేషన్ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. రూ. 3.25కోట్ల ఖర్చుతో చేస్తున్న అభివృద్ధి పనులను చూడలేక కొందరు అడ్డుకుంటున్నారని, ఇతర పార్టీల నేతలను దృష్టిలో పెట్టుకుని ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. తాను చేస్తున్న అభివృద్ధిని చూసి తట్టుకోలేని కొందరు తనను చంపేందుకు కుట్ర చేస్తున్నారని మంత్రి హాట్ కామెంట్ చేశారు. ఇప్పటివరకే తనను చంపేందుకు ప్రయత్నం జరిగిందని, ఎవరు ఎన్ని కుట్రలు చేసినా మక్తల్ నియోజకవర్గం అభివృద్ధిని ఎవ్వరూ అడ్డుకోలేరన్నారు. చావు, పుట్టుక భగవంతుడు నిర్ణయిస్తాడని, ఆయన ఎప్పుడు తీసుకెళ్తే అప్పుడు వెళ్ళాల్సిందేనని మంత్రి పేర్కొన్నారు. అంతవరకు ఎవరికి భయపడేది లేదన్నారు. ఎంత మంది అడ్డుకున్నా అభివృద్ధిలో ముందుకెళుతానని, తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదన్నారు. అనంతరం మక్తల్ పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న 150 పడకల ఆసుపత్రి పనులను పరిశీలించారు. ఆసుపత్రి పనులు తుది దశ కు చేరుకున్నాయని, నిర్మాణం పనులను నాణ్యతతో చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.పెండింగ్ లో ఉన్న పనులు సత్వరమే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కొద్ది రోజుల్లో ఈ ఆసుపత్రి ప్రజలకు అందుబాటులోకి వస్తుందని మంత్రి వెల్లడించారు.



## కనకదుర్గమ్మను దర్శించుకున్న మంత్రి

**ముద్ర, భువనగిరి ప్రతినిధి :**

విజయవాడలోని శ్రీ కనకదుర్గమ్మ ఆలయాన్ని శనివారం తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించగా, ఆలయ అధికారులు, పాలక మండలి సభ్యులు జ్ఞాపిక, శాలువాతో మంత్రిని సత్కరించారు. దర్శనానికి విచ్చేసిన రెండు తెలుగు రాష్ట్రాల భక్తులతో మంత్రి ఆత్మీయంగా ముచ్చటించి వారి అభివాదాలను స్వీకరించారు. కనకదుర్గమ్మపై తనకు అపార భక్తి ఉందని పేర్కొంటూ, రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు సుఖశాంతులతో, సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు.



## ఆలయాలను కూడా వదలని రియల్ ఎస్టేట్ ముఖ్యమంత్రి

- ప్రభుత్వంపై హరీష్ రావు ఆరోపణలు

**ముద్ర ప్రతినిధి, బండ్లగూడ :**

బండ్లగూడలోని కోకాపేట్ నియోపోలిస్ ప్రాంతంలో విశాఖ శారద పీఠం, రాజ శ్యామల అమ్మవారి ఆలయ భూముల అంశంపై వివాదం నెలకొంది. కాంగ్రెస్ ప్రభుత్వం దేవాలయాలు, మఠాలను కూల్చేందుకు ప్రయత్నిస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డెప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు ఆరోపించారు. రెవెన్యూ, పోలీసు అధికారులు అకస్మాత్తుగా ఆలయాన్ని చుట్టుముట్టి ఖాళీ చేయాలని సూచించడం వల్ల భక్తుల్లో భయాందోళనలు నెలకొన్నాయని ఆయన తెలిపారు. 2019లో కేసీఆర్ ప్రభుత్వంలో కోకాపేట్ సర్వే నెంబర్ 240లో విశాఖ శారద పీఠానికి చట్టబద్ధంగా క్యాబినెట్ ఆమోదంతో రెండు ఎకరాల భూమిని కేటాయించారని హరీష్ రావు పేర్కొన్నారు. పీఠం నిర్వాహకులు రూ.1.05 కోట్లు చెల్లించి రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్నారని, హెచ్ఎండీఏకు రూ.23 లక్షలు చెల్లించి అనుమతులు తీసుకున్నారని తెలిపారు. ఇక్కడ రాజశ్యామల అమ్మవారి దేవాలయం, గోశాల, నిత్య అన్నదాన సత్రం, వేద పాఠశాల నిర్మించారని వివరించారు. ప్రభుత్వం వాటర్ వర్క్స్ అవసరాల కోసం ఈ భూమిని స్వాధీనం చేసుకుంటున్నట్లు చెబుతోందని, అయితే సమీపంలో ఉన్న భూములను పరిగణనలోకి తీసుకోలేదని హరీష్ రావు విమర్శించారు. ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులకు చెందిన సంస్థకు 17 ఎకరాల భూమిని కేటాయించారని, ఈ అంశంపై సమాచార హక్కు చట్టం కింద వివరాలు పొందినట్లు తెలిపారు. బహిరంగ వేలం నిర్వహిస్తే ప్రభుత్వానికి వందల కోట్లు ఆదాయం వచ్చేదని, కానీ నామినేషన్ పద్ధతిలో కేటాయింపులు జరిగాయని ఆరోపించారు. ఆలయాన్ని కూల్చే ప్రయత్నాలను తక్షణం విరమించుకోవాలని, లేనిపక్షంలో భక్తులతో కలిసి బీఆర్ఎస్ పార్టీ పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హరీష్ రావు హెచ్చరించారు. క్యాబినెట్ మంత్రులు జోక్యం చేసుకుని ఆలయాన్ని పరిరక్షించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఈ ప్రభుత్వం మీది.. అండగా ఉంటాం..

- మదీనా బస్సు ప్రమాద బాధిత కుటుంబ సభ్యులకు సీఎం భరోసా
- బాధిత కుటుంబాలకు పరిహారం చెక్కుల అందజేత

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**



ఈ ప్రభుత్వం మీది.. ఎటువంటి ఆందోళన చెందాల్సిన పని లేదు.. మీకు అండగా ఉంటామంటూ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి మదీనా బస్సు ప్రమాద బాధిత కుటుంబాలకు భరోసా ఇచ్చారు. రాష్ట్ర సచివాలయంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు. మదీనాలో ప్రమాద ఘటన తెలుసుకున్న వెంటనే మంత్రి అజహరుద్దీన్ నేతృత్వంలోని ప్రతినిధి బృందాన్ని మదీనాకు పంపామని సీఎం గుర్తు చేశారు. చనిపోయిన వారి కుటుంబ సభ్యులకు తక్షణమే పాస్‌పోర్టులు, వీసాలు ఇప్పించి మదీనా పంపించామన్నారు. అక్కడి భారత్ కాన్సులేట్, సౌదీ ప్రభుత్వంతో చర్చించి మృతిచెందిన వారి అంత్యక్రియలు జన్నుతుల్ బఖీలో చేయించామన్నారు. సహజంగా దేశం బయట జరిగే ప్రమాదాల్లో మృతిచెందిన వారికి ప్రభుత్వాలు పరిహారం చెల్లించవని.. కానీ తాము మాత్రం మానవతా దృక్పథంతో సహాయం చేయాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. ఇటీవల నాంపల్లి అగ్నిప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలకు పరిహారం చెల్లించామని సీఎం తెలిపారు. ఈ చెక్కులను ఇళ్లకు పంపించవచ్చని.. కానీ మీ అందరితో కలవాలని... మీకు అండగా ఉంటామనే భరోసా కల్పించాలనే ఉద్దేశంతోనే సచివాలయానికి పిలిపించామని సీఎం అన్నారు. అనంతరం ప్రమాదంలో మృతిచెందిన 44 కుటుంబాల వారికి రూ.5 లక్షల చొప్పున, తీవ్రంగా గాయపడిన వారి కుటుంబానికి రూ.3 లక్షల చెక్కును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందజేశారు. ముస్లిం సోదరులతో తనకున్న అనుబంధాన్ని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. తాను కొడంగల్ ఎమ్మెల్యేగా ఎన్నికైన 2009 సంవత్సరం నుంచి నియోజకవర్గంలోని అయిదు మండలాల నుంచి ఒకొక్కరి చొప్పున ఏటా అయిదుగురిని తన సొంత ఖర్చులతో హజ్ యాత్రకు పంపుతున్నానని సీఎం తెలిపారు. వారిని ఎంపిక చేసే బాధ్యత స్థానిక ముస్లిం మత పెద్దలకే అప్పజెప్పానన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, నాంపల్లి ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్, హజ్ కమిటీ ఛైర్మన్ ఖుస్రో పాషా, తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ (టీజీఎంఆర్ఈఐఎస్ వైస్ ఛైర్మన్ ఫహీం ఖురేషి, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఏపీలో భారీ పేలుడు.. 21 మంది మృతి

- సామర్లకోట బాణసంచా తయారీ కేంద్రంలో ప్రమాదం
- 34 మంది కార్మికుల్లో 21 మంది మృతి, 13 మంది గాయాలు

**ముద్ర, ఏపీ న్యూస్ :**



కాకినాడ జిల్లాలోని సామర్లకోట మండలంలోని బాణసంచా తయారీ పరిశ్రమలో భారీ పేలుడు సంభవించింది. మండలంలోని వేట్లపాలెం పరిధిలో గోదావరి కాలువ పక్కన ఉన్న సూర్య శ్రీ ఫైర్‌వర్క్స్ కేంద్రంలో శనివారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఒక్కసారిగా పేలుడు జరిగింది. ఈ ఘటనలో 21 మంది ప్రాణాలు కోల్పోయారు. భారీ ఎత్తున మంటలు ఎగసిపడడంతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ వ్యాపించింది. పేలుడు శబ్దాలు సుమారు 5 కిలోమీటర్ల మేర వినిపించాయని స్థానికులు తెలిపారు. శబ్దం తీవ్రతకు పక్క గ్రామంలోని ప్రైవేట్ పాఠశాల స్లాబ్‌కు పగుళ్లు వచ్చాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది రెండు ఫైర్ ఇంజిన్ల సాయంతో మంటలు ఆర్పేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో మొత్తం 34 మంది పనిచేస్తుండగా, వీరిలో 21 మంది మృతి చెందారు, 13 మంది తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో 9 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. మృతుల్లో ఎక్కువ మంది మహిళలే ఉన్నట్లు సమాచారం. బాణసంచా పరిశ్రమను అడపా నాని కుటుంబ సభ్యులు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. పరిమితికి మించి బాణసంచా తయారు చేయడం వల్లే ఘటన జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు.

**భారీ విస్ఫోటనం..**

పేలుడు సంభవించినప్పుడు భారీ శబ్దం వచ్చినట్లు స్థానికులు తెలిపారు. పేలుడు ధాటికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. ఐదు గ్రామాల పరిధిలో దట్టమైన పొగలు అలముకున్నాయి. ఘటనాస్థలికి స్థానికులు చేరుకునే సరికి అందులో చిక్కుకున్న పలువురు అగ్నికి ఆహుతయ్యారు. సంఘటన స్థలంలో శరీర భాగాలు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. కొన్ని మృతదేహాలు పూర్తిగా కాలిపోయాయి.

**ఘటనపై సీఎం చంద్రబాబు ఆరా**

ప్రస్తుతం విజయనగరం జిల్లా పర్యటనలో ఉన్న సీఎం చంద్రబాబు పేలుడు ఘటనపై ఆరా తీశారు. అక్కడి పరిస్థితులను అధికారులు ఆయనకు వివరించారు. తక్షణం సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఘటనాస్థలికి వెళ్లాలని హోం మంత్రి అనితకు సూచించారు. ఈ మేరకు హోం మంత్రి అనిత అక్కడికి బయలుదేరారు. ఇప్పటికే జిల్లా ఎస్పీ, కలెక్టర్ సంఘటన స్థలికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు.

**మృతులు వీరే..**

మృతుల్లో ఇప్పటివరకు 11 మంది మృతదేహాలను పోలీసులు గుర్తించారు. మృతులను అడబాల శ్రీను, కడింపల్లి కృపమ్మ, కడింపల్లి ధనరాజు, సాధనాల సత్యవేణి, వట్లూరి రవి, మందపల్లి చిన్ని, నిమ్మద కరుణ, గంపల మంగ, గొడతా మహేశ్, గొడతా రాము, గొడతా నానిగా పోలీసులు పేర్కొన్నారు. ఇంకా కొందరి మృతదేహాలను గుర్తించాల్సి ఉంది.

## నిధులు మంజూరు చేసిన త్రిపుర గవర్నర్

- ఘనంగా సన్మానించిన గానుగుబండ గ్రామస్థులు

**ముద్ర, తుంగతుర్తి :**



సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం గానుగుబండ గ్రామానికి చెందిన త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డిని ఆ గ్రామ సర్పంచ్ మాతంగి వెంకటమ్మ కరుణాకర్‌తోపాటు గ్రామ పెద్దలు శనివారం హైదరాబాద్‌లోని లోక్‌భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా గవర్నర్‌ను శాలువాలతో ఘనంగా సన్మానించారు. తన జన్మస్థలమైన గానుగుబండ గ్రామం నుంచి సర్పంచ్‌తోపాటు గ్రామ పెద్దలు రావడం ఆనందంగా ఉందని, గ్రామ అభివృద్ధికి తన వంతు సహాయం అందిస్తానని గవర్నర్ పేర్కొన్నట్లు సర్పంచ్ తెలిపారు. గ్రామానికి గ్రామపంచాయతీ భవనం లేకపోవడంతో తన సొంత ఇంటిని గ్రామపంచాయతీ కార్యాలయంగా విరాళంగా ఇస్తానని గవర్నర్ ప్రకటించినట్లు తెలిపారు. అలాగే గ్రామంలో రూ.50 లక్షలతో సీసీ రోడ్లు, కరివిరాల నుంచి వెంపటి వరకు తారు రోడ్డు సౌకర్యం, నిరుపేదలకు 50 పక్కా ఇళ్లు, రూ. 50లక్షల వ్యయంతో వెనుకబడిన తరగతుల వారికి కమ్యూనిటీ హాల్ మంజూరు చేస్తున్నట్లు వెల్లడించారు. గ్రామ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసినందుకు సర్పంచ్‌తో పాటు గ్రామ పెద్దలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నల్లు రామచంద్రారెడ్డి, గుండగాని రాములు గౌడ్, మాజీ ఎంపీటీసీ గుండగాని దుర్గయ్య గౌడ్, సింగిల్ విండో డైరెక్టర్ కుశలవ రెడ్డి, వార్డు సభ్యులు ఆశాలు, వెలిశాల వెంకన్న, ఎనగందుల రామచంద్రయ్య, పోలేపాక సోమయ్య, పోలేపాక రవి, పంజాల సతీష్, భూపతి సైదులు, పోలేపాక సతీష్, వై. రమేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# పేదల ఇళ్ల జోలికి వస్తే భరతం పడతాం

- కాంగ్రెస్ పేదల ఇళ్లను కూల్చడమే పనిగా పెట్టుకుంది
- ఇవ్వాల్సింది పోయి.. లాక్కుంటోంది
- అసైన్డ్, ఇనాం, భూదాన్ భూములు ఎవరి చేతుల్లో ఉన్నాయో లెక్క తీయాలి
- మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్
- వెనుగుమట్ల నిరాశ్రీయులకు పరామర్శ

**ముద్ర, ఖమ్మం :**



కబ్జాలు చేసిన పెద్దలను వదిలేసి కేవలం నిరుపేదల ఇండ్లు కూల్చివేయటం ఏంటని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ రాష్ట్ర ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని అసైన్డ్, ఇనాం, భూదాన్ భూములు ఎవరి చేతుల్లో ఉన్నాయో తెలుసుకోవాలన్నారు. ఆ లెక్కలు తీసే దమ్ము, ధైర్యం ఈ ప్రభుత్వానికి ఉందా అని సవాల్ చేశారు. పేదల ఇళ్ల జోలికి వస్తే ప్రభుత్వం భరతం పడతామని హెచ్చరించారు. ఖమ్మం జిల్లా వెలుగుమట్ల కూల్చివేతల బాధితులను శనివారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన ఈ భూములపై గతంలో కేసీఆర్ ప్రభుత్వం కూడా కన్నేసిందని నాడు ప్రజల తిరుగుబాటును చూసి కేసీఆర్ వెనక్కి తగ్గారన్నారు. రేవంత్ రెడ్డికి పేదల ఇళ్లను కూల్చడం మాత్రమే తెలుసన్నారు. పేదలకు భూములు ఇవ్వకపోగా ఉన్నది కూడా లాక్కుంటోందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఇళ్లపై కన్నేసిందని ఆరోపించారు. వెనుగుమట్లలో అధికారులు, పోలీసులు దౌర్జన్యం చేశారన్న ఆయన.. వంటసామాగ్రినీ ఎత్తుకుపోయారని మండిపడ్డారు. శత్రుదేశం దాడి చేసినట్లుగా ప్రభుత్వం పోలీసులను మోహరించి పేదల ఇళ్లను కూల్చడం దారుణమన్నారు. పేదల పట్ల ఈ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏంటో ఈ ఘటనతో తేటతెల్లమైందన్నారు. కూల్చిన చోటే కొత్త ఇండ్లు కట్టించి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీసీఎల్ఏ సుమోటోగా ఒక ఆర్డర్ ఇచ్చి యుద్ధభూమిని తరలించేలా ఇళ్లను కూలగొట్టిందని మండిపడ్డారు. చిన్నపిల్లలు గర్భిణీలు వృద్ధులనీ కూడా చూడకుండా వారి సామాగ్రిని డోజర్లతో తొక్కించి, శత్రువుల మీద దాడి చేసినట్లు చేశారని ధ్వజమెత్తారు. సభ్య సమాజమే తలదించుకునే నీచానికి సీఎం రేవంత్ రెడ్డి ఒడిగడ్డారని విరుచుకుపడ్డారు. కేసులు పెడితేనో, జైలులో పడితే తెలంగాణ సమాజం భయపడేది కాదన్న ఈటల... సందర్భం వచ్చినప్పుడు దుర్మార్గపు ప్రభుత్వాన్ని తొక్కి భూస్థాపితం చేస్తుందన్నారు. వెలుగుమట్ల ప్రజానికి తెలంగాణలో ఉన్న ప్రజలంతా అండగా ఉన్నారని చెప్పారు. గత ప్రభుత్వాన్ని కూలగొట్టి ఈ ప్రభుత్వానికి గద్దెనెక్కించిన ప్రజలు.. పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డామని బాధపడుతున్నారని చెప్పారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
ఆదివారం 1.03.2026



నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిననేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

## ఓ సాహితీ సామ్రాజ్ఞి!



కళ్ళముందుకు వస్తావు,
చూపులు పట్టేస్తావు,
దృశ్యాన్ని చూపుతావు,
అందాల బొమ్మను చేయిస్తావు.

తలలోకి దూరతావు,
ఆలోచనలు పారిస్తావు,
భావాన్ని పుట్టిస్తావు,
చక్కని రూపాన్ని ఇప్పిస్తావు.

తెల్ల కాగితాన్ని ఇస్తావు,
కలాన్ని చేత పట్టిస్తావు,
నల్లని అక్షరాల్ని గీయిస్తావు,
కమ్మని కవితను కూర్పిస్తావు.

మట్టి ప్రమిదను అందిస్తావు,
నూనెను నిండుగా నింపిస్తావు,
చిరు దివ్వెను వెలిగిస్తావు,
కాంతి కిరణాల్ని వెదజల్లిస్తావు.

అంధకారమై ఆవరిస్తావు,
జాబిలిని పొడిపిస్తావు,
వెన్నెలను కురిపిస్తావు,
మదులను మురిపింపజేస్తావు.

అసంపూర్ణ వాక్యనివై వస్తావు,
ప్రాసలు చేర్చమంటావు,
అలంకారాలు వాడమంటావు,
అద్భుత కవనాన్ని అల్లిస్తావు.

తేనెచుక్కలు చల్లుతావు,
పెదాలను తెరిపిస్తావు,
స్వరాలను పలికిస్తావు,
మోహన రాగాలు పాడిస్తావు.

హరివిల్లును పొడిపిస్తావు,
ఏడు రంగులను చూపిస్తావు,
కుంచెను చేతబట్టమంటావు,
విచిత్ర చిత్రాన్ని తయారుచేయిస్తావు.


నల్లరాయిని విసురుతావు,
ఉలిని పట్టుకోమంటావు,
బండను చెక్కమంటావు,
సుందర శిల్పాన్ని చేయిస్తావు.

సముద్రానివై వస్తావు,
నదిలా పారమంటావు,
జీవిత పయనం సాగించమంటావు,
నీలో చివరకు కలుపుకుంటావు.

నిశ్శబ్దాన్నే కూర్చుంటే,
నాలో మాటలు మేల్కొలుపుతావు,
నిరాశలోనూ దీపమవుతావు,
నా జీవిత నౌకకు
దారిచూపే దిక్సూచివవుతావు.

సాహితీ సామ్రాజ్ఞివై వస్తావు,
సృష్టికి సింహాసనం వేస్తావు,
నా శ్వాసలో శబ్దమవుతావు,
నన్నే నీ కవిగా మార్చుకుంటావు.

- గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్
భాగ్యనగరం



# విద్యా కమిషన్ నివేదిక పాఠశాలల మనుగడకు గొడ్డలిపెట్టు




**"సర్వం గురు భిక్ష"**
**గురువు జీతగాడు కాదు జీవిత నిర్మాణ సారధి...**
**గురువు జీతగాడు కాదు**
**అజ్ఞానాన్ని చీల్చే జ్ఞానయోధుడు...**
**గురువు జీతగాడు కాదు**
**బతుకు దారి చూపే బ్రహ్మర్షి...**
**గురువు జీతగాడు కాదు**

నలుదిక్కులు నడిపించే నాయకుడు... అటువంటి టీచర్ల పై ఎందుకింత ఆక్రోశం, ఎందుకింత అక్కసు. ఇటీవల విద్యా కమిషన్ ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలో ఉపాధ్యాయులపై అభ్యంతరకర వ్యాఖ్యలను చేయడంతో ఉపాధ్యాయ లోకం నివ్వెరపోయింది.

ఆకునూరి మురళి గారు ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలోని అంశాలని నిశితంగా పరిశీలిస్తే ఒక విశ్రాంత ఐఏఎస్ అధికారి ఉపాధ్యాయుల జీతాలను "ఎక్కువ" అని పేర్కొనడం వెనుక ఉన్న పాలనాపరమైన దృక్పథం ఏమిటంటే ప్రభుత్వం తన ఆదాయంలో 40–50% కేవలం జీతాలు, పెన్షన్లకే ఖర్చు చేస్తోందనే గణాంకాలను చూపిస్తూ, సంక్షేమ పథకాలకు నిధులు సరిపోవడం లేదని వాదించడంగా కనబడుతున్నది. జీతాలు పెరిగినా ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతం లేదా విద్యార్థుల నమోదు ఆశించిన స్థాయిలో లేదని సాకుగా చూపడం విడ్డూరంగా ఉన్నది. ఉపాధ్యాయుల వేతనాలను తగ్గించాలని చూడటం పరోక్షంగా ప్రభుత్వ విద్యను బలహీనపరిచి, కార్పొరేట్ శక్తులకు మేలు చేసే ప్రమాదం కూడా ఉన్నది. ప్రతి 5 ఏళ్లకు జరగాల్సిన పీఆర్సీని 2–3 ఏళ్లు ఆలస్యం చేయడం అనేది కేవలం పరిపాలనా లోపం మాత్రమే కాదు,అది ఒక ఆర్థిక వ్యూహం గా కనిపిస్తోంది వేల కోట్ల రూపాయల వేతన పెంపును 3 ఏళ్లు ఆపడం ద్వారా ప్రభుత్వం ఆ నిధులను ఇతర పథకాలకు వాడుకుంటుంది. ఇది ఉపాధ్యాయులకు రావాల్సిన సొమ్మును ప్రభుత్వం వడ్డీ లేని రుణంగా వాడుకోవడమే. ఆలస్యంగా అమలు చేయడం వల్ల పాత బకాయిలను బాండ్ల రూపంలోనో లేదా భవిష్యత్ నిధి లోనో జమ చేసి, ప్రస్తుత నగదు చెల్లింపులను ప్రభుత్వం తప్పించు కుంటుంది.

డీఏ అనేది జీతంలో భాగం కాదు, ఇది "ధరల పెరుగుదల సర్దుబాటు". దీనిని నిలిపివేయడం అంటే ఉపాధ్యాయుని కొనుగోలు శక్తిని తగ్గించడమే. నియామక సమయంలో ఉన్న సేవా నిబంధనల ప్రకారం వేతన సవరణ అనేది ఒక హక్కు. దీనిని ఏకపక్షంగా కమిషన్ నివేదికల ద్వారా తగ్గించడం చట్టవిరుద్ధం.

కమిషన్ నివేదికలో ఉపాధ్యాయుల జీతాలు "ఎక్కువ" అని పేర్కొనడం ఏ ప్రాతిపదికన చేశారో ఆయనకే తెలియాలి. ఉపాధ్యాయులు అత్యున్నత విద్యార్హతలు కలిగి ఉండి, రాష్ట్రస్థాయి పోటీ పరీక్షల్లో నిరూపించుకుని ఎంపికైన వారు. ఇతర ప్రభుత్వ విభాగాల్లోని గెజిటెడ్ అధికారులతో పోలిస్తే ఉపాధ్యాయుల వేతనాలు ఏమాత్రం ఎక్కువ కావు అనేది అక్షర సత్యం.ఉపాధ్యాయులు కేవలం బోధనే కాకుండా, మధ్యాహ్న భోజన పథకం, గణన ,ఎన్నికల విధులు మరియు నిరంతర యాప్ డేటా ఎంట్రీ వంటి పనులతో తీవ్ర పని ఒత్తిడిలో ఉన్నారు. దీనిని పరిగణనలోకి తీసుకోకుండా కేవలం జీతాన్ని మాత్రమే లెక్కగట్టడం సరైనది కాదు. ప్రతి 5 ఏళ్లకు ఒకసారి పే రివిజన్ జరగడం అనేది చట్టబద్ధమైన సంప్రదాయం. కానీ గత కొన్ని కాలాలుగా 2 నుండి 3 ఏళ్ల జాప్యం జరుగుతోంది.విద్యా కమిషన్ నివేదికలోని "వేతనాల పునఃసమీక్ష /తగ్గింపు" సిఫార్సులను ప్రభుత్వం తక్షణమే తిరస్కరించాలి.తదుపరి పీఆర్సీని ఎటువంటి ఆలస్యం లేకుండా, గడువు ముగిసిన వెంటనే అమలు చేయాలి. పెండింగ్‌లో ఉన్న అన్ని డీఏ వాయిదాలను తక్షణమే నగదు రూపంలో విడుదల చేయాలి.విద్యా సంస్కరణల్లో ఉపాధ్యాయులను భాగస్వామ్యం చేయాలి తప్ప, వారిని ఆర్థికంగా బలహీనపరచకూడదు.

నిరంకుశ పరిపాలనకు వ్యతిరేకంగా పోరాడి,గడిల పాలనకు స్వస్తపలికి ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పరచిన ఘనత కాంగ్రెస్ సర్కారు సొంతం.విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావాలని సదుద్దేశ్యంతో అధికారంలోకి వచ్చి టీచర్ల కు ప్రమోషన్లు ఇచ్చారు. బదిలీలు చేపట్టారు.2018 లో అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం తెలుగు మహాసభలు నిర్వహించి భాషా పండితుల సేవలను వినియోగించుకుని పండిట్ అప్ గ్రేడేషన్ చేస్తామని ఆశపెట్టింది.ఆ తరువాత కోర్టుకేసు లు అంటూ దాటవేసింది. కాంగ్రెస్ సర్కారు ఏర్పాటు కాగానే రెండు దశాబ్దాలుగా పెండింగ్ లో ఉన్న భాషా పండితుల ఉన్నతీకరణ గౌరవ ముఖ్యమంత్రి గారు తీసుకున్న సాహసోపేత నిర్ణయం వలన రాష్ట్రంలో భాషాపండితులు,పి.ఈ.టీ.లు అప్ గ్రేడ్ అయ్యారు. ఒకటవ తేదీనే జీతాలు వచ్చేటట్లు చేసిన ఘనత కాంగ్రెస్ సర్కారుకు దక్కింది.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగుండక పోయినా సుమారు 11వేల టీచర్ల నియామకం చేశారు. విద్యారంగాన్ని అభివృద్ధి చేయాలనే సంకల్పంతో విద్యాశాఖపై ఎన్నో సమీక్షలు నిర్వహించారు.గత ముఖ్యమంత్రి ఏనాడు ఇన్ని సమీక్షలు చేసిన పాపాన పోలేదు.ఇంతచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అభాసుపాలు చేయాలని, ప్రజల లో , ఉద్యోగుల్లో, ఉపాధ్యాయుల్లో సర్కారుపై వ్యతిరేకత తీసుకురాడానికి ప్రతిపక్ష పార్టీలు శతవిధాల ప్రయత్నిస్తున్నాయి. అలాంటివారికి అవకాశం కల్పించేలా 'ఆకునూరిమురళి ఆధ్వర్యంలో తయారైన విద్యానివేదిక ఉన్నది.

గతంలో విద్యారంగానికి, టీచర్లకు నష్టం కలిగించేలా 317 జీవో లాంటి ఎన్నో ఉపాధ్యాయ వ్యతిరేక నిర్ణయాలు తీసుకున్న గత ప్రభుత్వం తమ రాజకీయ పబ్బం గడుపుకోవడం కోసం టీచర్లను రెచ్చగొట్టడానికి ఈ విద్యాకమీషన్ సిఫార్సులను వాడుకుంటున్నట్లు కనిపిస్తున్నది.ఆఖరికి విద్యను ప్రైవేటుపరం చేసేలా ప్రైవేటు యూనివర్సిటీలకు అవకాశం ఇచ్చిన పార్టీలు, ఇన్ సర్వీసు టీచర్లకు తప్పనిసరి టెట్ పరీక్ష పెట్టి ఇబ్బంది పెడుతున్న ప్రభుత్వాలు,టీచర్లకు గ్రేడింగ్ లు ఇవ్వాలని తద్వారా ప్రమోషన్లు,ఇంక్రిమెంట్లు ఇవ్వాలని తమ నూతన విద్యా విధానంలో ప్రతిపాదనల ద్వారా సూచించిన ప్రభుత్వాలు కూడా విద్యాకమీషన్ సిఫార్సులను అడ్డుపెట్టుకొని టీచర్లమీద ప్రేమ ఒలకపోస్తూ, తమ రాజకీయం కోసం వారిని రెచ్చగొడుతున్నారు.

రోటీ, కపడా ఔర్ మకాన్, గరీబీ హఠావో అంటూ పేదలపక్షాన నిలబడిన ఉద్యోగ ఉపాధ్యాయ ఫ్రెండ్లీగా ఉండే ప్రజా స్వామ్య కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు అవాకులు చవాకులు పేలే విధంగా మురళి గారి విద్యాకమీషన్ సిఫార్సులు ఉన్నవి.అధికారులు గౌరవ ముఖ్యమంత్రి గారిని తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారు అనడంలో అతిశయోక్తి లేదు.వారు ఎవరికి లాభం చేకూర్చాలనుకుంటున్నారో మరి.ఆకునూరి మురళి గారి సిఫార్సులను ఒకసారి పునఃపరిశీలన చేయాలి. ఎటువంటి పైరవీలకు తావులేకుండా ఉద్యమసంఘాలుగా పేరుగాంచి కుల,మత,ప్రాంత భేదాలు లేకుండా ప్రజాస్వామ్యపద్ధతిలో నడుస్తున్న ఉపాధ్యాయ సంఘాలతో విద్యాకమీషన్ సిఫార్సులపై సమావేశం నిర్వహించి దానిలో ఉపాధ్యాయులకు విద్యారంగానికి చేటు కలిగించే అంశాలను తొలగించాలని ఆ దిశగా చర్యలు చేపడుతారని ఆశిస్తున్నాము.



- సుధాకర్.ఏ.వి
★ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు
★ స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్ (STUTS)
★ 9000674747

# బడ్జెట్ అనంతరం బరిలోకి ప్రభుత్వం

**గ్రామీణ రాజకీయాలకు సంకేతం**
**పల్లె ఎన్నికలపై రేవంత్ సర్కార్ దృష్టి**




తెలంగాణ రాజకీయాల్లో స్థానిక సంస్థల ఎన్నికలు కేవలం పరిపాలనా ప్రక్రియలు మాత్రమే కాదు; రాష్ట్ర రాజకీయ దిశను నిర్దేశించే సూచికలు. గ్రామ పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్తులు ప్రజాస్వామ్యపు పునాది స్థాయిలుగా పనిచేస్తూ ప్రజా అభిప్రాయాన్ని నేరుగా ప్రతిబింబిస్తాయి. అందువల్ల పరిషత్ ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం తీసుకునే నిర్ణయం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.

రాష్ట్ర ఏర్పాటుకి తర్వాత స్థానిక సంస్థల బలోపేతం ప్రతి ప్రభుత్వానికి ముఖ్య లక్ష్యంగా నిలిచింది. గ్రామీణాభివృద్ధి, వికేంద్రీకరణ, పారదర్శకత వంటి అంశాలు పరిషత్ వ్యవస్థ ద్వారా అమలవుతున్నాయి. మండల, జిల్లా పరిషత్తులు అభివృద్ధి పనుల పర్యవేక్షణ, నిధుల వినియోగం, స్థానిక అవసరాల గుర్తింపులో కీలక పాత్ర పోషిస్తున్నాయి.

రాజ్యాంగంలోని 73వ సవరణ ప్రకారం స్థానిక సంస్థలకు ఐదేళ్ల పదవీకాలం ఉండగా, గడువు ముగిసేలోపు ఎన్నికలు నిర్వహించడం రాష్ట్ర ఎన్నికల సంఘం బాధ్యత. అయితే రాజకీయ వాతావరణం, పరిపాలనా సిద్ధత, చట్టపరమైన అంశాలు ఎన్నికల సమయాన్ని ప్రభావితం చేస్తున్నాయి. ఇప్పటికే పరిషత్ ఎన్నికల విషయంలో జాప్యం చోటు చేసుకుంది.

ప్రస్తుతం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం గ్రామీణాభివృద్ధిని ప్రధాన అజెండాగా తీసుకుంటోంది. రైతు సంక్షేమం, మౌలిక వసతులు, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలతో ఎన్నికలకు వెళ్లాలని వ్యూహం కనిపిస్తోంది. ముఖ్యంగా బీసీ రిజర్వేషన్లపై స్పష్టత వచ్చిన తర్వాత ఎన్నికలు నిర్వహించడం రాజకీయంగా అనుకూలమని భావిస్తున్నారు.

బీసీ రిజర్వేషన్లు ఈ ఎన్నికల్లో కీలక అంశం. సుప్రీంకోర్టు మార్గదర్శకాలు, ట్రిపుల్ టెస్ట్ విధానం, జనాభా ఆధారిత డేటా వంటి అంశాల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి. స్పష్టత లేకుండా ఎన్నికలకు వెళ్లడం చట్టపరమైన సమస్యలకు దారితీయవచ్చు. అందుకే ముందుగా అధ్యయనాలు, కమిషన్ నివేదికలు సిద్ధం చేసే దిశగా ప్రభుత్వం కదులుతోంది.

పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు ప్రభుత్వానికి ఒక సూచికగా మారాయి. పట్టణ మద్దతు గ్రామీణ ప్రాంతాల్లో ఎంతవరకు ప్రతిఫలిస్తుందన్నది కీలకం. వ్యవసాయ పరిస్థితులు, ఉపాధి హామీ, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలు గ్రామీణ ఓటర్లపై ప్రభావం చూపనున్నాయి.

బడ్జెట్ సమావేశాల అనంతరం ఎన్నికలు నిర్వహించడం ద్వారా ప్రభుత్వం తన ఆర్థిక ప్రాధాన్యతలను ప్రజలకు తెలియజేయాలని చూస్తోంది. గ్రామీణాభివృద్ధి, సాగునీటి ప్రాజెక్టులు, మహిళా సంఘాలు, యువత ఉపాధి వంటి అంశాలకు కేటాయింపులు ఎన్నికల ప్రచారంలో కీలకంగా మారే అవకాశం ఉంది.

సామాజిక సమీకరణ కూడా కీలకం. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళలకు రిజర్వేషన్లు అమలు చేయడం ద్వారా స్థానిక నాయకత్వంలో విస్తృత ప్రతినిధిత్వం లభిస్తుంది. అయితే రిజర్వేషన్ శాతం, వార్డు పునర్విభజన వంటి అంశాలు వివాదాలకు దారితీయవచ్చు.

పరిషత్ ఎన్నికలు పార్టీ ప్రభావాన్ని కొలిచే పరీక్షగా భావించబడుతున్నాయి. అధికార పార్టీకి పాలనపై ప్రజా అభిప్రాయాన్ని అంచనా వేసే వేదికగా, ప్రతిపక్షాలకు అసంతృప్తిని సమీకరించే అవకాశంగా ఇవి నిలుస్తాయి. ప్రచార వ్యూహాలు, అభ్యర్థుల ఎంపిక, కూటములు కీలకంగా మారనున్నాయి.

పరిపాలనా పరంగా కూడా ఎన్నికల నిర్వహణ పెద్ద సవాలు. ఓటరు జాబితాలు, పోలింగ్ కేంద్రాలు, భద్రతా ఏర్పాట్లు వంటి అంశాల్లో సమగ్ర ప్రణాళిక అవసరం. సాంకేతికత వినియోగంతో పారదర్శకత పెంచాలని ప్రభుత్వం భావిస్తోంది.

యువత, మహిళా ఓటర్లపై ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ఉపాధి, స్వయం సహాయక సంఘాలు, గ్రామీణ వ్యాపారాలకు ప్రోత్సాహం వంటి అంశాలు ఎన్నికల్లో ప్రధాన చర్చగా మారవచ్చు.

మొత్తానికి పరిషత్ ఎన్నికలు భవిష్యత్ అసెంబ్లీ ఎన్నికలకు ముందస్తు సంకేతంగా భావించబడుతున్నాయి. బీసీ రిజర్వేషన్లు, బడ్జెట్ ప్రభావం, గ్రామీణ వాతావరణం—ఈ మూడు అంశాల సమన్వయమే తుది ఫలితాన్ని నిర్ణయించే అవకాశముంది. తెలంగాణ రాజకీయాల్లో ఈ ఎన్నికలు కీలక మలుపుగా నిలిచే అవకాశముంది.

– రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...
9440585494

## గ్రామోద్యోగ వికాస్ యోజనలో
# 530 మందికి లబ్ధి




ముద్ర, సికింద్రాబాద్ : గ్రామీణ ఉపాధి బలోపేతం, స్వయం ఉపాధి ప్రోత్సాహం లక్ష్యంగా ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ (KVIC) ఆధ్వర్యంలో గ్రామోద్యోగ వికాస్ యోజన కార్యక్రమం శనివారం సికింద్రాబాద్‌లోని ప్యారడైజ్ సర్కిల్ సమీపంలోని క్లాసిక్ గార్డెన్స్‌లో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి, సికింద్రాబాద్ ఎంపీ జి. కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, KVIC చైర్మన్ మనోజ్ కుమార్ సమక్షంలో లబ్ధిదారులకు యంత్రాలు, టూల్‌కిట్లు పంపిణీ చేశారు. సంప్రదాయ గ్రామీణ వృత్తుల్లో ఉన్న 530 మంది కళాకారులకు మొత్తం 496 యంత్రాలు, టూల్‌కిట్లు అందజేశారు. చెప్పుల తయారీ, మట్టి పనులు, కుట్టు, అగరబత్తి తయారీ, మొబైల్ రిపేరింగ్, చెక్క పనులు, గ్రామీణ నూనె ఉత్పత్తి రంగాలకు సంబంధించిన పరికరాలు ఈ పంపిణీలో భాగమయ్యాయి. ప్రధాన మంత్రి ఉపాధి సృష్టి కార్యక్రమం (PMEGP) కింద కూడా లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందించారు. దేశవ్యాప్తంగా 2,384 ప్రాజెక్టులకు రూ.73.58 కోట్లు మార్జిన్ మనీ విడుదల చేయగా, దీని ద్వారా 26,224 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.ఈ సందర్భంగా మంత్రి జి. కిషన్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామీణ పరిశ్రమల అభివృద్ధి ద్వారా స్థానిక స్థాయిలో స్థిరమైన ఉపాధి పెరుగుతుందని, వలసలు తగ్గుతాయని తెలిపారు. "ఖాదీ ఫర్ నేషన్, ఖాదీ ఫర్ ఫ్యాషన్, ఖాదీ ఫర్ ఎంప్లాయ్‌మెంట్" అనే భావనతో స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించాలని సూచిం చారు. కుట్టు యంత్రాలు పొందిన మహిళలు తమ కార్యకలాపాలను విస్తరించి మరింత ఉపాధి సృష్టించాలని పిలుపునిచ్చారు.

KVIC చైర్మన్ మనోజ్ కుమార్ మాట్లాడుతూ, సాంకేతిక సహాయం, ఆర్థిక మద్దతు, మార్కెట్ అవకాశాల ద్వారా గ్రామీణ వృత్తులు స్థిరమైన వ్యాపారాలుగా మారుతున్నాయని చెప్పారు. నాణ్యత, మెరుగైన ప్రదర్శన, మార్కెట్ దృష్టితో ఉత్పత్తులు తయారు చేస్తే జాతీయ స్థాయిలో పోటీ చేయగలమన్నారు. తెలంగాణలో గత మూడు సంవత్సరాల్లో గ్రామోద్యోగ కార్యక్రమాల కింద 1,720 మంది కళాకారులకు 1,790 యంత్రాలు, టూల్‌కిట్లు పంపిణీ చేసి సుమారు రూ.3.59 కోట్లు ఖర్చు చేశారు. PMEGP కింద రూ.285.08 కోట్ల మార్జిన్ మనీతో 6,501 యూనిట్లు స్థాపించి 64,002 మందికి ఉపాధి కల్పించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025–26లో 2,148 ప్రాజెక్టుల ద్వారా 23,628 ఉపాధి అవకాశాలు సృష్టించి, వార్షిక లక్ష్యంలో సుమారు 96 శాతం సాధించారు.అదనంగా రాష్ట్రంలో వర్క్‌షెడ్లు, విక్రయ కేంద్రాల నవీకరణ, వనపర్తి జరీ–జర్దోసీ క్లస్టర్ అభివృద్ధి, విలువ ఆధారిత మిల్లెట్ ఉత్పత్తుల సాంకేతిక ప్రాజెక్టులకు KVIC మద్దతు అందిస్తోంది.ఖాదీ సంస్థల ప్రతినిధులు, లబ్ధిదారులు, తెలంగాణ ప్రభుత్వం KVIC అధికారులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
ఆదివారం 01.03.2026
www.mudranews.in | @mudranews



టాప్ 10 పండ్ల రసాలు

3. దానిమ్మ జ్యూస్ (Pomegranate Juice)



రక్తహీనతను తగ్గించడంలో సహాయపడుతుంది. గుండె ఆరోగ్యానికి మంచిది మరియు రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది.

# వికారాబాద్ కలెక్టర్ గా దీపక్ తివారి బాధ్యతల స్వీకరణ

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**

వికారాబాద్ జిల్లా నూతన జిల్లా కలెక్టర్‌గా దీపక్ తివారి శనివారం సాయంత్రం ఐడీఓసి కార్యాలయంలోని తన ఛాంబర్‌లో తొలి సంతకం చేసి అధికారికంగా పదవీ బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాజేశ్వరి, ఎసి ఎల్ బి సుధీర్, ట్రైని కలెక్టర్ హర్ష్ చౌదరి, నూతన కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలోని అన్ని శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది హాజరై నూతన కలెక్టర్‌కు అభినందనలు తెలిపారు.



అనంతరం కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా అధికారుల పరిచయ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ దీపక్ తివారి మాట్లాడుతూ వికారాబాద్ జిల్లాలో జిల్లా కలెక్టర్‌గా పని చేసే అవకాశం లభించడం తనకు గౌరవంగా సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యతలు, లక్ష్యాల మేరకు అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ పారదర్శకత, విద్యా, వైద్యం ప్రధాన లక్ష్యాలుగా పెట్టుకుని సమర్థవంతమైన పరిపాలన అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తూ వేగవంతమైన సేవలందించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. జిల్లా అభివృద్ధి, సంక్షేమ పథకాల సమర్థవంతమైన అమలు, ప్రజలతో సత్సంబంధాలు నెలకొల్పడం వంటి అంశాల్లో సమగ్రంగా ముందుకు సాగాలని అన్ని శాఖల అధికారులకు సూచించారు. శాఖల వారీగా, మండలం వారీగా రివ్యూ చేస్తానని, మీరు చేపట్టే పనులు అభివృద్ధి ఫొటోలు, పూర్తి వివరాల తో నోట్ సమర్పించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమం లో డిఆర్ఓ మంగీలాల్, ఆర్డీవో వాసు చంద్ర, కాడ అభివృద్ధి అధికారి వెంకట్ రెడ్డి, డీఆర్డీఏ శ్రీనివాస్, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.తత

# మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**



వికారాబాద్ పోలీసు శాఖలో పనిచేస్తున్న మహిళ కానిస్టేబుల్ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన శనివారం వికారాబాద్ పట్టణంలో వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. వికారాబాద్ పట్టణంలోని గంగారం సాయి బాబా కాలనీలో నివాసం ఉంటున్న బలిజ దివ్య (24) కోట్ పల్లి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తుంది. ఆమెను ధారూర్ సీఐ కార్యాలయంకు అటాచ్ చేయడంతో ఇక్కడ విధులు నిర్వహిస్తుంది. అయితే శనివారం తెల్లవారుజామున తన నివాసంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వికారాబాద్ సి ఐ రఘు కుమార్ సంఘటనస్థలానికి చేరుకున్నారు. ఈ ఘటనపై విచారణ ప్రారంభించారు. ఆత్మహత్యకు పాల్పడిన దివ్య సూసైడ్ నోట్ రాసినట్లు తెలుస్తోంది. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వికారాబాద్ పోలీసులు తెలిపారు.

# 2న వికారాబాద్ కు సీఎం రేవంత్ రెడ్డి రాక



**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**

ఏఐసీసీ శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరుకానున్నారు. అనంతగిరి హరిత రిసార్ట్స్ లో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం మార్చి 2న ముగుస్తాయి. ఈ సందర్భంగా హెలిప్యాడ్ ఏర్పాట్లను జిల్లా అదనపు కలెక్టర్లు సుధీర్, రాజేశ్వరి, జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఇంటెలిజెంట్ సీఎం సెక్యూరిటీ వింగ్ ఎస్పీలు, డీఎస్పీతో కలిసి ఎస్ఏపీ గ్రౌండ్ లో హెలిప్యాడ్ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుధీర్, అదనపు కలెక్టర్ రాజేశ్వరి, ఆర్డీవో వాసు చంద్ర, మున్సిపల్ కమిషనర్ విక్రం నరసింహారెడ్డి, వికారాబాద్ తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఏసీబీకి చిక్కిన డాక్టర్, హోంగార్డు



**ముద్ర, కాప్రా:**

లంచం తీసుకుంటున్న గాంధీ ఆసుపత్రి డాక్టర్ సందీప్, హోంగార్డ్ నగేష్‌ను రెడ్ హ్యాండ్ గా పట్టుకొని అరెస్టు చేసినట్టు ఏసీబీ డీఎస్పీ రంగసాని శ్రీధర్ తెలిపారు. కీసర పోలీస్ స్టేషన్‌లో అవినీతి నిరోధక శాఖ అధికారులు శనివారం దాడులు నిర్వహించి హోంగార్డ్ నగేష్‌తోపాటు డాక్టర్ నగేష్ ను లంచం తీసుకుంటూ పట్టుకున్నారు. మృతుడు తోటకూర మహేష్ పోస్ట్‌మార్టం రిపోర్ట్ అందించాలంటే మొదట రూ.2 లక్షలు ఇవ్వాలని నగేష్ డిమాండ్ చేసినట్లు మృతుడి మేనల్లుడు శరత్ ఆరోపించారు. గాంధీ ఆసుపత్రి డాక్టర్ సందీప్ పేరు చెప్పి రిపోర్ట్ త్వరగా తెప్పించాలంటే డబ్బులు అవసరమని నమ్మబలికినట్లు తెలిపారు. నెలలు గడిచినా రిపోర్ట్ అందకపోవడంతో చివరకు రూ.40 వేలుకు ఒప్పందం కుదిరినట్లు సమాచారం. మొదట రూ.5 వేలు తీసుకున్న నగేష్, రెండో విడతగా రూ.35 వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ తెలిపారు.

# పోలీస్ సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు



**ముద్ర, శేరిలింగంపల్లి :**

శాంతిభద్రతల పరిరక్షణలో నిరంతరం శ్రమించే మాదాపూర్ పోలీస్ సిబ్బంది తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ తెలిపారు. మాదాపూర్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ ఆసుపత్రి వారి సౌజన్యంతో సిబ్బందికి ప్రత్యేక ఆరోగ్య పరీక్షా శిబిరాన్ని నిర్వహించారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ నవీన్ రెడ్డి నేతృత్వంలోని వైద్య బృందం ఈ శిబిరంలో పాల్గొని సిబ్బందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్య సూత్రాలను వివరించారు. సిబ్బందికి రక్త పరీక్షలు, మూత్ర పరీక్షలు, షుగర్, రక్తపోటు, కిడ్నీ పనితీరును తెలిపే క్రియాటినిన్ పరీక్షల ను ఉచితంగా నిర్వహించా రన్నారు. పరీక్షల అనంతరం కిడ్నీ సంబంధిత వ్యాధుల నివారణపై నిర్వహించిన అవగాహన సదస్సులో డాక్టర్ నవీన్ రెడ్డి మాట్లాడుతూ కిడ్నీల ఆరోగ్యానికి ప్రతిరోజూ తగినంత నీరు తాగాలని, ఆహారంలో ఉప్పు వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తూ సమతుల్య ఆహారం తీసుకోవడం ద్వారా దీర్ఘకాలిక వ్యాధులను దూరం పెట్టవచ్చన్నారు.

# ఆహార భద్రతా చట్టం పకడ్బందీగా అమలు చేయాలి

**విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలి**
**రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి**

**ముద్ర, ఉమ్మడి రంగా రెడ్డి జిల్లా ప్రతినిధి:**

ఆహార భద్రత చట్టం పకడ్బందీగా అమలు చేయాలని, విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే లక్ష్యంగా ముందుకు సాగాలని రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. శనివారం రంగారెడ్డి జిల్లా సరూర్ నగర్, హయత్ నగర్ మండలంలో క్షేత్ర పర్యటించారు. ఈ సందర్భంగా చౌక ధర దుకాణాలను, అంగన్వాడీ కేంద్రాన్ని, విక్టోరియా మెమోరియల్ రెసిడెన్షియల్ హాస్టల్, స్కూల్, వనస్థలిపురం ఏరియా హాస్పిటల్ ను కమిషన్ సభ్యులు ఆనంద్, శారద, భారతి, జ్యోతితో కలిసి సందర్శించారు. అనంతరం జాతీయ ఆహార భద్రతా చట్టం – 2013 అమలుపై సమీక్షా సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలు, అంగన్వాడీలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు ప్రణాళిక బద్ధంగా మెనూ ను రూపొందించిందని, దానికి అనుగుణంగా మధ్యాహ్న భోజనం అందించాలన్నారు. పేదల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అర్హులందరికీ చేరేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని తెలిపారు. లబ్దిదారులకు చట్టబద్ధమైన హక్కులు అమలు చేయాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని, బరువు తక్కువ ఉన్న పిల్లలు, గర్భిణులు, బాలింతలకు కోడిగుడ్లు, పోషకాహారం కచ్చితంగా అందించాలని ఆదేశించారు. స్టాక్ రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని జిల్లా సంక్షేమ అధికారికి సూచించారు. స్టాక్ రిజిస్టర్లు, అమ్మకాల రిజిస్టర్లు, కేటాయింపు ఉత్తర్వులు, ఈ–పోస్ లావాదేవీలను పరిశీలించారు. లబ్దిదారులకు బియ్యం సకాలంలో అందుతున్నాయా, అక్రమాలు జరుగుతున్నాయా అనే అంశాలపై వివరాలు తీసుకున్నారు. ఐసిడిఎస్, పీఎం పోషణ పథకాల అమలు,



పోషకాహార సరఫరా నాణ్యత, ప్రసూతి ప్రయోజన పథకం అమలు, ఎన్ఎఫ్ఎస్ఏ కింద అర్హ కుటుంబాల గుర్తింపు, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ పనితీరు, సామాజి క తనిఖీలు, విజిలెన్స్ కమిటీల పనితీరు, గోదాముల పరిస్థితి, నాణ్యత సంరక్షణ చర్యలపై చర్చించారు. నాణ్యమైన ఆహార ధాన్యాలు పార దర్శకంగా, సకాలంలో లబ్దిదారులకు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రజల, విద్యార్థుల సమస్యలను తెలిపేందుకు పాఠశాల, చౌక ధర దుకాణాల ఆవరణలో అధికారుల ఫోన్ నెంబర్లతో కూడిన ఫిర్యాదు పట్టికను అమర్చాలని అధికారులకు సూచించారు. అంగన్వాడీలలో పిల్లలతో పాటు గర్భిణీ స్త్రీలకు పోషకాహారాన్ని అందించాలని చైర్మన్ సూచించారు. ఎప్పటికప్పుడు రేషన్ నిల్వలను రిజిస్టర్లలో నమోదు చేయాలని అదేవిధంగా సరుకులపై గడువు తేదీని పరిశీలించాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. ఈ కమిషన్ చైర్మన్ పర్యటనలో ఆర్డీఓలు అనంత్ రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, డిఇఓ సుసిందర్ రావు, డీఎంహెచ్ఓ లలితా దేవి, జిల్లా పౌర సరఫరాల అధికారి వనజాత, జిల్లా మేనేజర్ హరీష్, సంక్షేమ శాఖ అధికారులు రామరావు, రామేశ్వరి దేవి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ మహిళా దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ




**ముద్ర, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రతినిధి:**

రంగారెడ్డి జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం మహిళా విభాగం చైర్ పర్సన్ రేవతి ఆధ్వర్యంలో శనివారం టీజీవో భవన్ లో రంగారెడ్డి జిల్లా కమిటీ ముద్రించిన 'అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఉత్సవాల' పోస్టర్ ను టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్యామ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షులు డాక్టర్ రామారావు, కార్యదర్శి శ్రీనేష్ కుమార్ నోరి, మహిళా విభాగం రాష్ట్ర కోశాధికారి శాంతిశ్రీ, శిరీష, నరహరి, షౌకత్ తదితరులు పాల్గొన్నారు.

# కామ్రేడ్ దుర్గయ్యకు నివాళి

**హాజరైన సిపిఐ జాతీయ కార్యదర్శి మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకటరెడ్డి**

**ముద్ర, కుత్బుల్లాపూర్:**

భారత కమ్యూనిస్టు పార్టీ కుత్బుల్లాపూర్‌మండలం మాజీ కార్యదర్శి, దళిత కుల పోరాట సమితి నియోజకవర్గ అధ్యక్షుడు కామ్రేడ్ దుర్గయ్య మృతదేహానికి శనివారం సిపిఐ పార్టీ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈటి నరసింహ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వివిఎస్ బోస్ పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారి కుటుంబానికి సంతాపాన్ని తెలియజేసి వారి మృతి పార్టీకి, కుటుంబానికి ప్రజలకు తీరని లోటని, తండ్రి నుంచి వారసత్వంగా పార్టీలో పనిచేసే అనేక పదవులను అనుభవించి నిత్యం పేద ప్రజల కోసం సాయపడేవాడని, దుర్గయ్య గారి మృతితో పేద ప్రజలకు తీరని నష్టమని అలాంటి మంచి మనిషిని కోల్పోవడం బాధాకరమని అన్నారు. స్మశాన వాటికకు పేదవాళ్లు వస్తే అది తక్కువ ఖర్చులతో దాహన సంస్కారాలను చేసి ప్రజల దగ్గర ఎలాంటి ఆర్థిక ఇబ్బందులను గురి చేయకపోయేవాడని చుట్టుపక్కల వాళ్లందరూ దుర్గయ్య పై మంచి అభిప్రాయం ఉండేదని అలాంటి వ్యక్తి ఆరోగ్యం పైన శ్రద్ధ చూపకపోవడం వల్ల అనారోగ్యంతో మృతి చెందడం తీరని బాధని వారికి వారి కుటుంబానికి సిపిఐ పార్టీ ఎల్లవేళల అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి



ఉమా మహేశ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దామోదర్ రెడ్డి, సాయిలు గౌడ్, ఏసురత్నం, మండల కార్యదర్శి స్వామి, సహాయ కార్యదర్శులు హరినాథ్, రాములు, ఏఐటీయూసీ కార్యదర్శి శ్రీనివాస్, ప్రజానాట్యమండలి అధ్యక్షులు ప్రవీణ్, బాబు యువజన కార్యదర్శి వెంకటేష్, సిపిఐ నాయకులు సాధనంద్, నర్సింహారెడ్డి, సాయిలు, వెంకటేష్, సహదేవ రెడ్డి, మహిళా సమాఖ్య అధ్యక్షులు హైమావతి, సత్యవతి, మహేశ్వరి, డేనియల్, నర్సయ్య, యదన్న, రవి, నాగేష్, శ్రీనివాస్ చారీ, శ్రీనివాస్ తో పాటు వందలాది మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలు జెండాలు పట్టుకొని ర్యాలీ నిర్వహించారు.

# తెలంగాణలో జనసేనను బలోపేతం చేద్దాం

**ముద్ర, కూకట్‌పల్లి:**




తెలంగాణలో జనసేన పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మహబూబ్ నగర్ పార్లమెంట్, సైబరాబాద్ కార్పొరేషన్ ఇన్ చార్జ్ ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ పిలుపునిచ్చారు. కె.పి.హెచ్.బి ఫేస్–5 లోని తెలంగాణ జనసేన పార్టీ కార్యాలయంలో జరిగిన సైబరాబాద్ కార్పొరేషన్ అడక్ కమిటీ మరియు సాదక్ ల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రేమ కుమార్ మాట్లాడుతూ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలను, జనసేన సిద్ధాంతాలను గడపగడపకూ తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. ముఖ్యంగా క్రియాశీలక ఉద్యమి సభ్యత్వాల ద్వారా ప్రజలను పార్టీలోకి ఆహ్వానించాలి. ప్రతి పేద కుటుంబానికి సభ్యత్వం అందేలా చూడాలి. పార్టీ అందించే బీమా పథకం ఆపద సమయంలో కుటుంబాలకు ఏ విధంగా అండగా ఉంటుందో వివరించి వారికి అవగాహన కల్పించాలి. రాబోయే రోజుల్లో తెలంగాణలో జనసేన జెండాను రెపరెపలాడించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ కార్పొరేషన్ పరిధిలోని వివిధ నియోజకవర్గ నాయకులు, జనసేన సాదక్ లు, జన సైనికులు, వీర మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

**టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేశ్**

**ముద్ర కూకట్‌పల్లి:**

ప్రజా సమస్యల పరిష్కారంలో మన ప్రజా ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్ స్పష్టం చేశారు. శనివారం స్థానిక పార్టీ నాయకులతో కలిసి కేపీహెచ్‌బీ కాలనీ మూడో ఫేజ్‌లోని బతుకమ్మ కుంటను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బతుకమ్మ కుంట వద్ద వాకింగ్, స్కేటింగ్ మరియు ఓపెన్ జిమ్ కోసం ప్రతిరోజూ వందలాది మంది వస్తుంటారు. అయితే, ఇక్కడ సరైన పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో సందర్శకులు తమ వాహనాలను రహదారులపైనే నిలుపుతున్నారు. దీనివల్ల స్థానికులకు, వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అంతేకాకుండా పార్కు ఆవరణలో టాయిలెట్ సౌకర్యం లేకపోవడంతో మహిళలు, వృద్ధులు పడుతున్న ఇబ్బందు



లను రమేష్ దృష్టికి తీసుకెళ్లారు.సమస్యల తీవ్రతను గమనించిన బండి రమేష్ వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. సందర్శకుల కోసం తక్షణమే వాహనాల పార్కింగ్ స్థలాన్ని కేటాయించాలని, ఆధునిక టాయిలెట్లను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజా సౌకర్యాల విషయంలో నిర్లక్ష్యం వహించకూడదని అన్నారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి, సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, ఫణీంద్ర, రంగమోహన్, పిడికిటి గోపాల్ చౌదరి, అరవింద్ రెడ్డి, వినోద్ మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# లబ్ధిదారులకు 'కల్యాణ లక్ష్మి' చెక్కుల పంపిణీ

**ముద్ర, కూకట్‌పల్లి:**





నిరుపేద కుటుంబాల్లో ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. శనివారం వివేకానంద నగర్‌లోని తన నివాస కార్యాలయంలో కూకట్‌పల్లి మండలం పరిధిలోని పలు డివిజన్లకు చెందిన లబ్ధిదారులకు ఆయన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివేకానంద నగర్, హైదర్ నగర్, ఆల్విన్ కాలనీ, కూకట్‌పల్లి (పార్ట్) డివిజన్లకు చెందిన 52 మంది లబ్ధిదారులకు రూ. 52,06,032 విలువైన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేస్తామని ఈ సందర్భంగా గాంధీ పేర్కొన్నారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు తమకు అండగా నిలుస్తున్నందుకు ప్రభుత్వానికి మరియు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. తాజా మాజీ కార్పొరేటర్లు నార్నె శ్రీనివాసరావు, ఉప్పలపాటి శ్రీకాంత్, సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి, యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

టాప్ 10 పండ్ల రసాలు
4. ఆపిల్ జ్యూస్
"రోజుకు ఒక ఆపిల్ డాక్టర్ దూరం" అనే మాటలాగే ఆరోగ్యానికి మేలు చేస్తుంది. జీర్ణశక్తిని మెరుగుపరుస్తుంది.



# జిల్లాను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలి

**- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**



ముద్ర, మహాదేవపూర్:

జిల్లాను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. శనివారం ఐడిఓసి కార్యాలయంలో ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సంపూర్ణత అభియాన్ 2.0 కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నీతి ఆయోగ్ నిర్దేశించిన విద్యా, వైద్య, సంక్షేమ, వ్యవసాయ, పశు సంవర్ధక వంటి ఐదు అంశాలలో జిల్లాలో నూరు శాతం ప్రగతి సాధించేలా కార్యాచరణ రూపొందించి కచ్చితంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి సూచికలో స్థిరమైన పురోగతి సాధించేందుకు శాఖల వారీగా లక్ష్యాలను నిర్ణయించి, నిరంతర సమీక్షల ద్వారా ఫలితాలను సాధించాలని అన్నారు. గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు సమన్వయం పెంపొందించి, ప్రజలకు అందుతున్న సేవల నాణ్యతను మెరుగుపరచాలని కలెక్టర్ సూచించారు. కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్ సంపూర్ణత అభియాన్ 2.0 కార్యక్రమానికి నోడల్ అధికారిగా వ్యవహరించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. కార్యక్రమం అమలు, సమీక్ష, నివేదికల సమర్పణలో సమగ్ర పర్యవేక్షణ చేపట్టాలని ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ఈ సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీమతి విజయలక్ష్మి, సంపూర్ణత అభియాన్ ప్రత్యేక అధికారి కృష్ణ కదు, సీపీఓ జవహర్ విద్యా, వైద్య, సంక్షేమ, వ్యవసాయ, పశుసంవర్ధక శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పుష్కరాలలో భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి

**- నిధుల విడుదలకు ముఖ్య మంత్రిని కలుస్తా..**

**- 2027 గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై మంత్రి 'అడ్లూరి' సమీక్ష సమావేశం**




ముద్ర, జగిత్యాల:

గోదావరి పుష్కరాలకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. 2027 గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై జగిత్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంత్రి జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశంలో కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్, అడిషనల్ కలెక్టర్ రాజా గౌడ్ తోపాటు వివిధ శాఖల అధికారులు ఈవై కన్సల్టెన్సీ ప్రతినిధులు పాల్గొన్నారు. 2015 గోదావరి పుష్కరాలకు జగిత్యాల జిల్లాలోని వివిధ పుష్కర ఘాట్ల వద్ద కోటి 50 లక్షల మంది భక్తులు పుణ్యస్నానాలు చేశారని, 2027 గోదావరి పుష్కరాలకు 4 కోట్ల మంది భక్తులు వస్తారని అధికారులు అంచనా వేశారు. ఇందుకు సంబంధించి చేపడుతున్న అభివృద్ధి పనులను అధికారులు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ గోదావరి పుష్కరాలకు బాసరా నుంచి భద్రాచలం వరకు నిధులు కేటాయిస్తున్నట్లు ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి తెలిపారని అన్నారు. ప్రస్తుతం అధికారులు జగిత్యాల జిల్లాలో చేపట్టే అభివృద్ధి పనులకు రూ. 940 కోట్లతో అంచనాలు తయారు చేశారని తెలిపారు. నిధుల కేటాయింపు కోసం సీఎంను కలుస్తానని మంత్రి తెలిపారు. పుష్కరాల సందర్భంగా వీఐపీ భక్తుల లాగా సామాన్య భక్తులకు సౌకర్యాలు కల్పించాలని మంత్రి అన్నారు. గోదావరి నది వెంట ఉన్న ఆలయాలను ఆగమ శాస్త్రం ప్రకారం అభివృద్ధి చేయాలని సూచించారు. పార్కింగ్ కు ఎలాంటి ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి సూచించారు. కనురెప్ప పాటు కరెంట్ అంతరాయం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.

ఈ సందర్భంగా పుష్కరాల సమీక్ష సమావేశానికి హాజరు కాని పలువురు అధికారుల తీరుపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. మరో 10 రోజుల్లో పుష్కరాలపై జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహిస్తామని మంత్రి అడ్లూరి తెలిపారు.

## బ్రహ్మోత్సవాల అన్నదానం కార్యక్రమానికి మంత్రి చేయూత..

ముద్ర, ధర్మపురి:

ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ధర్మపురి పట్టణ వర్తక, వాణిజ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి రాష్ట్ర సంక్షేమ మంత్రి లక్ష్మణ్ కుమార్ తన వంతు చేయూతను అందించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి రూ. 50,016 లను అన్నదాన కమిటీ సభ్యులకు అందజేశారు.




# అటవీ అధికారిపై చర్య తీసుకోండి

**- తెలంగాణ రైతు సంఘం**

ముద్ర ప్రతినిధి, నిర్మల్:

నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం తర్లపాడులో శనివారం సెక్షన్ ఆఫీసర్ రవీందర్ పై చర్య తీసుకోవాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని సమర్పించారు. ఆయన స్మగ్లరతో కుమ్మక్కై ధనార్జనే ధ్యేయంగా అటవీ సంపదను కొల్లగొడుతున్నాడని ఫిర్యాదులో ఆరోపించారు. తర్లపాడు బీట్, బత్తుల సింగరి ఆల్వా సమీపంలో నరికివేతకు గురైన చెట్లను గుర్తించి విచారణ జరిపి స్మగ్లింగ్ కు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.



# 50వ డివిజన్ ను అభివృద్ధి పథంలో నడిపిస్తా..

**- కార్పొరేటర్ బోయినపల్లి ప్రవీణ్ రావు**

ముద్ర, కరీంనగర్:

50వ డివిజన్ ను అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తానని కార్పొరేటర్ బోయినపల్లి ప్రవీణ్ రావు అన్నారు. చెత్త సేకరణ నిమిత్తం 50 డివిజన్ కు కేటాయించిన ట్రాక్టర్ ను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కరీంనగర్ నగరపాలక సంస్థలో 50వ డివిజన్ ను క్లీన్ డివిజన్ గా మార్చి, ఆదర్శవంతంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తానని కరీంనగర్ పార్లమెంటు కన్వీనర్, కార్పొరేటర్ బోయినపల్లి ప్రవీణ్ రావు అన్నారు. డివిజన్ కు ట్రాక్టర్ కేటాయించిన కరీంనగర్ నగర పాలక సంస్థ మేయర్, కమిషనర్ లకు ధన్యవాదాలు తెలిపారు. డివిజన్ లో పారిశుద్ధ్య పనులు, చెత్త సేకరణ కార్యక్రమాలు నిరంతరం జరిగేలా చేస్తామన్నారు. తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా అందించాలని ప్రజలను కోరారు. రోడ్లపైన చెత్తాచెదారాన్ని వేయవద్దని, మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బందికి చెత్తను అందజేయాలని సూచించారు. డివిజన్ ను క్లీన్ డివిజన్ గా మార్చడానికి ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమన్నారు.

# నూతన ఆవిష్కరణలకు ప్రోత్సాహం

**- మంత్రి శ్రీధర్ బాబు**

ముద్ర, పెద్దపల్లి:

నూతన ఆవిష్కరణలకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని రాష్ట్ర ఐ.టి, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు అన్నారు. శనివారం మంథని పట్టణంలో రాష్ట్ర మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, కలెక్టర్ కోయ శ్రీ హర్షతో కలిసి మంథని బస్ డిపో ఎదురుగా టీ వర్క్స ఆధ్వర్యంలో నిర్వహించిన ఇన్నోవేషన్ ఎక్స్ పో 2026 కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ డ్రీమ్, రైస్, స్టార్ట్ నినాదంతో ఇన్నోవేషన్ ఎక్స్ పో 2026 ను మంథనిలో ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. టీ– వర్క్స యూనిట్ బృందం కలెక్టర్ సహకారంతో ప్రభుత్వ పాఠశాలల్లో పర్యటిస్తూ విద్యార్థులు నూతన ఆవిష్కరణ పట్ల ఆసక్తి పెంపొందించే దిశగా కృషి చేశా రని అన్నారు.

అనంతరం కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ.. టీ–వర్క్స యూనిట్ ను 7 నెలల క్రితం మంథనిలో ప్రారంభించామని తెలిపారు. జిల్లాలో ముందస్తుగా 20 ప్రభుత్వ పాఠశాలల్లో ఏ.ఐ. ఆధారిత బోధన, కృత్రిమ మేధస్సుపై విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించిన్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీ వర్క్స సి.ఈ.ఓ. జోగేందర్, మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్, వైస్ చైర్మన్ సయేందర్ రెడ్డి, ఆర్.డి.ఓ .సురేష్, తహసిల్దార్ ఆరిపోద్దిన్, మున్సిపల్ కమిషనర్ మనోహర్, అధికారులు పాల్గొన్నారు.

# రూ.2 కోట్లతో సంతు సేవాలాల్ స్మారక భవనం

**- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**



ముద్ర, మహదేవపూర్:

రూ.2 కోట్ల వ్యయంతో సంత్ సేవాలాల్ మహరాజ్ బంజారా భవనం మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. అవసరమైతే అదనపు నిధులు మంజూరు చేసి నిర్మాణ పనులు పూర్తి చేయుటకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సంత్ సేవాలాల్ మహరాజ్ 287వ జయంతి వేడుకల్లో శనివారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంత్ సేవాలాల్ జయంతిని ప్రభుత్వ పరంగా నిర్వహించడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, గిరిజన సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కు ధన్యవాదాలు తెలిపారు.

అనంతరం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ బంజారా జాతికి విద్యా, విజ్ఞాన పరంగా దిశానిర్దేశం చేసిన మహనీయుడు సంత్ సేవాలాల్ మహరాజ్ అని కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న గిరిజన సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని సమగ్ర అభివృద్ధి సాధించాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) విజయలక్ష్మి, ఎఎస్పీ నరేష్ కుమార్, ఆర్డిఓ హరికృష్ణ, మున్సిపల్ చైర్మన్ బుర్రా కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, గిరిజన సంక్షేమ అధికారి నాగ సాగర్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు సంతోష్ కుమార్, కమిటీ సభ్యులు దేవన్, కౌన్సిలర్లు, గిరిజన సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత శిక్షణతో పాటు ఉద్యోగం



ముద్ర, మహదేవపూర్:

డిజిటల్ ఎంప్లాయ్ మెంట్ ఎక్స్చేంజ్ ఆఫ్ తెలంగాణ, ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ద్వారా నిరుద్యోగ, యువతీ యువకులకు వైఎస్ కె ఇన్ఫోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ వివిధ కోర్సులలో ఉచిత నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు పరిశ్రమల శాఖ జీఎం సిద్దార్థ తెలిపారు. సాఫ్ట్ స్కిల్, కస్టమర్ రిలేషన్షిప్ మేనేజ్మెంట్, బిజినెస్ ప్రాసెస్ మేనేజ్మెంట్, బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్ వంటి అంశాలపై ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు ఆయన తెలిపారు. శిక్షణ అనంతరం జాబ్ గ్యారంటీ ఉంటుందని స్పష్టం చేశారు. ఆధార్, పాన్ కార్డ్, విద్యార్హత సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలతో నమోదు చేసుకవాలని తెలిపారు. టాస్క్ కార్యాలయం, మొదటి అంతస్తు, ఐటి టవర్, కరీంనగర్ నందు మొదటి బాచ్ 2-3-2026 నుండి 22-3-2026 వరకు శిక్షణ ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు క్యూ ఆర్ కోడ్ స్కాన్ ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు.

# వైభవంగా శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం





ముద్ర, ధర్మపురి:

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ధర్మపురిలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎస్సీ ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు.

శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవంలో మంత్రి తో పాటు జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఆవుల మందపై పెద్దపులి దాడి

ముద్ర, జగిత్యాల:

జగిత్యాల జిల్లా భీమారం మండలం కొడిమ్యాల ఫారెస్ట్ రేంజ్ పరిధిలో పెద్దపులి సంచారం కలకలం రేపుతోంది. గత ఆదివారం మోత్కరావుపేట గ్రామ శివారులో చెరువు వద్ద నీళ్లు తాగిన ఆనవాళ్లను అటవీ శాఖ అధికారులు గుర్తించారు. వారం రోజుల తర్వాత శనివారం తెల్లవారు జామున పెద్దపులి ఆవుల మందపై దాడి చేసి మూడు ఆవులను గాయపరిచింది. గ్రామస్తుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న అటవీ శాఖ అధికారులు పెద్దపులి దాడి చేసిందని నిర్ధారించారు. పెద్దపులి కదలికల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండా లని, పశువులను ఒంటరిగా మేపకూడదని, రాత్రివేళల్లో జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచించారు. గ్రామ పరిసరాల్లో ఫారెస్ట్ సిబ్బంది పర్యవేక్షణను పెంచినట్లు అధికారులు తెలిపారు.



# నత్త నడకన వైద్య కళాశాల భవన నిర్మాణం

## ఇబ్బందులు పడుతున్న వైద్య విద్యార్థులు






ముద్ర, కరీంనగర్:

2023 సెప్టెంబర్ లో ప్రారంభమైన కరీంనగర్ మెడికల్ కాలేజీని 200 మంది విద్యార్థులతో కొత్తపల్లిలోని సీడ్ గోడౌన్‌లో తాత్కాలికంగా నిర్వహిస్తున్నారు. కళాశాల భవన నిర్మాణానికి రూ. 138 కోట్ల నిధులు కేటాయించినప్పటికీ, శాశ్వత భవనాల నిర్మాణం ఇంకా పూర్తి కాలేదు.

### జాప్యానికి కారణాలు..

కరీంనగర్ మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లిలో 25 ఎకరాల స్థలంలో శాశ్వత భవనాల నిర్మాణానికి ప్రభుత్వం రూ.138 కోట్లు కేటాయించింది.

ఈ పనులు ఏడాది కాలంలోనే పూర్తి కావాల్సి ఉన్నప్పటికీ, పనులు చాలా నెమ్మదిగా సాగుతున్నాయి. సీడ్ కార్పొరేషన్ గోడౌన్ లలో తాత్కాలికంగా నిర్వహిస్తున్న ఈ కళాశాల మౌలిక సదుపాయాల కల్పనకు సుమారు రూ. 7 కోట్లు కేటాయించారు. వీటితో గదులు, ల్యాబ్‌లను సిద్ధం చేశారు.

### విద్యార్థుల ఇబ్బందులు..

కళాశాలకు శాశ్వత హాస్టల్ భవనాలు లేకపోవడంతో, సుమారు 200 మంది విద్యార్థులు అద్దె భవనాల్లో ఉంటున్నారు. అమ్మాయిలకు తీగలగుట్టపల్లిలో, అబ్బాయిలకు విద్యానగర్, శ్రీపురం కాలనీల్లోని ప్రైవేట్ భవనాల్లో వసతి కల్పించారు. హాస్టల్ నుంచి కళాశాలకు వెళ్లడానికి కేవలం ఒకే ఒక మినీ బస్సు ఉండటంతో, విద్యార్థులు షిఫ్టుల వారీగా వెళ్లాల్సి వస్తోంది. ఇది వారి జనరల్ హాస్పిటల్‌లో జరిగే క్లినికల్ క్లాసులకు హాజరయ్యే సమయంపై ప్రభావం చూపుతోంది.

### సిబ్బంది కొరత

బోధనా సిబ్బంది కొరత కూడా కళాశాలను వేధిస్తోంది. మంజూరైన పోస్టుల్లో చాలా వరకు ఖాళీగా ఉన్నాయి. 27 ప్రొఫెసర్ పోస్టులకు గాను కేవలం 10 మంది మాత్రమే అందుబాటులో ఉన్నారు.

మొత్తంగా కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్ల నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో వైద్య విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
01.03.2026 ఆదివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



టాప్ 10 పండ్ల రసాలు

5. ద్రాక్ష జ్యూస్

యాంటీ ఆక్సిడెంట్స్ ఎక్కువగా ఉండి గుండెకు మంచిది. శరీరానికి తక్షణ శక్తిని ఇస్తుంది.





## ప్రతిభను చాటుకున్న విద్యార్థులు

**ముద్ర, భువనగిరి ప్రతినిధి :**

భువనగిరి మండలంలోని తాజ్‌పూర్ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం సైన్స్ ఫేర్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల ప్రతిభను వెలికితీయడమే లక్ష్యంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో విజ్ఞానశాస్త్రానికి సంబంధించిన పలు నమూనాలు, ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ముఖ్య అతిథిగా హాజరైన గ్రామ సర్పంచ్ ర్యాకల సంతోష్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఇంత పెద్ద స్థాయిలో సైన్స్ ఫేర్ నిర్వహించడం అభినందనీయమని అన్నారు. విద్యార్థులు తమ ప్రాజెక్టులను ఆత్మవిశ్వాసంతో వివరించడం సంతోషకరమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత, పరిశోధనా తత్వం పెరుగుతుందని తెలిపారు. ఈ సైన్స్ ఫేర్ ఇప్పటివరకు ఏ ప్రైవేట్ పాఠశాలలో కూడా ఈ స్థాయిలో జరగలేదని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోవని, విద్యా ప్రమాణాలు మెరుగుపడుతున్నాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, ఉపసర్పంచ్ వరిగంటి కృష్ణ, పంచాయతీ కార్యదర్శి నరేందర్ నాయక్, వార్డు సభ్యులు పల్లెపాటి కృష్ణ, బొమ్మరపు లక్ష్మీ బాల్‌రాజ్, ఎస్.కె. గాలిబ్ యాకుబ్, ఎస్.కె. హైమద్, వరిగంటి మానస నాగరాజు, గ్రామ ప్రజలు, వ్యవసాయ విద్యార్థులు, యాదాద్రి మెడికల్ కాలేజ్ వైద్యులు పాల్గొన్నారు. విద్యార్థుల ప్రతిభను ప్రతిబింబించిన ఈ సైన్స్ ఫేర్ గ్రామంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

## పేదల ఇండ్లు కూల్చడమే ఇందిరమ్మ రాజ్యమా..?

- **నిర్వాసితులందరికీ న్యాయం చేయాలి**
- **సీపీఎం మండల కార్యదర్శి గుండు వెంకట నర్సు**



**ముద్ర, మోత్కూర్ :**

పేదల ఇండ్లు కూల్చడమే ఇందిరమ్మ రాజ్యమా అని సీపీఎం మండల కార్యదర్శి గుండు వెంకట నర్సు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శనివారం మోత్కూర్ సీపీఎం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. భూదాన్ ఇండ్ల కూల్చివేత సందర్భంగా ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా, వారి సామానులు కూడా తీసుకునే అవకాశం కల్పించకుండా నిరుపేదల ఇండ్లను కూల్చి వారిని గెంటివేయడం అన్యాయమని, తక్షణమే ఇండ్లు కోల్పోయిన నిర్వాసితులకు న్యాయం చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని వెలుగుమట్ల ప్రాంతంలో ఉన్న భూదాన్ భూముల్లో 10 సంవత్సరాలుగా పట్టాలు పొంది 600 మంది నిరుపేదలు ఇండ్లు నిర్మించుకుని నివసిస్తున్నారని తెలిపారు. వారి ఇండ్లను కూల్చివేయడంతో వారు రోడ్డున పడ్డారని, విద్యార్థులు ప్రస్తుతం జరుగుతున్న పరీక్షలు కూడా రాయలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. 2014 సంవత్సరం నుండి బడా బాబుల భూములను క్రమబద్ధీకరణ చేస్తున్న ప్రభుత్వం పేదల ఇండ్లను ఎందుకు క్రమబద్ధీకరించలేదని ప్రశ్నించారు. ప్రభుత్వ నిర్వాకం వల్ల నిర్వాసితులైన పేదలు సర్వం కోల్పోయిన వారికి తక్షణ సాయంగా లక్ష రూపాయలు అందించడంతోపాటు ఇండ్లు కోల్పోయిన ప్రతి ఒక్కరికీ ఇంటి స్థలం ఇచ్చి ఇండ్లు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



## కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

**ముద్ర, భువనగిరి ప్రతినిధి :**

పదవ తరగతి విద్యార్థులు కష్టపడి చదివి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. శనివారం రాయగిరిలోని లింగబసవ గార్డెన్స్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ వెల్ఫేర్ విద్యార్థులకు ప్రేరణ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో నిరంతరం శ్రమించి పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని సూచించారు. పరీక్షల సమయంలో ఒక పరీక్షకు మరో పరీక్షకు మధ్య లభించే విరామ సమయాన్ని అభ్యాసానికి సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వెనుకబడిన విషయాలను ఒకటికి రెండుసార్లు పునశ్చరణ చేసి సందేహాలను నివృత్తి చేసుకోవాలన్నారు. తదుపరి పరీక్షకు సంబంధించిన ముఖ్యాంశాలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. విద్యార్థుల్లో పరీక్ష భయం తొలగించి అవగాహన పెంపొందించాలన్నారు. నూరు శాతం ఉత్తీర్ణత సాధించి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో షెడ్యూల్డ్ కులాల, వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి సాహితి, విద్యాశాఖ అధికారి సత్యనారాయణ, ఏబీసీడీఓ, ఏఎస్‌డబ్ల్యూఓలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహ సంక్షేమ అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## జమ్మాపురంలో మహిళా భవన్‌కు శంకుస్థాపన

**ముద్ర, భువనగిరి జిల్లా ప్రతినిధి :**

భువనగిరి మండలంలోని జమ్మాపురం గ్రామంలో నూతనంగా నిర్మించనున్న మహిళా భవన్‌కు భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తానని హామీ ఇచ్చారు. మహిళల సంక్షేమం, సాధికారత కోసం ప్రభుత్వం కృషి చేస్తున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నోరదయ స్వరూప, నాయకులు పోత్నాక్ ప్రమోద్ కుమార్, కృష్ణారెడ్డి, ఎడ్ల వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అష్టోత్తర శతఘటాభిషేకం

- **ముగిసిన బ్రహ్మోత్సవాలు**

**ముద్ర, భువనగిరి జిల్లా ప్రతినిధి :**



యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం అష్టోత్తర శతఘటాభిషేకంతో వైభవంగా ముగిశాయి. నిత్యారాధనల అనంతరం పాంచరాత్రాగమ శాస్త్రం ప్రకారం ఆలయ ప్రధానార్చకులు, ఉప ప్రధానార్చకులు, యజ్ఞాచార్యులు, వేద పండితులు, అర్చక బృందం ఆధ్వర్యంలో ఈ మహోత్సవం నిర్వహించారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ డైరెక్టర్ ఎం.హనుమంతరావు, కార్యనిర్వహణాధికారి జె.భవాని శంకర్, అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఇతర అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

**అష్టోత్తర శతఘటాభిషేకం ప్రత్యేకత**

108 కలశాలతో నిర్వహించే ఈ అభిషేకం బ్రహ్మోత్సవాల సమగ్ర ఫలితాన్ని లోకానికి అందించే విశిష్ట ఆగమ శాస్త్ర విధానం. సృష్టిలోని 108 తత్వాలకు ప్రతీకగా ఈ కలశాలు భావిస్తారు. పంచామృతాలు, పవిత్ర తీర్థాలు, సుగంధ ద్రవ్యాలు, ఫలరసాలతో మూలవిరాట్టు స్వామివారు, అమ్మవారికి అభిషేకం నిర్వహించడం విశేషం. పంచభూతాలకు మాధుర్యాన్ని ప్రసాదించి లోకక్షేమాన్ని కలిగిస్తుందని శాస్త్రార్థం.

**శృంగార డోలోత్సవం వైభవం**

సాయంత్రం నిత్యారాధనల అనంతరం శృంగార డోలోత్సవం ఘనంగా నిర్వహించారు. డోలము అంటే ఊయల అని అర్థం. స్వామివారు, అమ్మవారిని ఊయలపై ఆసీనులుగా ఉంచి నామసంకీర్తనల మధ్య ఈ ఉత్సవం జరిపారు. ఈ దర్శనం వల్ల భక్తుల మనోరథాలు నెరవేరుతాయని పురాణ విశ్వాసం. అనంతరం పండిత సన్మానం, ఉత్సవ పరిసమాప్తి నిర్వహించారు.

**సాంస్కృతిక కార్యక్రమాలు..**

**ఉచిత వైద్య శిబిరం**

బ్రహ్మోత్సవాల్లో భాగంగా రాత్రి 9 గంటల నుంచి ప్రధాన ఆలయంలో డి.లక్షణాదేవి బృందం భక్తి సంగీత కార్యక్రమం నిర్వహించింది. అలాగే ఫిబ్రవరి 18 నుంచి 28 వరకు కొండపై ప్రధాన కార్యాలయం వద్ద హైదరాబాద్‌లోని మెడికవర్ ఆసుపత్రుల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.

## పిన్నింటి స్టాన్లీ సేవలకు కోఆప్షన్ పదవి కల్పించాలి

**ముద్ర, భువనగిరి ప్రతినిధి :**




క్రిస్టియన్ మైనార్టీ కోటాలో ప్రముఖ క్రైస్తవుడు పిన్నింటి స్టాన్లీ కోఆప్షన్ సభ్యుడిగా వందశాతం అర్హుడని పలువురు అభిప్రాయపడుతున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో తొలి పాస్టర్ పిన్నింటి ఫిలమోన్ వంశానికి చెందిన స్టాన్లీ, ఇండియా మిషన్ కాంపౌండ్‌లో జన్మించి చిన్ననాటి నుంచే సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తండాలు, దళితవాడల్లో పెద్దల విద్య కార్యక్రమాలు, గ్రామాల్లో చైల్డ్ డెవలప్‌మెంట్ సమ్మర్ ప్రోగ్రామ్‌లు నిర్వహించడంలో సహకరించారు. పలు జిల్లాల్లో కుట్టు కేంద్రాలు ఏర్పాటు చేసి తన సహచారిణి పిన్నింటి సరోజన రెడ్డి ద్వారా పేద నిరుద్యోగ మహిళలకు కుట్టు శిక్షణ ఇప్పించి వందల మందికి స్వయం ఉపాధి కల్పించారు. అనాథలు, వృద్ధులు, వికలాంగులు, వలస కార్మికులు, ఒంటరి మహిళలకు సేవలు అందించడంతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు అవసరమైన వస్తువులు, ఆసుపత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్నారు. కోవిడ్ లాక్‌డౌన్ సమయంలో వలస కార్మికులకు నిత్యావసర సరుకులు, మాస్కులు, శానిటైజర్లు పంపిణీ చేసి విశేష సేవలు అందించారు. 2006లో సలకపూర్ క్రాస్ రోడ్ వద్ద బోర్‌వెల్ ఏర్పాటు చేసి వేల మందికి తాగునీటి సౌకర్యం కల్పించారు. వివిధ జాతీయ, అంతర్జాతీయ శిక్షణలు పొందిన ఆయన విదేశీ అవకాశాలను వదులుకుని దేశ సేవకే ప్రాధాన్యత ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్‌లో పలు పదవులు నిర్వహించి, స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమాల్లో పదేళ్ల పాటు సేవలందించారు. గత 30 సంవత్సరాలుగా చేసిన సేవలకు గుర్తింపుగా అనేక అవార్డులు, ప్రశంసాపత్రాలు అందుకున్నారు. ఇటువంటి సేవలను గుర్తించి క్రిస్టియన్ మైనార్టీ కోటాలో కోఆప్షన్ పదవి కల్పిస్తే మరింత ఉత్సాహంతో ప్రజలకు సేవలు చేయగలరని పేర్కొన్నారు.

## వలిగొండ పీహెచ్‌సీపై ఆకస్మిక తనిఖీ

**ముద్ర, భువనగిరి ప్రతినిధి :**



వలిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.మనోహర్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా కేంద్రంలోని అన్ని రిజిస్టర్లను పరిశీలించి, ఓపీఐపీ నమోదులను సమగ్రంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవల నాణ్యతపై సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రికి వచ్చిన రోగులతో ప్రత్యక్షంగా మాట్లాడి, వారికి అందుతున్న సేవలపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. రోగులకు మరింత మెరుగైన, సమయోచిత వైద్య సేవలు అందించాలని, పరిశుభ్రతను కాపాడాలని, అవసరమైన మందులు, వైద్య పరికరాలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలని సిబ్బందికి సూచించారు. పీహెచ్‌సీలో సాధారణ ప్రసవాల సంఖ్యను పెంచేందుకు చర్యలు తీసుకోవాలని మెడికల్ ఆఫీసర్‌ను ఆదేశించారు. గర్భిణులను ముందుగానే గుర్తించి, సరైన ఫాలోఅప్ నిర్వహించి, సమయానికి ఆసుపత్రికి రప్పించి సురక్షిత ప్రసవాలు జరిగేలా చూడాలని సూచించారు. అధిక ప్రమాద కేసులను వెంటనే ఉన్నత ఆసుపత్రులకు రిఫర్ చేయాలని తెలిపారు. రాబోయే వేసవిని దృష్టిలో ఉంచుకుని వడదెబ్బ నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు సమృద్ధిగా నిల్వ ఉంచాలని, ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. తాగునీరు, చల్లని నీడ ప్రాంతాలు, ప్రథమ చికిత్స సౌకర్యాలు సిద్ధంగా ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వలిగొండ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఖాజా, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు

**ముద్ర, మోత్కూర్ :**

మోత్కూర్ మున్సిపల్ కేంద్రంలోని ఆరో వార్డు ఆరేగూడెంలో మున్సిపల్ చైర్మన్ గడ్డం స్వప్న సోమ నర్సయ్య శనివారం పర్యటించి వార్డులోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆరో వార్డు ప్రజలు దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించగా, మున్సిపల్ సిబ్బందితో వెంటనే శానిటేషన్ పిచికారీ చేయించారు. విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరుకున్నాయని మున్సిపల్ చైర్మన్ దృష్టికి తీసుకువెళ్లగా, వెంటనే పాత విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని విద్యుత్ ఏఈ ప్రభాకర్ రెడ్డిని ఆదేశించారు. అలాగే త్రాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కె. సతీష్ కుమార్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు బద్దం నాగార్జున రెడ్డి, అర్థ ప్రతాపరెడ్డి, కృష్ణ యాదవ్, సిబ్బంది నరసింహచారి పాల్గొన్నారు.

## స్వపరిపాలన దినోత్సవం

**ముద్ర, భువనగిరి జిల్లా ప్రతినిధి :**

రామన్నపేట మండలంలోని కక్కిరేణి గ్రామ ప్రాథమిక పాఠశాలలో శనివారం స్వపరిపాలన దినోత్సవాన్ని వినూత్నంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు అధికారుల పాత్రలు పోషించి తమ ప్రతిభను ప్రదర్శించగా గ్రామ ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నారు అని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. ఉపేందర్ తెలిపారు. విద్యాశాఖ మంత్రిగా అంకిరెడ్డి జశ్విక, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శిగా కన్నెబోయిన లిఖిత, కలెక్టరుగా చిల్లా యోగిత, ఎమ్మెల్యేగా చిల్లా రాకేష్, జిల్లా విద్యాధికారిగా నడిగోటి తనుస్వి, మండల విద్యాధికారిగా రియన్, తహసీల్దార్‌గా శుష్మ, మండల అభివృద్ధి అధికారిగా మైథిలి, ప్రధానోపాధ్యాయురాలిగా బుర్ర అక్షిత విద్యార్థులు బాధ్యతలు నిర్వహించారు. విద్యార్థులు గ్రామంలో ర్యాలీ నిర్వహించి సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి. గణేష్, పి. గోపాల్ రెడ్డి, కృష్ణ, స్వర్ణలత, ప్రశాంతి, పాఠశాల నిర్వహణ కమిటీ చైర్మన్ చిల్లా హేమలత మురళీకృష్ణ, మాజీ సహకార సంఘం డైరెక్టర్ పిట్ట రాం రెడ్డి, వేముల సైదులు, చిల్లా భవాని, మధు, కావ్య వెంకట్, కమలాకర్, ప్రమీల, సంధ్య, ధనమ్మ, సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

**ముద్ర, మోత్కూరు :**

మోత్కూర్ మున్సిపల్ కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం స్వపరిపాలన దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా విద్యార్థులకు విద్యాబోధన చేశారు. ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి, ప్రజా ప్రతినిధులుగా, ఉన్నతాధికారులుగా తమ తమ విధులు నిర్వహించి ఎంతగానో ఆకట్టుకున్నారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతుల అందజేశారు. కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్మన్ పల్లెర్ల వెంకన్న కౌన్సిలర్ ప్రమీల, ప్రధానోపాధ్యాయులు అరవిందరాయుడు ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా టైలర్స్ డే వేడుకలు

**ముద్ర, మోత్కూర్ :**

మోత్కూర్ మున్సిపాలిటీ పరిధిలో మోత్కూర్ టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టైలర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. విలియమ్స్ హోవే జన్మదినం సందర్భంగా మోత్కూర్ టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జిల్లా రవి విలియమ్స్ హోవే చిత్రపటానికి పూలమాలలు వేసి టైలర్స్ డే కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు పోచం కనక సేన, గౌరవ అధ్యక్షులు జిల్లా వేణు ప్రధాన కార్యదర్శి దండా సత్యం కోశాధికారి ఎడ్ల చంద్రయ్య సహాయ కార్యదర్శి నిలిగొండ నరసయ్య కార్యవర్గ సభ్యులు రచ్చ ఈశ్వరయ్య, జిల్లా యాదగిరి , దునుక అంజయ్య , పుల్కరపు రాజయ్య , జుంజూరు బిక్షపతి , జవ్వాజి వెంకటేశ్వర్లు, దబ్బటి ఎల్లయ్య, పోల్కం శేషయ్య , జనిగల నరసింహ ,బిరుదు శ్రీను ఎంగలి అనిల్ కుమార్ , జల్ది సత్యం , మేడిగ రవి , రేణుకుంట్ల కోటయ్య , తదితరులు పాల్గొన్నారు.

**నడిగూడెంలో..**

ముద్ర, నడిగూడెం : హెలియాస్ హౌవే జన్మదినం పురస్కరించుకొని నడిగూడెం మండల కేంద్రంలో ఘనంగా టైలర్స్ డే ను నిర్వహించారు. టైలర్స్ డే సందర్భంగా స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం మహిళా టైలర్ ను ఘనంగా సన్మానించారు సీనియర్ టైలర్.కాసారపు వెంకన్న మాట్లాడుతూ 1916లోకుట్టు మిషన్ ను హోలియస్ హౌవే కనుకొన్నారు.ఈ మిషన్ దుస్తుల పరిశ్రమలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది అన్నారు. ఈ కార్యక్రమంలో టైలర్స్ టిప్ టాప్ మహిమూద్, ఎస్కె. జలీల్, సికేరా టైలర్ ఎస్కే. ఇస్మాయిల్, బీరవెల్లి వెంకటరెడ్డి, తుల్లా.. కళ్యాణ్ లేడీ టైలర్స్, షేక్ నజియా, షాహిన్, మల్లికా, అరుణ.



హేమలత. సుజాత. దుర్గ కవిత హరిత తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
ఆదివారం 01.03.2026
www.mudranews.in | @mudranews



**టాప్ 10 పండ్ల రసాలు**



అనాస జ్యూస్ జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. శరీరంలోని వాపులను తగ్గించే లక్షణాలు ఉన్నాయి.

# మున్సిపల్ మాజీ చైర్మన్ అరెస్ట్

**- పూచిపై మఖార్జున్ గౌడ్ కు బెయిల్ మంజూరు**

**- అరెస్ట్ ను ఖండించిన హరీష్ రావు, పద్మ**



**ముద్ర ప్రతినిధి, మెదక్:**
మెదక్ మున్సిపల్ చైర్మన్ ఆరెళ్ల మల్లిఖార్జున్ గౌడ్ ను పట్టణ పోలీసులు శనివారం తెల్లవారుజామున అరెస్ట్ చేశారు. మెదక్ రూరల్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. అనంతరం మెదక్ కోర్టులో ప్రవేశపెట్టగా సొంత పూచికత్తుపై బెయిల్ మంజూరు చేశారు. మెదక్ టౌన్ ఇన్ స్పెక్టర్ మహేష్ కథనం ప్రకారం పట్టణంలోని పిట్లంబేస్ వీధిలో నివాసముంటున్న మహ్మద్ ఇమ్రాన్ కుటుంబంపై ఫిబ్రవరి 9న దాడి చేసి, బెదిరింపులకు పాల్పడినట్లు మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లిఖార్జున్ గాడ్, మల్లారెడ్డిపేటకు చెందిన గణేష్, శ్రీను, సురేష్ తదితరులపై ఎన్నికల నియమావళి ఉల్లంఘించారని కేసు నమోదు చేశారు. ఎన్నికల్లో డబ్బులు పంచుతున్నాడని ఆరోపిస్తూ బలవంతంగా ఇంట్లోకి చొరబడి మహ్మద్ ఇమ్రాన్ భార్య, పిల్లలు, సోదరిని భయభ్రాంతులకు గురిచేశారని పేర్కొన్నారు. బాధిత కుటుంబం ఫిర్యాదు చేయడంతో మెదక్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. శనివారం ఉదయం మల్లిఖార్జున్ గౌడ్ ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్ స్పెక్టర్ మహేష్ తెలిపారు.

గతంలో మెదక్ ఎమ్మెల్యేపై దాడికి సంబంధించి నమోదైన కేసులో హైకోర్టు నుంచి స్టే ఉన్నందున, ఆ కేసులలో అరెస్టు చేయలేదని పోలీసులు స్పష్టం చేశారు. కోర్టులో ప్రవేశపెట్టగా న్యాయవాదులు ఎం. దేవేందర్ రెడ్డి, మాయ వెంకటేశం, జీవన్ రావు, ప్రశాంత్ వాదించగా న్యాయమూర్తి బెయిల్ మంజూరు చేశారు.

**అక్రమ కేసులు దారుణం..**



మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లిఖార్జున్ గౌడ్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష పూరితంగా వ్యవహరిస్తూ వరుసగా అక్రమ కేసులు బనాయించి అరెస్ట్ చేస్తున్నారని మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను రాజకీయంగా ఎదుర్కోలేక పోలీసులను అడ్డం పెట్టుకుని కాంగ్రెస్ నాయకులు ఇలాంటి దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. మున్సిపల్ ఎన్నికల సమయం నుంచి మల్లిఖార్జున్ గౌడ్‌పై కాంగ్రెస్ నాయకులు కక్షకట్టారన్నారు. ఇప్పటికే ఆయనపై నాలుగు తప్పుడు కేసులు పెట్టారన్నారు.

**పార్టీ కార్యాలయాలుగా పోలీస్ స్టేషన్లు..**



పోలీస్ స్టేషన్ లు కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలుగా మారాయని మాజీ డిప్యూటీ స్పీకర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు ఎం.పద్మ దేవేందర్ రెడ్డి ఆరోపించారు. తమ పార్టీ నాయకులు, కార్యకర్తల మీద అధికార పార్టీ నాయకులు దాడులు చేస్తే తామే స్వయంగా పోలీస్ స్టేషన్ కు వెళ్లి ఫిర్యాదు చేస్తే ఎఫ్ఐఆర్ చేయడం లేదన్నారు. హై కోర్ట్ స్టే ఇచ్చిన వ్యక్తలను అరెస్ట్ చేయరాదని సుప్రీంకోర్టు మార్గదార్శకలు ఉన్నప్పటికీ పట్టణ పోలీసులు అత్యుత్సాహం చూపించి మల్లిఖార్జున్ గౌడ్ ను అరెస్ట్ చేశారన్నారు.

**కుట్ర పూరితంగా కేసులు..**

మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినప్పటి నుంచి అధికార పార్టీ నాయకులు, ఎమ్మెల్యే కుట్రపన్ని అక్రమంగా కేసులు పెట్టారని మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లిఖార్జున్ గౌడ్ ఆరోపించారు. తనకు హైకోర్టు స్టే ఇచ్చినప్పటికీ సీఐ సిబ్బందితో వచ్చి తన కుటుంబ సభ్యులను భయభ్రాం తులకు గురిచేస్తూ అరెస్ట్ చేశారని తెలి పారు. అక్రమ కేసులు పెట్టిన వారిని న్యాయస్థానానికి ఈడుస్తామని హెచ్చరించారు.

## హెచ్ పీవీ వ్యాక్సినేషన్ డ్రైవ్ ప్రారంభించిన మంత్రి




**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి:** హైదరాబాద్ లోని కింగ్ కోటి ఆసుపత్రిలో శనివారం వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా హెచ్ పీవీ వ్యాక్సినేషన్ డ్రైవ్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మూడు నెలల వరకు రాష్ట్రంలోని ప్రభుత్వ జనరల్ హాస్పిటళ్లు, ఏరియా ఆస్పత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లల్లో వ్యాక్సిన్ అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఆడబిడ్డల ఆరోగ్యాన్ని కాపాడేందుకు బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు, కాలుష్యం వంటి అనేక కారణాల వల్ల దేశ వ్యాప్తంగా క్యాన్సర్ మహమ్మారి కోరలు చాస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దురదృష్టవశాత్తు మన రాష్ట్రంలో కూడా ఏటా 55 వేల నుంచి 60 వేల క్యాన్సర్ కేసులు నమోదవుతున్నాయని తెలిపారు. రాబోయే ఐదేళ్లలో ఈ సంఖ్య మరో పది శాతం పెరుగుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారని గుర్తు చేశారు. ఈ ప్రమాదాన్ని ఎదుర్కోవడానికి ప్రభుత్వం సమగ్ర క్యాన్సర్ పాలసీ రూపొందించిందన్నారు. క్యాన్సర్ వైద్య సేవలు కేవలం హైదరాబాద్‌కే పరిమితం కాకుండా, ములుగు, ఆదిలాబాద్ వంటి మారుమూల జిల్లాల్లో కూడా కీమోథెరపీ సేవలను అందుబాటులోకి తెచ్చామని పేర్కొన్నారు. ప్రతి జిల్లాలో డే కేర్ క్యాన్సర్ సెంటర్లను ఏర్పాటు చేశామని చెప్పారు. వ్యాధిని ముందే గుర్తించడానికి మొబైల్ స్క్రీనింగ్ యూనిట్స్ అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. ఆరోగ్య మహిళ క్లినిక్‌ల ద్వారా మహిళలకు విస్తృతంగా పరీక్షలు నిర్వహిస్తున్నామని వివరించారు. క్యాన్సర్ వ్యాధి నియంత్రణకు మరింత పకడ్బందీ చర్యలు తీసుకోబోతున్నామని చెప్పారు. క్యాన్సర్ చికిత్సా రంగంలో ప్రఖ్యాతిగాంచిన డాక్టర్ నోరి దత్తాత్రేయుడుని సలహాదారుగా నియమించుకున్నామని తెలిపారు. ఆయన సలహాలు, సూచనలతో క్యాన్సర్ కట్టడికి అనేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. దేశంలో మహిళల్లో వచ్చే క్యాన్సర్లలో సర్వైకల్ కేన్సర్ రెండో స్థానంలో ఉందన్నారు. హ్యూమన్ పాపిలోమా అనే వైరస్ వల్లే ఈ వ్యాధి వస్తుందన్నారు. ఆ వైరస్‌ను అంతం చేయడానికే కేంద్ర ప్రభుత్వ సహకారంతో, రాష్ట్ర వ్యాప్తంగా హెచ్ పీవీ వ్యాక్సినేషన్ డ్రైవ్ ప్రారంభించామన్నారు. ఈడ్రైవ్‌లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 3.5 నుంచి 4 లక్షల మంది బాలికలకు మూడు నెలల్లో వ్యాక్సిన్ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, హెల్త్ ప్రిన్సిపల్ సెక్రెటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రిని కలిసిన కలెక్టర్



**ముద్ర ప్రతినిధి, మెదక్:**
మెదక్ కలెక్టర్ ప్రతిమా సింగ్ శనివారం జిల్లా ఇంచార్జి మంత్రి వివేక్ వెంకటస్వామిని పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. మూడు రోజుల క్రితం మెదక్ కలెక్టర్ గా ప్రతిమా సింగ్ బాధ్యతలు తీసుకున్న విషయం విదితమే. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాను రాష్ట్రంలో ఆదర్శంగా తీర్చిదిద్దాలని సూచించారు. ప్రజా ప్రభుత్వానికి మరింత మంచి పేరు తేవాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకం వమ్ము చేయనని తెలిపారు. అహర్నిశలు పనిచేసి జిల్లాకు గుర్తింపు తెస్తానని పేర్కొన్నారు

# నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి

**- అడిషనల్ కలెక్టర్ మెంచు నగేష్**




**ముద్ర ప్రతినిధి, మెదక్:**
విద్యార్థులు పాఠశాల స్థాయి నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని అడిషనల్ కలెక్టర్ మెంచు నగేష్ సూచించారు. శనివారం మెదక్ కలెక్టరేట్ లో జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో పీఎంశ్రీ కార్యక్రమాల నిర్వహణలో భాగంగా మోడల్ యునైటెడ్ నేషన్స్ పోటీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని అడిషనల్ కలెక్టర్ ప్రారంభించారు. జిల్లాలోని 31 పీఎంశ్రీ పాఠశాలల నుంచి ముగ్గురు విద్యార్థులు వివిధ దేశాల ప్రతినిధులుగా పాల్గొన్నారు. ఇందులో వివిధ పాఠశాల నుంచి వచ్చిన విద్యార్థులు 56 దేశాలకు ప్రతినిధులుగా వ్యవహరించారు. మిగతా విద్యార్థులు అంతర్జాతీయ విలేకరులుగా వ్యవహరించారు. అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక అంశంపై చర్చించి వివిధ తీర్మానాలు చేశారు. అంతర్జాతీయ అంశాలు, ఐక్యరాజ్యసమితి నిర్వహణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. రాష్ట్రంలోనే మొదటిసారిగా మెదక్ జిల్లాలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 11 మంది విద్యార్థులను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాల స్థాయిలోనే విద్యార్థులకు ఇలాంటి కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తే ఉత్తమ పౌరులుగా మారుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈవో ఎల్లయ్య, జిల్లా విద్యాధికారి విజయ, జిల్లా అకాడమిక్ మానిట రింగ్ ఆఫీసర్ సుదర్శన్ మూర్తి, కోఆర్డి నేటర్ లు రాజు, నవీన్, జిల్లా సైన్స్ అధి కారి రాజిరెడ్డి, వివిధ పాఠశాలల నుంచి వచ్చిన గైడ్ టీచర్లు పాల్గొన్నారు. జడ్జిలుగా మెదక్ ఎంఈఓ శంకర్, గాంధర్ పల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మాపూర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓపెన్ డే



**సిద్దిపేట, ముద్ర ప్రతినిధి:** జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ఓపెన్ డే నిర్వహించారు. వివిధ సైన్స్ ల్యాబ్ పరికరాలను, వాటి పనితీరును ప్రదర్శించారు. పట్టణంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో సందర్శించి వాటి ప్రాధాన్యాన్ని తెలుసుకున్నారు. వ్యాసరచన, క్విజ్, పోస్టర్ ప్రదర్శనల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ జి. సునీత అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి. అయోధ్య రెడ్డి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డా.సీహెచ్ మధుసూదన్, డా .శ్రీధర్, డా. రాణి, డా. పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పదవి విరమణ సహజం




**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి:**
ఉద్యోగి జీవితంలో పదవీ విరమణ సహజమని ఎస్పీ పరితోజ్ పంకజ్ అన్నారు. శనివారం పదవి విరమణ పొందుతున్న అధికారులు ధశరత్ ఎస్ఐ, యాదగిరి ఏఎస్ఐ లను ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ధశరత్, పోలీసు శాఖలో కానిస్టేబుల్‌గా నియామకమై అంచెలంచెలుగా పదోన్నతులు పొందుతూ ఎసై గా ఎదగడం కృషికి నిదర్శనం అన్నారు. యాదగిరి పోలీస్ కానిస్టేబుల్‌గా చేరి, అంచెలంచెలుగా పదోన్నతులు పొంది అసిస్టెంట్ ఎసై హోదాకు చేరడం ప్రతిభకు నిదర్శనమన్నారు. అదనపు ఎస్పీ శ్రీనివాస్ రావ్, అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఇ.కళ్యాణి, ఏఆర్ డిఎస్పీ నరేందర్, ఆఫీస్ సూపరింటెండెంట్ అశోక్, మోహనప్ప,ఎస్బీ ఇన్ స్పెక్టర్ కిరణ్ కుమార్, ఆర్ఐ లు రాజశేఖర్, డానియెల్ పాల్గొన్నారు.

# సంపన్నులకే మాత్రమే అచ్చే దిన్

**- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు**





**సిద్దిపేట, ముద్ర ప్రతినిధి:**
ఇటీవల ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ సంపన్నులకు మాత్రమే లాభాలు ఆర్జించే విధంగా ఉందని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు ఆరోపించారు.

అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని కార్మిక కర్షక భవనంలో సీఐటీయూ రైతు సంఘం, వ్యవసాయ, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ బడ్జెట్–ప్రజలపై భారాలు అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చుక్కా రాములు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రతిపాదించిన బడ్జెట్ కేటాయింపులు సామాన్యులకు నష్టం చేసేవిధంగా ఉందని విమర్శించారు. కార్పొరేట్ శక్తులకు పెద్ద పీట వేసే విధంగా ఉందని దుయ్యబట్టారు. కేంద్రం ప్రయోగిత పథకాలకు సబ్సిడీ తగ్గింపు స్పష్టంగా కనబడుతుందన్నారు. కార్పొరేట్ కంపెనీలకు ఉపయోగపడే ప్రతిపాదనలు నిండుగా ఉన్నాయన్నారు. బ్యాంకింగ్ రంగంలో సంస్కరణలు కొనసాగించడం అంటే బ్యాంకులను విలీనం చేసే ప్రమాదం ఉందన్నారు. సంపన్నులు వాడుకునే విదేశీ సరుకులపై దిగుమతి పన్ను తగ్గించారన్నారు. పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ మీద వేసే కేంద్రం ఎక్సైజ్ డ్యూటీలో 2024 –25 నుంచి 2026 –27 వరకు స్థిరమైన పెరుగుదల కొనసాగిస్తున్నారని ఆయన మండిపడ్డారు.

విద్యా రంగానికి మూడు శాతం లోపే నిధులు కేటాయించారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం స్కీం వర్కర్లకు 2018 నుంచి వేతనాలు పెంచడం లేదన్నారు. బడ్జెట్ లో ఉద్యోగుల ప్రస్తావనే లేదన్నారు. బడ్జెట్ లో కార్మిక వర్గం మన వాటా కోసం పోరాటం కొనసాగించాలని చుక్క రాములు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఆముదాల మల్లారెడ్డి, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు, కార్యదర్శి సందబోయిన ఎల్లయ్య, కాముని గోపాలస్వామి, జిల్లా కోశాధికారి జి. భాస్కర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రాళ్లబండి శశిధర్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొంగర వెంకట్, మావోయిద్వా జిల్లా సహాయ కార్యదర్శి జాలీగాపు శిరీష, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు శెట్టిపల్లి సత్తిరెడ్డి, ఎం. పద్మ, అమ్ముల బాల నర్సయ్య, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సు, లారీ ఢీ

**- 15 మందికి స్వల్ప గాయాలు**




**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి:**
జహీరాబాద్ నుంచి సదాశివపేట పట్టణ సమీపంలో (బైపాస్ 65 జాతీయ రహదారిపై) శనివారం ఉదయం ఆర్టీసీ బస్సు,లారీ ఢీకొన్నాయి. బస్సులో ప్రయాణిస్తున్న 15మందికి తీవ్ర గాయాలయ్యాయి. సీఐ వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం బస్టాండ్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు సదాశివపేట నుంచి జహీరాబాద్ వైపు వెళ్తున్న లారీ ప్రమాద సమయంలో బస్సులో మొత్తం 50 మంది ప్రయాణికులు ఉన్నారు.ఈబస్సు ప్రమాదంలో గాయపడిన వారు వట్ పల్లికి చెందిన ఆవసలి బసవరాజు (25), చిన్నశంకరం పేటకు చెందిన షేక్ మహబూబ్(55), బిలాలు పూర్ కు చెందిన గొల్ల కాంసమ్మ(33), హైదరాబాద్ కు చెందిన హిమ బిందు(37), మానూర్ మండలం తోరణాలకు చెందిన మెత్తరి జర్నమ్మ(55), కూల్చారం మండలం మగ్దూంపూర్ కు చెందిన మహేశ్వరి(23), మునిపల్లీ మండలం భూదేరా కు చెందిన గౌసియా బేగం(52), హైదరాబాద్ కు చెందిన సోమేశ్వర(22), జహీరాబాద్ కు చెందిన మారుతి(30), కోహీర్ మండలం బిలాలు పూర్ కు చెందిన బస్సు కండక్టర్ అంజయ్య (55), మునిపల్లీ మండలం పెద్ద గోపులారంకు చెందిన శ్రీలత(23), సదాశివపేట మండలం అంకేనపల్లి కు చెందిన మీన (25),ఝరాసంఘం మండలం బిడెకన్నెకు చెందిన రత్నమ్మ(56), మర్పల్లి మండలం నాగిరెడ్డిపల్లి కి చెందిన రాధిక(38) తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డవారిని మెరుగైన చికిత్స అందించేందుకు పోలీసులు అంబులెన్స్ సహాయంతో సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసినట్లు సీఐ వెంకటేష్ తెలిపారు. గాయపడ్డవారిని జిల్లా ఎస్పీ పరితోజ్ పంకజ్ సందర్శించారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
ఆదివారం 01.03.2026
www.mudranews.in | @mudranews



### టాప్ 10 పండ్ల రసాలు

పుచ్చకాయ జ్యూస్

ఎండాకాలంలో శరీరాన్ని చల్లగా ఉంచుతుంది. నీటి శాతం ఎక్కువగా ఉండి డీహైడ్రేషన్‌ను నివారిస్తుంది.



# ఆరోగ్య సంరక్షణకు 'హెల్త్ మిషన్-100'

- గ్రామీణ మహిళలకు డిజిటల్ హెల్త్ ప్రొఫైల్
- రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 2 నుంచి జూన్ 9 వరకు నిర్వహణ
- టీ డయాగ్నస్టిక్స్ ద్వారా 30 రకాల మెడికల్ పరీక్షలు ఉచితం
- 42 లక్షల మంది స్వయం సహాయక సంఘాల మహిళలకు లబ్ధి



**ముద్ర, తెలంగాణ బ్యూరో:** ప్రజల ఆరోగ్య సంరక్షణకు పెద్దపీట వేసిన రాష్ట్ర ప్రభుత్వం వంద రోజుల ప్రత్యేక ప్రచార కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మహిళలు, వృద్ధులు, చిన్నారులలకు ప్రాధాన్యం ఇస్తూ మార్చి 2 నుంచి జూన్ 9 వరకు 'హెల్త్ మిషన్–100' పేరిట ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు సిద్ధమైంది. టీ–డయాగ్నస్టిక్స్ ద్వారా దాదాపు 42 లక్షల మంది స్వయం సహాయక సంఘాల మహిళలకు 30 రకాల మెడికల్ పరీక్షలు ఉచితంగా నిర్వహించనున్నది. గ్రామీణ మహిళలకు డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ రూపొందిచటంతో పాటు పలు కార్యక్రమాలకు తెలంగాణ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రణాళికలు సిద్ధం చేసింది. అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు కావాల్సిన సౌకర్యాలపై అధికారులు దృష్టి సారించనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా.. మార్చి 2 నుంచి 31 వరకు.. పీహెచ్‌సీలలో గైనకాలజీ, పిల్లల, కంటి, ఎముకలు, దంత వైద్య నిపుణులతో ప్రత్యేక వైద్య సేవలు అందిస్తారు. 33 గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్స్‌లో ప్రత్యేక వృద్ధాప్య చికిత్స శిబిరాలు, స్క్రీనింగ్ పరీక్షలు చేయనున్నారు. రక్తహీనత, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ స్క్రీనింగ్, ఐరన్ మాత్రల పంపిణీ చేయనున్నారు. స్కూళ్లు, అంగన్ వాడీ కేంద్రాల్లో ఆర్‌బీఎస్‌కే ద్వారా విద్యార్థులకు కంటి చూపు పరీక్షలు, పోషకాహారం, వ్యాధి నిరోధక టీకాలు ఇవ్వనున్నారు. ఏప్రిల్ 1 నుంచి 15 వరకు క్యాన్సర్‌ను నోటిఫైడ్ వ్యాధిగా ప్రకటించటం, క్యాన్సర్ కేర్ పాలసీ, క్యాన్సర్ రిజిస్ట్రీ ఏర్పాటు, బాధితులకు వైద్య సేవలు, ఆరోగ్య మహిళ కింద క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపులు, జిల్లా డే–కేర్ క్యాన్సర్ కేంద్రాల్లో కీమోథెరపీ సేవల మ్యాపింగ్ వంటివి నిర్వహించనున్నారు. ఏప్రిల్ 16 నుంచి మే 15 వరకు మహిళలకు పరీక్షలు నిర్వహించి టీబీ కేసుల గుర్తింపు, చికిత్స, డెంగ్యూ, వడదెబ్బ, అతిసారం వంటి వ్యాధులపై స్క్రీనింగ్ చేస్తారు. హైదరాబాద్ నగరంలోని కింగ్ కోఠి, వనస్థలిపురం, కరీంనగర్, ఆసిఫాబాద్, నిజామాబాద్ ఆసుపత్రుల్లో ప్రత్యేకంగా వడదెబ్బ చికిత్స గదులు ఏర్పాటు చేస్తారు. మే 16 నుంచి జూన్ 9 వరకు పట్టణ పీహెచ్‌సీలను పాలీ క్లినిక్స్‌గా అప్‌గ్రేడ్ చేయటంతో పాటు ఐటీడీఏ ప్రాంతాల్లో సికిల్‌సెల్, థలసీమియా స్క్రీనింగ్‌కు మొబైల్ మెడికల్ యూనిట్ల ఏర్పాటు చేయనున్నారు.

హీమోఫీలియాపై దృష్టి సారించి ఆయా పాఠశాలలు, హాస్టల్స్‌లో ఆహార తనిఖీలు చేపట్టనున్నారు. జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రచార విజయాల ప్రదర్శన, జూన్ 7న ప్రపంచ ఆహార భద్రతా దినోత్సవం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర వైద్యా ఆరోగ్యశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తు న్నారు.

## పోలీస్ యాక్ట్-30 అమలు

**ముద్ర, సూర్యాపేట :**

శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా మార్చి 1 నుంచి నెలరోజుల పాటు పోలీసు యాక్ట్ 30 అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో పోలీసు అధికారుల అనుమతి లేకుండా ఎలాంటి ర్యాలీలు, సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు, బహిరంగ సభలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. ప్రజలు గుమిగూడే కార్యక్రమాలకు ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. అనుమతి లేకుండా కార్యక్రమాలు నిర్వహిస్తే నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారం చేసిన వారిపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. బాణాసంచా, డీజే వినియోగం నిషేధమని పేర్కొన్నారు. జారీ చేసిన ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఎస్పీ స్పష్టం చేశారు.

# ఉద్యమకారుల డిమాండ్లు నెరవేర్చాలి

- ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పూస శ్రీనివాస్



**ముద్ర, భువనగిరి జిల్లా ప్రతినిధి:**

తెలంగాణ రాష్ట్రం నిధులు, నీళ్లు, నియామకాల కోసం సాధించుకున్నదని, అయితే గత ప్రభుత్వం వాటిని నిర్లక్ష్యం చేసిందని తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పూస శ్రీనివాస్ విమర్శించారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిపాలనలో ఉద్యమకారుల ఆకాంక్షలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. శనివారం భువనగిరి జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్థూపం వద్ద సంఘం ఆధ్వర్యంలో దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థికంగా బలంగా ఉన్నప్పటికీ ఉద్యమ కారులకు తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదన్నారు. ఉద్యమకారులకు 250 చదరపు గజాల స్థలం, నెలకు రూ.30,000 పెన్షన్, ఆరోగ్య కార్డులు వెంటనే మంజూరు చేసి ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మెరుగు మధు, ముప్కె జయపాల్ రెడ్డి, మంతపురం వినోద్, సుర్వి శ్రీనివాస్ గౌడ్, డి.ఎస్. మాణిక్యమ్మ, బేజాడి కుమార్, కొడిమాల కృష్ణ, గొర్ల లక్ష్మణ్, గోపరాజు గణేష్, అవిశెట్టి పాండు, జేరిపోతుల బాలయ్య, పంజాల శ్రీనివాస్ గౌడ్, లింగంపల్లి రవీందర్, బొమ్మ రవీందర్, ఉప్పల కృష్ణమాచారి తదితరులు పాల్గొన్నారు.

# పశ్చిమాసియాలో మరో యుద్ధం

- ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ భీకర దాడులు..
- ప్రతిగా అమెరికా స్థావరాలపై ఇరాన్ క్షిపణుల వర్షం
- టెహ్రాన్, ఇస్ఫహాన్‌లో పేలుళ్లు.. 30 ప్రాంతాలపై క్షిపణి దాడులు



**ముద్ర న్యూస్:**

ఇరాన్‌పై అమెరికా సహకారంతో ఇజ్రాయెల్ విరుచుకుపడింది. మిలటరీ స్థావరాలే లక్ష్యంగా క్షిపణులతో దాడి చేసింది. ఇజ్రాయెల్ 'లయన్స్ రోర్' పేరుతో ఈ ఆపరేషన్ చేపట్టింది. టెహ్రాన్, ఇస్ఫహాన్ సహా కీలక నగరాల్లో దాడులు కొనసాగుతున్నాయి. ఇరాన్ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీతో సహా 30 ప్రాంతాల లక్ష్యంగా దాడులు చేసినట్టు అంతర్జాతీయ మీడియా నివేదించింది. టెహ్రాన్ నగరమంతా పేలుళ్ల శబ్దంతో దద్దరిల్లుతోంది. ఆ ప్రాంతంలో భారీగా పొగలు వ్యాపించాయి. అయితే అమెరికా సాయంతోనే ఇజ్రాయెల్ రెచ్చిపోయి ఈ దాడులు చేస్తోందంటున్నారు. ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ నివాసంతో పాటుగా ఇంటిలిజెన్స్, రక్షణశాఖ ప్రధాన కార్యాలయాన్ని టార్గెట్ చేశారు. ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ లక్ష్యంగా దాడులు జరుగుతున్నాయి.. ఏకంగా ఖమేని కార్యాలయం దగ్గరలో క్షిపణి దాడి జరిగింది. ఖమేని ఇల్లు, కార్యాలయం సమీపంలో ఈ దాడులు జరుగుతున్నాయి. అయితే దాడులకు ముందే ఖమేని బంకర్‌లోకి వెళ్లినట్లు తెలుస్తోంది. ఇరాన్‌పై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా స్పందించారు. ఇరాన్ అణు ఆయుధాలను మళ్లీ తయారు చేస్తుందన్నారు. అమెరికా సైన్యం ఇరాన్ పై దాడులు చేపట్టింది.. అమెరికా ప్రజలకు పొంచి ఉన్న ప్రమాదాన్ని ఎదర్కొనేందుకు దాడులు.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అమెరికా సైనిక స్థావరాలకు ముప్పు ఉండటం వల్లే దాడులు చేస్తున్నామన్నారు. ఇజ్రాయిల్ దాడులపై ఇరాన్ ఘాటుగా స్పందించింది. ఈ యుద్ధానికి ఊహించని రీతిలో ముగింపు ఉంటుందని మండిపడింది. యుద్ధం మీరు ప్రారంభించారు మేము ముగిస్తాం. ప్రతీకారం దారుణంగా ఉంటాయి. వేలాది మంది సైనికులు మరణించారని ప్రకటిం చింది.

ఇటు ఇజ్రాయిల్ ముందుగానే అలర్ట్ అయ్యింది.. ఇరాన్ ప్రతి దాడులు చేసే అవకాశం ఉండటంతో దేశ ప్రజల్ని అప్రమత్తం చేసింది. ఇరాన్ వైమానిక దాడులకు పాల్పడే అవకాశం ఉందని దేశంలో ఎమర్జెన్సీ ప్రకటించింది.

ఆయా ప్రాంతాల్లో ముందుగానే సైరన్లు మోగాయి. ముందస్తు జాగ్రత్తగా స్కూళ్లు, కార్యాలయాలను మూసి వేయాలని అలర్ట్ చేశారు. ఇజ్రాయెల్ పౌర విమానాలకు గగనతలాన్ని మూసివేసింది. ఇరాన్, ఇరాక్‌లు కూడా గగనతలాన్ని మూసివేశాయి. ఇరాన్‌లో మొబైల్ ఫోన్ సేవలు సైతం నిలిచిపోయాయి.

## శారద పీఠం భూములు కొనసాగింపు..

- జలమండలికి కేటాయింపులు రద్దు
- నిర్మాణాల స్థితిపై తాజా సమాచారం తెలియజేయనందుకు అధికారులపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం



**ముద్ర, తెలంగాణ బ్యూరో:** కోకాపేటలో శారదా పీఠానికి కేటా యించిన భూమిని మార్చొద్దని ముఖ్య మంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. పీఠం భూములు జల మండలికి కేటాయించిన నేపథ్యంలో అక్కడ సాగుతున్న నిర్మాణ పనుల విషయాలను పీఠం ప్రతినిధులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ అంశంపై రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులతో శనివారం సాయంత్రం సమావేశమయ్యారు. కోకాపేట భూముల్లో పీఠం ఆధ్వర్యంలో వివిధ నిర్మాణాల తాజా స్థితిని ముఖ్యమంత్రి తెలుసుకున్నారు. పీఠం భూములను జలమండలికి కేటాయించే సమయంలో నిర్మాణాల స్థితిని తెలియజేయకపోవడంపై ముఖ్యమంత్రి మండిపడ్డారు. జల మండలికి కేటాయింపులు రద్దు చేసి పీఠానికే ఆ భూములు కొనసాగించాలని ఆదేశించారు. మంత్రి శ్రీధర్‌బాబును కలిసి నిర్మాణాలు, ఇతర పరిస్థితులను వివరించాలని ముఖ్యమంత్రి పీఠం ప్రతినిధులకు సూచించారు.

## మోదీ విధానాలు దేశానికి ముప్పు

**ముద్ర, భువనగిరి జిల్లా ప్రతినిధి:**

కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రధాని నరేంద్ర మోడీ అమలు చేస్తున్న విధానాలు అమెరికా సామ్రాజ్యవాదానికి దారులు వేస్తున్నాయని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎస్. వీరయ్య విమర్శించారు. శనివారం స్థానిక సుందరయ్య భవన్‌లో జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మాటూరి బాలరాజు అధ్యక్షతన నిర్వహించిన కార్యశాలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ సంస్థలకు రాయితీలు ఇస్తూ దేశ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తున్నారని, నిరుద్యోగం పెరుగుతోందని ఆరోపించారు. అమెరికా విధిస్తున్న సుంకాలపై కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం ఆశ్చర్యకరమన్నారు. రష్యా నుంచి చమురు కొనుగోలు విషయంలో అమెరికా ఒత్తిడిపై కేంద్రం ఖండన తెలియజేయలేదని విమర్శించారు. ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరిచే చర్యలు తీసుకుంటూ గ్రామీణ కార్మికుల ఉపాధిని దెబ్బతీస్తోందన్నారు. విద్యుత్ సవరణ బిల్లు, కార్మిక కోడ్‌ల ద్వారా పేద, మధ్యతరగతి ప్రజలపై భారాలు మోపాలని చూస్తోందని ఆరోపించారు. రాష్ట్ర సమస్యలపైనా స్పందిస్తూ, తెలంగాణలో బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని, ఖమ్మం జిల్లా వెలుగుమట్ల నిర్వాసితులకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో రైతులకు లాభం కలగలేదని అన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్ మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లాకు బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించాలని కోరారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నరసింహ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కల్లూరి మల్లేశం, దాసరి పాండు, జెల్లెల పెంటయ్య బూరుగు కృష్ణారెడ్డి గుంటోజు శ్రీనివాసాచారి జిల్లా కమిటి సభ్యులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి, సిర్పంగి స్వామి, దయ్యాల నరసింహ, మాయ కృష్ణ, బొల్లు యాదగిరి, మద్దెల రాజయ్య, ఎండి పాష, బొడ్డుపల్లి వెంకటేష్ ,గుండు వెంకటనర్సు, గంగదేవి సైదులు, మద్దేపూరం రాజు ,బోలగాని జయరాములు, ఎంఎ ఇక్బాల్, గడ్డం వెంకటేష్ రాగిరు కిష్టయ్య, బల్గూరి అంజయ్య, గోశిక కరుణాకర్, నాయకులు పల్లెర్ల అంజయ్య, ధూపటి వెంకటేష్, ర్యాఖల శ్రీశైలం, పోతరాజు జహంగీర్, లావుడియా రాజు, ఈర్లపల్లి ముత్యాలు, వడ్డేబోయిన వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## చైర్మన్‌కు ముదిరాజ్ సంఘం సన్మానం

**ముద్ర, భువనగిరి జిల్లా ప్రతినిధి:**

ముదిరాజ్ సంఘ ఆధ్వర్యంలో భువనగిరి మున్సిపల్ చైర్మన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవి కుమార్ ని శనివారం ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ముదిరాజ్ సంఘం అభివృద్ధి కి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు కొల్పుల హరినాథ్, పెంట నర్సింహ్, కుక్కదువు సోమయ్య, పచ్చల జగన్, ఇట్టబోయిన గోపాల్, ఎనబోయిన జహంగీర్, బిస్కోంట్ల సత్యనారాయణ, ఉడత భాస్కర్, విజయ్ కుమార, ధర్మరాజు, నాగరాజు, పెంట నితీష్, శ్యామ్, పెంట మల్లేష్, బోయిని బాలయ్య, బోయిని రాములు, పోతురాజు రవి పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధే లక్ష్యం

**ముద్ర, నడిగూడెం:**

చెన్నకేశవపురం గ్రామపంచాయతీ పరిధిలో సర్పంచ్ గోసుల రాజేష్ ఆధ్వర్యంలో, ప్రజా నిర్మాణ శాఖ సహాయ ఇంజినీర్ పర్యవేక్షణలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.10 లక్షలతో 8వ వార్డులో సిమెంట్ కాంక్రీట్ రహదారి నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గోసుల రాజేష్, ఉపసర్పంచ్ కటికల పుల్లయ్య, పాలకవర్గ సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, గ్రామ పెద్దలు గుజ్జర్లపూడి అర్జున్‌రావు, మేకల గోవర్ధన్, సంకోజు జానయ్య, సంకోజు నిర్మల, చల్లా సత్యనారాయణ, మేకల కృష్ణమూర్తి, కొత్త ఉపేందర్, శేఖర్, ఫీల్డ్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మీయ సన్మానం

**ముద్ర, మోత్కూర్:**

ఇటీవల మోత్కూరు మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం స్వప్న సోమ నర్సయ్య, వైస్ చైర్మెన్ పల్లెర్ల వెంకన్న గుప్తా, 8వ వార్డు కౌన్సిలర్ పన్నాల శ్రీవిద్య, శ్రీనివాస్ రెడ్డి గార్లకు బీసీ రిజర్వేషన్ సాధన సమితి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఆత్మీయ సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు బుర్ర శ్రీనివాస్ గౌడ్, మండల అధ్యక్షులు శివార్ల శ్రీనివాస్ యాదవ్, పట్టణ అధ్యక్షులు నిలిగొండ మత్స్యగిరి తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల వార్షికోత్సవ వేడుకలు

**ముద్ర, మోత్కూరు:**

మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని అక్షర ఇంగ్లీష్ మీడియం పాఠశాల వార్షికోత్సవ వేడుకలను శనివారం అంగరంగ వైభవంగ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల చిన్నారులు వేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. చదువులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.పాఠశాల ప్రిన్సిపాల్ రాజిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులను అన్ని రంగాల్లో ఉన్నతులుగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
01.03.2026 ఆదివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



టాప్ 10 పండ్ల రసాలు

8. బొప్పాయి జ్యూస్
జీర్ణ సమస్యలను తగ్గిస్తుంది. చర్మ ఆరోగ్యానికి చాలా మంచిది.

# పవర్ రికార్డ్

- ఒక్కరోజే గరిష్టంగా 6,057 మె.వా విద్యుత్ వినియోగం
- గత ఏడాది మార్చి 11న 5,816 మె.వా రికార్డ్
- ఫిబ్రవరిలోనే విద్యుత్ వినియోగం రికార్డు స్థాయికి చేరింది
- ఎండల ప్రభావంతో విద్యుత్ అవసరం ఒక్కసారిగా పెరుగుదల
- ముందస్తు ప్రణాళికలతో విద్యుత్ సరఫరా బలోపేతం
- వేసవికాల డిమాండ్‌కు సిద్ధంగా ఉన్న ఎన్పీడీసీఎల్ యంత్రాంగం

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

ఎండలు ముదరనే లేదు.. అప్పుడే భానుడు ప్రతాపం చూపుతున్నాడు. మార్చి నెల ప్రారంభం కాకముందే ప్రచండ రూపం చూపుతున్నాడు. దీంతో రాష్ట్రంలో ఒక్కసారిగా విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగింది. ఈ క్రమంలో తెలంగాణ ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీ ఎన్పీడీసీఎల్) పరిధిలో విద్యుత్ వినియోగం సరికొత్త గరిష్ట స్థాయిని తాకింది. శనివారం ఒక్క రోజే గరిష్టంగా 6,057 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ నమోదైంది. ఫిబ్రవరిలో ఈ స్థాయిలో విద్యుత్ వినియోగం ఉండడం ఇదే తొలిసారి అని ఆ సంస్థ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి వెల్లడించారు. గత ఏడాది మార్చి 11న నమోదైన 5,816 మెగావాట్ల అత్యధిక డిమాండ్ రికార్డును ఈ ఏడాది ఫిబ్రవరిలోనే దాటేయడం గమనార్హం అన్నారు. శనివారం మీడియాకు ప్రకటన విడుదల చేసిన ఆయన... నిరంతర విద్యుత్ సరఫరాను అందించేందుకు ముందస్తు ప్రణాళికలతో చేపట్టిన చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయని వివరించారు. 35 కొత్త 33/11 కేవీ సబ్‌స్టేషన్లు ప్రారంభించామన్నారు. 366 అదనపు పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు చేశామన్న ఆయన 7600 ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచామన్నారు. ఓవర్‌లోడ్ ఉన్న 33 కేవీ 8 ఫీడర్లను విభజన చేశామనీ 1200 కి.మీ మేర 33 కేవీ ప్రత్యామ్నాయ (ఆల్టర్నేట్) లైన్ల ఏర్పాటు చేశామని ఆయన వివరించారు. లో వోల్టేజి తగ్గించడానికి 392 కెపాసిటర్ బ్యాంకులు పెట్టామని చెప్పారు. వేసవి కాలంలో మరింత పెరగనున్న డిమాండ్‌కు అనుగుణంగా నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేసేందుకు ఎన్పీడీసీఎల్ యంత్రాంగం పూర్తి సన్నద్ధతతో ఉందని సీఎండీ స్పష్టం చేశారు.

# రోడ్లు ఉంటేనే పెట్టుబడులు.. పరిశ్రమలు

- రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి నిర్మాణ రంగం కీలకం
- మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధికి సర్కార్ ప్రాధాన్యత
- బిల్డర్స్ నేషనల్ మేనేజింగ్ కమిటీ, జనరల్ కౌన్సిల్ సమావేశంలో మంత్రి కోమటిరెడ్డి

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు. రోడ్లు, భవనాల నిర్మాణంలో నాణ్యతకు అత్యున్నత ప్రాధాన్యం కల్పిస్తూ వేగవంతమైన అభివృద్ధి లక్ష్యంగా విజన్ 2047 లక్ష్యంతో ముందుకు సాగుతోందన్నారు. నిర్మాణ రంగం రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి కీలకమని, ప్రభుత్వంతో కలిసి పనిచేస్తూ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని బిల్డర్లకు పిలుపునిచ్చారు. శనివారం హైదరాబాద్ లో బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ మేనేజింగ్ కమిటీ, జనరల్ కౌన్సిల్ సమావేశంలో మంత్రి మాట్లాడారు. అభివృద్ధికి ప్రధాన పునాది మౌలిక వసతులేనన్న మంత్రి రోడ్లు బలంగా ఉంటేనే పెట్టుబడులు వస్తాయని చెప్పారు. కనెక్టివిటీ బాగుంటేనే పరిశ్రమలు క్యూ కడతాయన్నారు. అందుకే తాము రోడ్లు, భవనాల రంగంలో భారీగా పనులు చేపట్టామని చెప్పారు. ప్రస్తుతం దాదాపు ఒక లక్ష కోట్ల రూపాయల విలువైన పనులు రాష్ట్రంలో కొనసాగుతున్నాయని చెప్పారు. హైబ్రిడ్ అన్యుటీ మోడల్ (హ్యామ్) ప్రాజెక్టులు, రీజినల్ రింగ్ రోడ్, నేషనల్ హైవేల విస్తరణ, స్టేట్ హైవేలు, ఫ్లైఓవర్లు, రైల్వే ఓవర్ బ్రిడ్జిలు పనులు ప్రతి ప్రాంతంలో వేగంగా జరుగుతున్నాయన్నారు. రీజినల్ రింగ్ రోడ్ తెలంగాణ భవిష్యత్తును మార్చే ప్రాజెక్ట్ అని అన్న మంత్రి.. ఇది హైదరాబాద్ చుట్టూ ట్రాఫిక్ భారాన్ని తగ్గించడంతో పాటు పరిసర జిల్లాల్లో కొత్త అభివృద్ధి మార్గాలను తెరుస్తుందన్నారు. ఇది ఆర్థిక కారిడార్లకు దారి తీస్తుందని మంత్రి వెంకట్ రెడ్డి అభిప్రాయపడ్డారు. అయితే ప్రభుత్వాలు ప్రణాళికలు చేస్తాయన్న మంత్రి.. బడ్జెట్ లో భారీ నిధులు కూడా కేటాయిస్తాయన్నారు. ప్రాజెక్టులూ ప్రకటిస్తాయని చెప్పారు. కానీ ఆ ప్రణాళికలకు ప్రాణం పోసేది మాత్రం మీరేనని బిల్డర్లను ఉద్దేశించి చెప్పారు. మీరు వేసే రోడ్లు ప్రజల ప్రయాణాన్ని సులభం చేస్తాయన్నారు. మీరు నిర్మించే వంతెనలు దూరాలను తగ్గిస్తాయనీ కట్టే భవనాలు సేవలకు నిలయాలు అవుతాయన్నారు. అందుకే నిర్మాణ రంగం అంటే తనకు కేవలం కాంట్రాక్ట్ కాదనీ అది రాష్ట్ర నిర్మాణం అని అభివర్ణించారు.

# రూ. 5,456 కోట్లతో టీటీడీ బడ్జెట్

- శ్రీవారి ముదుపు పత్రం పథకం అమలు
- వకుళామాత ఆలయంలో గోవింద అక్షరమాల
- తిరుపతిలో కమాండ్ కంట్రోల్
- మరో అన్న ప్రసాద భవనం.. ఆధునిక వంటశాలలు
- టీటీడీ పాలకమండలి నిర్ణయం

**ముద్ర, ఏపీ :**

తిరుపతిలోని వకుళమాత ఆలయంలో గోవింద అక్షరమాల కార్యక్రమాన్ని ప్రారంభించాలని టీటీడీ పాలకమండలి నిర్ణయించింది. శ్రీవారి ముదుపు పత్రం పథకాన్ని ప్రారంభించనున్నారు. టీటీడీ 2026-27 ఆర్థిక సంవత్సరానికి రూ.5,456.26 కోట్ల బడ్జెట్‌కు ధర్మకర్తల మండలి ఆమోదం తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ బడ్జెట్‌కు ఆమోదముద్ర వేసింది. తిరుమల అన్నమయ్య భవనంలో ఈవో రవిచంద్రతో కలిసి టీటీడీ ఛైర్మన్ శనివారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. బడ్జెట్ కు సంబంధించిన వివరాలను వెల్లడించారు. టీటీడీ విద్యా సంస్థల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థినీ, విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో మెరుగైన విద్యను అందించేందుకు గాను రూ.118.89 కోట్లు కేటాయింపులు చేసినట్లు వెల్లడించారు. డిజిటల్ క్లాస్ రూములు, అదనపు హాస్టల్ బ్లాకులు, వంటగదుల ఆధునీకరణ, ఇతర మౌలిక సదుపాయాలు వంటి సమూలమైన మార్పులను తీసుకొచ్చేందుకు ఆమోదముద్ర వేసినట్లు పేర్కొన్నారు.



శ్రీవారి ముదుపు పత్రం పథకం

భక్తుల విజ్ఞప్తి మేరకు శ్రీవారికి ముదుపులు అందించే దాతల సౌకర్యార్థం “శ్రీవారి ముదుపు పత్రం పథకం” ను ప్రయోగాత్మకంగా ప్రారంభించాలనే నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం భక్తులు మొక్కుల రూపంలో శ్రీవారి హుండీలో కానుకలు వేస్తున్నారు. ఇందుకు బదులుగా భక్తులు తిరుమలలో ఏర్పాటు చేసే కౌంటర్లలో UPI ద్వారా చెల్లింపులు చేస్తే అందుకు తగిన ముదుపు పత్రాలు అందజేస్తారు. వాటిని నేరుగా శ్రీవారి హుండీలో వేయవచ్చు. తద్వారా భక్తులు నగదు, నాణేలు తీసుకువచ్చేందుకు ఉన్న ఇబ్బందులు తొలగుతాయి.

**బడ్జెట్ కు టీటీడీ ఆమోదం - కీలక నిర్ణయాలివే:**

తిరుమలలో భక్తుల సౌకర్యార్థం అదనంగా మరో అన్న ప్రసాద భవనం, ఆధునిక వంటశాలను అత్యాధునిక టెక్నాలజీతో నిర్మించేందుకు రిలయన్స్ సంస్థ రూ.100 కోట్ల నుండి రూ.120 కోట్లు విరాళం అందించేందుకు ముందుకు రావడంతో పనులు ప్రారంభించేందుకు ఆమోదం.

● ఆలయాలు, ప్రాకారాలు, రాజ గోపురాలు తదితర నిర్మాణాలకు అయ్యే ఖర్చును దృష్టిలో ఉంచుకుని తదనుగుణంగా శ్రీవాణి ట్రస్టు మార్గదర్శకాలను మార్పు చేసేందుకు ఆమోదం.

● ఒంటిమిట్టలో 108 అడుగుల జాంబవంతుడి విగ్రహం ఏర్పాటుకుగాను డ్రై ఐల్యాండ్ నిర్మించేందుకు నిర్ణయం. అందుకుగాను రూ.20.17 కోట్లతో పనులకు ఆమోదం.

● కోయంబత్తూర్, గువహటి, బెలగావి, అదేవిధంగా పాట్నా వద్ద మోకామ నగరంలో శ్రీవారి ఆలయాల నిర్మాణాలకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు టీటీడీకి కేటాయించిన భూమిని తీసుకునేందుకు గ్రీన్ సిగ్నల్.

● వకుళమాత ఆలయంలో అక్షర గోవిందం పేరుతో అక్షరాభ్యాస కార్యక్రమం ప్రారంభించాలని నిర్ణయం.

● ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏప్రిల్ 1వ తేదీన జరగనున్న శ్రీ సీతారాముల కల్యాణానికి విచ్చేసే దాదాపు 70 వేల మంది భక్తులకు ఈ ఏడాది అదనంగా రూ.50 విలువ చేసే తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాన్ని ఉచితంగా అందించాలని నిర్ణయించారు. గత ఏడాది తలంబ్రాల ప్యాకెట్ కిట్‌ను అందించిన విషయం తెలిసిందే.

● ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భక్తులను ఆకట్టుకునేలా రూ. 4.25 కోట్లతో విద్యుత్ అలంకరణలు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, ఎల్ఈడి బోర్డులు ఏర్పాటు చేయాలని నిర్ణయం.

● ఆర్మీ వెల్ఫేర్ ప్లేస్ మెంట్ ఆర్గనైజేషన్ ద్వారా తిరుపతిలో 356 మంది, తిరుమలలో 371 మంది భద్రత సిబ్బంది నియామకానికి ఆమోదం

● అలిపిరి తనిఖీ కేంద్రంలో రూ.8 కోట్లతో ఎక్స్ రే బ్యాగేజ్ స్కానర్లు, డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్లు ఏర్పాటుకు ఆమోదం.

● తిరుమల, తిరుపతిలోని టీటీడీ గోశాలలు, పలమనేరులోని శ్రీవేంకటేశ్వర ఇంక్యూబేషన్ సెంటర్ లలో రూ.11.28 కోట్లతో అభివృద్ధి పనులకు ఆమోదం.

● టీటీడీ ఆలయాల్లో పరిచారకులుగా పని చేస్తున్న 51 మందికి అర్చకులుగా పదోన్నతి కల్పించేందుకు గాను ప్రభుత్వానికి నివేదించాలని నిర్ణయం.

● పార్వతీపురం మన్యం జిల్లాలో శ్రీ వేంకటేశ్వర దివ్య క్షేత్రం నిర్మాణానికి రూ.14.25 కోట్లు కేటాయింపు.

● తిరుపతిలోని శ్రీ గోవిందరాజస్వామి ఆలయం చుట్టూ సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ తదితర అభివృద్ధి పనులకు ఆమోదం.

● దేశవ్యాప్తంగా ఉన్న టీటీడీ ఆలయాలు, సత్రాలు, విశ్రాంతి భవనాలు, యాత్రికుల వసతి సముదాయాలు, విద్యా సంస్థలు, ఆసుపత్రులు, కల్యాణ మండపాల భద్రతను పర్యవేక్షించేందుకు తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనంలో రూ.10.75 కోట్లతో కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటుకు ఆమోదం.

# విజ్ఞానం.. ప్రయోగశాలల గోడల మధ్య పరిమితం కావొద్దు

- ఆవిష్కరణలు ప్రాయోగిక ఫలితాలుగా మారాలి
- భవిష్యత్తు భారత్ కు డీప్-టెక్ దిశానిర్దేశం
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**



విజ్ఞానం.. ప్రయోగశాలల గోడల మధ్యే పరిమితం కాకూడదని, పరిశోధన ప్రచురణల వరకే ఆగిపోకూడదని, ఆవిష్కరణలు ప్రాయోగిక ఫలితాలుగా మారాలని రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అభిప్రాయపడ్డారు. 2047 నాటికి.. భారత్ సాంకేతిక స్వావలంబన కలిగిన, పరిశోధన ప్రాధాన్యమున్న, సుస్థిరత ఆధారిత దేశంగా ఎదగాలని ఆకాంక్షించారు. వినియోగంతో కాకుండా సృష్టితోనే శాశ్వత వృద్ధి సాధ్యపడుతుందని ఆయన వ్యాఖ్యానించారు. జాతీయ సైన్స్ డే సందర్భంగా శనివారం హైదరాబాద్ లోని రీసెర్చ్ హైట్స్ ఫౌండేషన్ నిర్వహించిన సస్టైనబుల్ భారత్ 2047 కోసం పరిశోధన, డీప్ టెక్నాలజీల జాతీయ సదస్సులో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన భారత్ ప్రస్తుతం కీలకమైన “డీప్‌టెక్ క్షణం”లో నిలిచిందన్నారు. కృత్రిమ మేధస్సు, సెమీకండక్టర్ వ్యవస్థలు, వాతావరణ సాంకేతికతలు, ఆధునిక తయారీ, భౌగోళిక మేధస్సు వంటి రంగాల్లో జరుగుతున్న పురోగతులు రాబోయే దశాబ్దాల్లో దేశ పోటీతత్వాన్ని నిర్ణయిస్తాయని చెప్పారు. డీప్ టెక్నాలజీలు ఐచ్ఛికం కాదన్న మంత్రి.. అవి జాతీయ పురోగతికి అత్యవసరమన్నారు. నేడు ఈ రోజు పరిశోధనలో పెట్టుబడి పెట్టే దేశాలే భవిష్యత్తులో నాయకత్వం వహిస్తాయని చెప్పారు. పరిశ్రమలు వాస్తవ సమస్యలను గుర్తించాలన్న మంత్రి.. అకాడెమియా మిషన్ మోడ్‌లో స్పందించాలన్నారు. దీనికి ప్రభుత్వం అనుకూల విధానాలను అమలు చేయాలి అని సూచించారు. ఈ మూడు వర్గాల సమన్వయం వ్యవస్థీకృతంగా మారినప్పుడే ఆవిష్కరణ రూపాంతరం చెందుతుందని వెల్లడించారు. డిజిటల్ మౌలిక సదుపాయాలు, ఏఐ ఆధారిత నిర్ణయ వ్యవస్థలు, ప్రిడిక్టివ్ అనలిటిక్స్ ద్వారా ప్రజాసేవలను మెరుగుపరచాల్సిన అవసరం ఉందని చెప్పారు. సస్టైనబుల్ భారత్‌కు సమర్థవంతమైన, వాతావరణ స్పందన కలిగిన, డిజిటల్‌గా అనుసంధానమైన మౌలిక వసతులు అవసరమని పేర్కొన్నారు. దేశ ఆవిష్కరణ రంగంలో తెలంగాణ ముందంజలో ఉందన్న మంత్రి.. రక్షణ పరిశోధన, బయోటెక్నాలజీ, ఔషధ తయారీ, ఏరోస్పేస్ రంగాల్లో హైదరాబాద్ కీలక కేంద్రంగా ఎదిగిందని అన్నారు. పరిశోధనను వ్యాపారంగా మార్చే విధానాలు, స్టార్టప్‌లకు మద్దతు, ఉపాధి సృష్టి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని వెల్లడించారు. విశ్వవిద్యాలయాలు డిగ్రీల కర్మాగారాలుగా కాకుండా మేధో సంపత్తి, స్టార్టప్ ఇంక్యుబేషన్, సాంకేతిక వాణిజ్యీకరణకు కేంద్రాలుగా మారాలని పిలుపునిచ్చారు. ప్రపంచంలోనే అత్యంత యువ జనాభా మన దేశంలో ఉందన్నారు. పరిశోధన సామర్థ్యం, విమర్శనాత్మక ఆలోచన, ప్రయోగ సంస్కృతి పెంపొందితేనే అది జాతీయ శక్తిగా మారుతుందని వివరించారు. అందుకు డిగ్రీ సంస్కృతి నుంచి డిస్కవరీ సంస్కృతికి మారాలన్నారు. పరీక్షల కేంద్రిత దృష్టి నుంచి ప్రయోగాల కేంద్రిత దృష్టికి అడుగులు వేయాలని చెప్పారు. సేవల ఆధారిత ఆర్థిక వ్యవస్థ నుంచి ఆవిష్కరణ ఆధారిత వ్యవస్థగా మారాలన్నారు.

# బాలికల ఆరోగ్య సంరక్షణతో రాష్ట్ర భవిష్యత్తు పదిలం

- బాలికలు హెచ్ పి వి టీకాను తప్పక వినియోగించుకోవాలి.
- కింగ్ కోఠి జిల్లా ఆసుపత్రిలో రాష్ట్రవ్యాప్తంగా హెచ్‌పీవీ టీకాకరణ కార్యక్రమం ప్రారంభం
- 90 రోజుల ప్రచారంలో భాగంగా 4 లక్షల బాలికలకు ఉచిత సింగిల్ డోస్ టీకా లక్ష్యం
- రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

రాష్ట్రంలో బాలికల ఆరోగ్యాన్ని కాపాడడం ద్వారా రాష్ట్ర భవిష్యత్తును సురక్షితం చేయవచ్చని రాష్ట్ర వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర నరసింహ అభిప్రాయపడ్డారు. శనివారం హైదరాబాద్‌లోని కింగ్ కోఠి జిల్లా ఆస్పత్రిలో రాష్ట్రవ్యాప్తంగా హెచ్‌పీవీ (హ్యూమన్ పాపిలోమా వైరస్) టీకాకరణ కార్యక్రమాన్ని రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్ తో పాటు కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోడీ రాజస్థాన్ లోని అజ్మీర్ నుంచి వర్చువల్‌గా దేశవ్యాప్తంగా ప్రారంభించగా తెలంగాణకూ అనుసంధానంగా నిర్వహించబడింది. ఇందులో భాగంగా కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి దామోదర జాతీయ కార్యక్రమంలో వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 14 నుండి 15 సంవత్సరాల మధ్య వయస్సు గల సుమారు 4 లక్షల బాలికలకు 90 రోజుల వ్యవధిలో టీకాలు అందించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని మంత్రి వివరించారు. ఈ కార్యక్రమం రాష్ట్ర ఆరోగ్య రంగంలో ఒక చారిత్రాత్మక ఘట్టమని, ఆడబిడ్డల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఒక ముఖ్యమైన ముందడుగు అని తెలిపారు. జీవనశైలి మార్పులు, ఆహారపు అలవాట్లు మరియు కాలుష్యం వంటి కారణాలతో క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయని, తెలంగాణలో ప్రతి సంవత్సరం సుమారు 55 వేల నుండి 60 వేల క్యాన్సర్ కేసులు నమోదవుతున్నాయని, వచ్చే ఐదేళ్లలో ఈ సంఖ్య 10 శాతం పెరిగే అవకాశం ఉందని తెలిపారు. ఈ సవాలును ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర క్యాన్సర్ పాలసీని రూపొందించిందని తెలిపారు. ములుగు, ఆదిలాబాద్ వంటి దూర ప్రాంతాల్లో కూడా కీమోథెరపీ సేవలను విస్తరించడంతో పాటు ప్రతి జిల్లాలో డే కేర్ క్యాన్సర్ సెంటర్లను ఏర్పాటు చేశామని, మొబైల్ స్క్రీనింగ్ యూనిట్ల ద్వారా వ్యాధిని ముందుగానే గుర్తించే చర్యలు తీసుకుంటున్నామని, ఆరోగ్య మహిళ క్లినిక్‌ల ద్వారా విస్తృత పరీక్షలు నిర్వహిస్తున్నామని వివరించారు. క్యాన్సర్‌ను నోటిఫైబుల్ డిసీజ్‌గా ప్రకటించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మహిళల్లో వచ్చే క్యాన్సర్లలో సర్వైకల్ క్యాన్సర్ రెండవ స్థానంలో ఉందని, తెలంగాణలో ప్రతి సంవత్సరం సుమారు 32 వేల కేసులు నమోదవుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. ఈ క్యాన్సర్ 99.7 శాతం హ్యూమన్ పాపిలోమా వైరస్ వల్ల వస్తుందని, సమయానికి టీకా తీసుకోవడం ద్వారా దీన్ని నివారించవచ్చని తెలిపారు. ఈ ప్రమాదాన్ని తగ్గించడానికి హెచ్‌పీవీ టీకాకరణ కార్యక్రమాన్ని ప్రారంభించామని చెప్పారు. హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్ పీ వీ) అనేది ఒక సాధారణ వైరస్, ఇది ప్రధానంగా సర్వైకల్ క్యాన్సర్‌కు కారణమవుతుందని చెప్పారు. ఈ వైరస్ శరీరంలోకి ప్రవేశించిన తర్వాత దీర్ఘకాలంలో గర్భాశయ ముఖద్వారం కణాల్లో మార్పులు కలిగించి క్యాన్సర్‌కు దారితీస్తుందన్నారు. ప్రారంభ దశలో లక్షణాలు కనిపించకపోవడంతో ఇది నిశ్శబ్దంగా వ్యాపించే ప్రమాదం ఉందన్నారు. అందుకే ప్రభుత్వం ముందస్తు నివారణ చర్యలపై దృష్టి సారిస్తూ టీకాకరణ, స్క్రీనింగ్, మొబైల్ డయాగ్నస్టిక్ సేవలు, ఆరోగ్య మహిళ క్లినిక్‌ల ద్వారా సేవలను బలోపేతం చేసున్నట్లు మంత్రి వివరించారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో రూ. 3వేల నుండి రూ. 4 వేల వరకు ఖర్చయ్యే హెచ్ పి వి టీకాను ప్రభుత్వం పూర్తిగా ఉచితంగా అందిస్తోందని మంత్రి తెలిపారు. తొలి దశలో ప్రభుత్వ జనరల్, ఏరియా ఆస్పత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో టీకా అందుబాటులో ఉంటుందన్న ఆయన తర్వాత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కూడా అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు దేవ హర్షిణి, గాయత్రి దేవి, కావ్యశ్రీ, శ్రీలక్ష్మి, హారికలకు హెచ్‌పీవీ టీకాలు ఇవ్వగా, వారికి టీకాకరణ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు, కమిషనర్ డా. సంగీత సత్యనారాయణ, డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్ నరేందర్, డైరెక్టర్ తెలంగాణ వైద్య విధాన పరిషత్ అజయ్, హైదరాబాద్ డీఎంహెచ్‌వో డా. వెంకటి, పర్యవేక్షకులు సంతోష్ కుమార్, వివిధ విభాగాల వైద్యులు పాల్గొన్నారు.






సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
ఆదివారం 01.03.2026
www.mudranews.in | @mudranews



### టాప్ 10 పండ్ల రసాలు

9. ముసంబి జ్యూస్
ముసంబి జ్యూస్ (Sweet Lime Juice)శరీరానికి చల్లదనాన్ని ఇస్తుంది. జీర్ణక్రియను మెరుగుపరచి అలసటను తగ్గిస్తుంది.






## ఫర్హాన్ సెంచరీ..
## లంకపై పాక్ విజృంభన

20 ఓవర్లలో
పాకిస్థాన్ 213 పరుగులు

ముద్ర డెస్క్ :

కొలంబో వేదికగా జరుగుతున్న సూపర్-8 మ్యాచ్‌లో శ్రీలంకకు పాకిస్థాన్ 213 పరుగులను లక్ష్యంగా నిర్దేశించింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన పాక్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 212 పరుగులు చేసింది. ఓపెనర్ సహిబ్జాద ఫర్హాన్ (100: 60 బంతుల్లో 9 ఫోర్లు, 5 సిక్స్‌లు) సెంచరీ సాధించాడు. ఈ టీ20 ప్రపంచ కప్‌లో అతడికిది రెండో సెంచరీ కావడం గమనార్హం. మరో ఓపెనర్ ఫకర్ జమాన్ (84) దూకుడుగా ఆడాడు. వీరిద్దరూ కలిసి తొలి వికెట్‌కు 176 పరుగులు జోడించారు. అక్కడ్నుంచి శ్రీలంక బౌలర్ల దెబ్బకు పాక్ బ్యాటింగ్ లైనప్ కుదేలైంది. వరుసగా వికెట్లను చేజార్చుకుంది. కేవలం 36 పరుగుల వ్యవధిలో ఎనిమిది వికెట్లను పాక్ నష్టపోయింది. మధుషంక 3, దాసున్ శనక 2, చమీర ఒక వికెట్ తీశారు. శ్రీలంకను 147 అంతకంటే తక్కువ పరుగులకు కట్టడి చేసి విజయం సాధిస్తేనే పాకిస్థాన్ సెమీస్‌కు వెళ్తుంది. అలా కాకుండా.. తక్కువ రన్స్‌తో గెలిచినా ఇంటిముఖం పట్టాల్సిందే. న్యూజిలాండ్ మెరుగైన నెట్‌రన్‌రేట్‌తో సెమీఫైనల్‌కు చేరుకుంటుంది. శ్రీలంక చేతిలో పాక్ ఓడినా నిష్క్రమించడం తప్పదు.




## శ్రీలంక ఓడిపోతే కోట్ల లాభం..
### గెలిస్తే పాక్ ప్రయాణానికి ముగింపు?

టీ20 ప్రపంచకప్ సూపర్–8 దశలో ఆసక్తికర పరిస్థితి నెలకొంది. శ్రీలంక క్రికెట్ జట్టు ఈరోజు మ్యాచ్‌లో గెలిస్తే మిత్రదేశం పాకిస్తాన్ క్రికెట్ జట్టు టోర్నమెంట్ నుంచి నిష్క్రమించే అవకాశం ఉంది. అదే సమయంలో ఓడిపోతే శ్రీలంకకు ఆర్థికంగా లాభం చేకూరే పరిస్థితి కనిపిస్తోంది. పాకిస్తాన్ సెమీఫైనల్‌కు అర్హత సాధిస్తే, ఒక సెమీఫైనల్‌తో పాటు ఫైనల్ మ్యాచ్‌ను కూడా శ్రీలంకలో నిర్వహించే అవకాశాలపై చర్చ జరుగుతోంది. అలా జరిగితే హోటళ్లు, పర్యాటకం, టికెట్ అమ్మకాల ద్వారా కోట్ల రూపాయల విదేశీ మారకద్రవ్యం దేశానికి వచ్చే అవకాశముంది. ఇక పాకిస్తాన్ పరిస్థితి క్లిష్టంగా మారింది. సెమీస్ చేరాలంటే భారీ తేడాతో గెలవడమే కాకుండా నెట్ రన్‌రేట్ లెక్కలు కూడా తమకు అనుకూలంగా మారాలి. ఈ నేపథ్యంలో శ్రీలంక మ్యాచ్ ఫలితం రెండు దేశాల భవిష్యత్తుపై ప్రభావం చూపనుంది. కాబట్టి ఈ పోరు కేవలం గెలుపోటములకే పరిమితం కాకుండా ఆర్థిక, క్రీడా ప్రయోజనాల సమీకరణంగా మారింది.

## బాబర్ ఆజం టీ20 కెరీర్ ముగిసినట్లేనా?




ముద్ర డెస్క్ :

టీ20 ప్రపంచకప్–2026 సూపర్–8 దశలో పాకిస్తాన్‌కు కీలక సమరం ఎదురైంది. శ్రీలంక క్రికెట్ జట్టుతో గెలవాల్సిన మ్యాచ్‌కు ముందు పాక్ జట్టు సంచలన నిర్ణయం తీసుకుంది. స్టార్ బ్యాటర్ బాబర్ ఆజమ్ను ప్లేయింగ్ ఎలెవెన్ నుంచి తప్పించడం చర్చనీయాంశమైంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న కెప్టెన్ సల్మాన్ అలీ ఆఘా జట్టులో మూడు మార్పులు చేసినట్లు వెల్లడించాడు. బాబర్‌తో పాటు సైమ్ అయూబ్, సల్మాన్ మీర్జా స్థానాల్లో ఖవాజా నఫే, నసీమ్ షా, అబ్రార్ అహ్మద్‌లను జట్టులోకి తీసుకున్నారు. సెమీస్ చేరాలంటే పాకిస్తాన్ 65 పరుగుల భారీ తేడాతో గెలవాల్సిన పరిస్థితి ఉంది. ఇలాంటి వేళ బాబర్‌ను పక్కన పెట్టడం అతని టీ20 అంతర్జాతీయ భవిష్యత్తుపై సందేహాలు రేకెత్తిస్తోంది. ఈ నిర్ణయం పాక్ క్రికెట్‌లో పెద్ద మార్పులకు సంకేతమా అన్నది మ్యాచ్ ఫలితం తర్వాత స్పష్టమవుతుంది

## టీ20 వరల్డ్‌కప్ తర్వాత పాక్ కెప్టెన్ ఔట్ ?




టీ20 ప్రపంచకప్–2026 ముగి సిన వెంటనే పాకిస్తాన్ జట్టులో భారీ మార్పులు చోటుచేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా కెప్టెన్ సల్మాన్ ఆఘాపై వేటు పడొచ్చన్న చర్చలు జోరుగా సాగుతున్నా యి. ఫలితాలతో సంబంధం లేకుం డా నాయకత్వంలో మార్పు చేయాలని పాకిస్తాన్ క్రికెట్ బోర్డు ( ఆలోచిస్తున్నట్లు సమాచారం.

**చైర్మన్ అసంతృప్తి:** పీసీబీ చైర్మన్ మొహ్సిన్ నక్వీ జట్టు ప్రదర్శనపై అసంతృప్తిగా ఉన్నారని బోర్డు వర్గాలు స్థానిక మీడియాకు తెలిపాయి. టోర్నీలో మెరుగైన ఫలితాలు వస్తాయని సెలెక్టర్లు హామీ ఇచ్చినా, అంచనాలకు తగ్గ ఆటతీరు కనిపించలేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**సీనియర్ల భవిష్యత్తు అనిశ్చితం:** కెప్టెన్ సల్మాన్ ఆఘాతో పాటు బాబర్ ఆజం, ఉస్మాన్ ఖాన్ వంటి సీనియర్ ఆటగాళ్ల భవిష్యత్తు కూడా ప్రశ్నార్థకంగా మారింది. ఈ టోర్నీ వీరికి చివరిదై ఉండొచ్చని, టీ20 ఫార్మాట్‌లో వారి అంతర్జాతీయ కెరీర్ ముగిసే అవకాశం ఉందని వార్తలు వినిపిస్తున్నాయి. ప్రపంచకప్ అనంతరం జట్టులో విస్తృత స్థాయిలో మార్పులు జరిగే అవకాశముంది.

**సెమీస్ ఆశలు సవాల్‌లో:** భారత్, శ్రీలంకలు సంయుక్తంగా ఆతిథ్యం ఇస్తున్న ఈ టోర్నీలో పాకిస్తాన్ తటస్థ వేదికగా శ్రీలంకలో మ్యాచ్‌లు ఆడుతోంది. గ్రూప్ దశలో భారత్ చేతిలో ఓడినా, మిగతా మ్యాచ్‌లు గెలిచి సూపర్–8కు చేరుకుంది. అయితే కీలక దశలో న్యూజిలాండ్‌తో మ్యాచ్ వర్షం కారణంగా రద్దుకాగా, ఇంగ్లండ్ చేతిలో ఓటమి పాలైంది. ఇప్పుడు శ్రీలంకపై భారీ తేడాతో గెలిస్తేనే సెమీస్ అవకాశాలు సజీవంగా ఉంటాయి. టోర్నీ మొత్తం పాకిస్తాన్ సీనియర్ ఆటగాళ్లు స్థిరమైన ప్రదర్శన చేయలేకపోవడం బోర్డును ఆలోచనలో పడేసింది. ఫలితంగా టీ20 ప్రపంచకప్ తర్వాత పాక్ జట్టులో మార్పుల గాలి బలంగా వీచే అవకాశముందని క్రీడా వర్గాలు అంచనా వేస్తున్నాయి.




## రంజీ చరిత్రలో జమ్మూ–కాశ్మీర్
# సువర్ణ అధ్యాయం



భారత దేశవాళీ క్రికెట్ చరిత్రలో అరుదైన ఘట్టం నమోదైంది. జమ్మూ అండ్ కాశ్మీర్ క్రికెట్ జట్టు తమ 67 ఏళ్ల నిరీక్షణకు తెరదిస్తూ తొలి రంజీ ట్రోఫీ 2025–26 టైటిల్‌ను కైవసం చేసుకుంది. హుబ్లీ వేదికగా జరిగిన ఫైనల్లో కర్ణాటక క్రికెట్ జట్టును ఓడించి చాంపియన్‌గా అవతరించింది. ఈ చారిత్రక విజయానికి పేసర్ ఆకిబ్ నబీ ధార్ ప్రధాన కారకుడిగా నిలిచాడు. ఈ సీజన్ అంతా అద్భుత ఫామ్‌లో ఉన్న నబీ మొత్తం 60 వికెట్లు పడగొట్టి టోర్నీలో అగ్రస్థానంలో నిలిచాడు. రంజీ చరిత్రలో ఓ పేసర్ 60 వికెట్ల మైలురాయిని అందుకోవడం అరుదైన ఘనత. ఫైనల్లో కూడా 29 ఏళ్ల ఈ స్వింగ్ బౌలర్ ప్రత్యర్థి బ్యాటర్లను ఇబ్బంది పెట్టాడు. ఐదు కీలక వికెట్లు తీసి కర్ణాటక ఓటమిని ఖాయం చేశాడు. కేఎల్ రాహుల్, మయాంక్ అగర్వాల్, కరుణ్ నాయర్ వంటి స్టార్ ఆటగాళ్లను ఔట్ చేయడం మ్యాచ్ టర్నింగ్ పాయింట్‌గా మారింది.

**నబీపై సౌరవ్ ప్రశంసలు**

నబీ ప్రదర్శన టీమిండియా మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీను కూడా ఆకట్టుకుంది. ఇంగ్లండ్ పిచ్‌లపై అతని స్వింగ్ బౌలింగ్ భారత్‌కు ఉపయోగపడుతుందని పేర్కొంటూ రాబోయే వైట్‌బాల్ సిరీస్‌కు ఎంపిక చేయాలని సూచించాడు. కఠిన పరిస్థితులే ఛాంపియన్‌లను తయారు చేస్తాయని, జమ్మూ–కాశ్మీర్ జట్టు సాధించిన విజయం దేశానికి గర్వకారణమని అభినందించాడు. బారాముల్లాకు చెందిన ఆకిబ్ నబీకి ఐపీఎల్‌లోనూ మంచి డిమాండ్ ఏర్పడింది. గత వేలంలో ఢిల్లీ క్యాపిటల్స్ అతన్ని రూ. 8.4 కోట్లకు సొంతం చేసుకుంది. దేశవాళీ క్రికెట్‌లో మెరిసిన ఈ యువ పేసర్ ఇప్పుడు అంతర్జాతీయ వేదికపై కూడా తన ముద్ర వేసేందుకు సిద్ధమవుతున్నాడు.

## రంజీ చాంపియన్‌కు రూ.2 కోట్ల నజరానా

**జమ్మూ కశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా ప్రకటన**

దేశవాళీ క్రికెట్‌లో చరిత్ర సృష్టించిన జమ్మూ అండ్ కాశ్మీర్ క్రికెట్ జట్టుకు రాష్ట్ర ప్రభుత్వం భారీ నజరానా ప్రకటించింది. తొలి సారి రంజీ ట్రోఫీ 2025–26 కిరీటం అందుకున్న జట్టుకు రూ.2 కోట్ల నగదు బహుమతిని ప్రకటించారు. ఈ మేరకు జమ్మూ కశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా అధికారికంగా వెల్లడించారు. జట్టు సాధించిన ఘనత రాష్ట్రానికి గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. అంతేకాకుండా అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన ఆటగాళ్లకు ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలు కల్పించే విషయాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. 67 ఏళ్ల నిరీక్షణకు తెరదించి టైటిల్ సాధించిన జమ్మూ కశ్మీర్ జట్టుపై రాష్ట్రవ్యాప్తంగా ప్రశంసల వర్షం కురుస్తోంది. ప్రభుత్వ ప్రోత్సాహం యువ క్రికెటర్లకు మరింత ఉత్సాహాన్ని కలిగించనుంది.

# 12 ఏళ్లకు కోహ్లీ రికార్డు బ్రేక్

ముద్ర డెస్క్ :

టీ20 ప్రపంచకప్–2026లో శనివారం జరిగిన పాకిస్తాన్–శ్రీలంక మ్యాచ్‌లో అరుదైన ఘట్టం నమోదైంది. సాహిబ్జాదా ఫర్హాన్ అద్భుత ఫామ్‌తో దూసుకెళ్తూ ఒకే ఎడిషన్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాట్స్‌మన్‌గా నిలిచాడు. ఈ క్రమంలో ఆయన విరాట్ కోహ్లీ పేరిట ఉన్న 12 ఏళ్ల రికార్డును అధిగమించాడు.

**319 పరుగుల మైలురాయికి ముగింపు**

2014 టీ20 ప్రపంచకప్‌లో కోహ్లీ ఆరు మ్యాచ్‌ల్లో 319 పరుగులు చేసి అరుదైన రికార్డు సృష్టించాడు. ఈసారి శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో 37 పరుగుల వ్యక్తిగత స్కోరు చేరుకున్న వెంటనే ఫర్హాన్ ఆ మైలురాయిని దాటాడు. ఏడవ ఇన్నింగ్స్‌లోనే ఈ ఘనత సాధించడం విశేషం. దీంతో ఒకే టోర్నీలో అత్యధిక పరుగుల రికార్డు ఇప్పుడు ఫర్హాన్ పేరిట నమోదైంది.

**పాకిస్తాన్ తరఫున కొత్త మైలురాయి**

ఫర్హాన్ కేవలం కోహ్లీ రికార్డునే కాకుండా, పాకిస్తాన్ ఆటగాళ్లలోనూ అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. 2021 ప్రపంచకప్‌లో బాబర్ ఆజమ్ చేసిన 303 పరుగుల రికార్డును కూడా అధిగమించాడు. దీంతో ఒకే టీ20 ప్రపంచకప్ సీజన్‌లో పాకిస్తాన్ తరఫున అత్యధిక పరుగులు చేసిన బ్యాట్స్‌మన్‌గా చరిత్రలో నిలిచాడు.

**గోల్డెన్ టోర్నమెంట్**

ఈ టోర్నీలో పాకిస్తాన్ జట్టు మొత్తం స్థిరంగా రాణించకపోయినా, ఫర్హాన్ మాత్రం అద్భుతమైన స్థిరత్వం కనబరిచాడు. నమీబియాపై సెంచరీ సాధించడంతో పాటు, ఇంగ్లండ్, అమెరికాపై కీలక అర్ధశతకాలు నమోదు చేసి జట్టును క్లిష్ట పరిస్థితుల నుంచి బయటకు తీశాడు. దూకుడు బ్యాటింగ్‌తో పాటు దీర్ఘ ఇన్నింగ్స్‌లతో 29 ఏళ్ల ఈ ఓపెనర్ అంతర్జాతీయ వేదికపై తన ముద్ర వేసుకున్నాడు. ఒకే ఎడిషన్‌లో అత్యధిక పరుగుల జాబితాలో ఇప్పుడు ఫర్హాన్ అగ్రస్థానంలో ఉండగా, ఆయన ప్రదర్శన ఈ ప్రపంచకప్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
ఆదివారం 01.03.2026
www.mudranews.in | @mudranews



**టాప్ 10 పండ్ల రసాలు**

10. కివి జ్యూస్
కివి జ్యూస్ (Kiwi Juice)విటమిన్ C, K సమృద్ధిగా ఉండి ఇమ్యూనిటీని పెంచుతుంది. చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది.



## ‘శ్రీనివాస మంగాపురం’లో ‘వెంకటప్పయ్య నాయుడు’




### కీలక పాత్రలో మోహన్‌బాబు

ఘట్టమనేని జయకృష్ణ ప్రధాన పాత్రలో రూపొందుతున్న ‘శ్రీనివాస మంగాపురం’ చిత్రానికి దర్శకుడు అజయ్ భూపతి. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ముఖ్యమైన అప్డేట్ తాజాగా బయటకొచ్చింది. సీనియర్ నటుడు మోహన్ బాబు ఈ సినిమాలో భాగమవుతున్నారనే ప్రచారం కొంతకాలంగా సాగుతుండగా, ఇప్పుడు చిత్రబృందం ఆయన లుక్‌ను విడుదల చేసి ఆ వార్తలకు అధికారిక ముద్ర వేసింది. ఈ చిత్రంలో ‘వెంకటప్పయ్య నాయుడు’ అనే ప్రభావవంతమైన పాత్రలో కనిపించనున్నారు. కథలో మలుపు తిప్పే స్థాయిలో ఈ పాత్రకు ప్రాధాన్యం ఉంటుందని సమాచారం. ప్రేమకథా నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో జయకృష్ణకు జోడీగా రషా థడానీ నటిస్తోంది. వాస్తవికతను ప్రధానంగా తీసుకుని, భావోద్వేగాలను హైలైట్ చేస్తూ హృదయాలకు హత్తుకునే కథను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలనే లక్ష్యంతో దర్శకుడు పని చేస్తున్నట్లు తెలిసింది.

**‘ది ప్యారడైజ్’లో ప్రతినాయకుడిగా మోహన్‌బాబు**

ఇక మరోవైపు నాని హీరోగా రూపొందుతున్న ‘ది ప్యారడైజ్’లో కూడా మోహన్ బాబు కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ చిత్రంలో ఆయన ‘శికంజ మాలిక్’ అనే శక్తివంతమైన విలన్‌గా కనిపించనున్నారు. ఈ సినిమాకు శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం వహిస్తున్నారు. భారీ నిర్మాణ వ్యయంతో రూపొందుతున్న ఈ చిత్రం తెలుగు సహా తమిళం, కన్నడ, మలయాళం, బెంగాలీతో పాటు మొత్తం ఎనిమిది భాషల్లో విడుదల చేయాలని చిత్రబృందం యోచిస్తోంది. ఒకే సమయంలో ప్రేమకథలో భావోద్వేగభరిత పాత్ర, యాక్షన్ డ్రామాలో ప్రతినాయక ఛాయలు, ఇలా భిన్నమైన రెండు పాత్రలతో మోహన్‌బాబు తన నటనా వైవిధ్యాన్ని మరోసారి చాటుకోబోతున్నారని సినీ వర్గాలు చెబుతున్నాయి.



## ‘స్పిరిట్’ పోస్టర్‌లో కనిపించిన
# ఆ మిస్టరీ గర్ల్ ఎవరు?

తాజాగా విడుదలైన ‘స్పిరిట్’ చిత్ర పోస్టర్ సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చకు దారితీసింది. పోస్టర్‌లో శక్తివంతమైన లుక్‌లో కనిపించిన వివేక్ ఓబెరాయ్ అభిమానులను ఆకట్టుకోగా, ఆయన పక్కన కనిపించిన ఓ యువతి అందరి దృష్టిని తనవైపు తిప్పుకుంది. ఆ మిస్టరీ గర్ల్ ఎవరు? అనే ప్రశ్న నెటిజన్లలో ఆసక్తి రేపింది. తాజాగా ఆమె వివరాలు వెలుగులోకి వచ్చాయి. ఆ యువతి పేరు ఐశ్వర్య దేశాయ్. ఇండియన్–అమెరికన్ నేపథ్యంతో వచ్చిన ఈ మోడల్, నటి తన కెరీర్‌ను క్రమంగా నిర్మించుకుంటోంది. మోడలింగ్ రంగంలో అడుగుపెట్టి, అక్కడ గుర్తింపు సాధించిన తర్వాత సినిమాల వైపు మళ్లింది. తన స్క్రీన్ ప్రెజెన్స్, నేచురల్ లుక్స్‌తో ఇప్పటికే పలువురి దృష్టిని ఆకర్షించింది.

**మోడలింగ్ నుంచి సినిమాల దాకా**

ఐశ్వర్య దేశాయ్ బాలీవుడ్ చిత్రం గల్లీ బాయ్లో చిన్న పాత్రలో కనిపించింది. అలాగే ‘రాట్ ఇన్ ది కిచెన్’ అనే షార్ట్ ఫిల్మ్‌లో నటించి ప్రత్యేక గుర్తింపు పొందింది. ఆ ప్రాజెక్ట్ ద్వారా ఆమె నటనకు మంచి స్పందన లభించింది.

ఇప్పుడు ‘స్పిరిట్’ పోస్టర్‌లో కనిపించడం ద్వారా ఆమెపై మరింత ఆసక్తి పెరిగింది. ఈ చిత్రంలో ఆమె పాత్ర ఎంత ప్రాధాన్యం కలిగి ఉందో అన్నది ఇంకా స్పష్టత రాలేదు. అయితే మొదటి లుక్‌తోనే ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించడం మాత్రం ఖాయం. మిస్టరీగా మొదలైన ఈ ఆసక్తి, ఇప్పుడు ఐశ్వర్య దేశాయ్ పేరును సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మార్చింది. ‘స్పిరిట్’ విడుదలకు ముందే ఆమెకు ఈ పోస్టర్ మంచి ప్రచారాన్ని తీసుకొచ్చిందని చెప్పాలి.



## ‘ది కేరళ స్టోరీ 2’
### నేటి యువతకు హెచ్చరికేనా?



విడుదలకు ముందే వివాదాలతో వార్తల్లో నిలిచిన ‘ది కేరళ స్టోరీ 2: తదుపరి కథ’ చివరకు ప్రేక్షకుల ముందుకొచ్చింది. విడుదలకు ఒక రోజు ముందు కేరళ హైకోర్టు స్టే విధించగా, మరుసటి రోజే డివిజన్ బెంచ్ అనుమతి ఇవ్వడంతో దేశవ్యాప్తంగా ప్రదర్శనలు ప్రారంభమయ్యాయి. మొదటి భాగం మాదిరిగానే ఈ చిత్రమూ సున్నితమైన అంశాన్ని ఎంచుకోవడం తో మళ్లీ చర్చకు దారితీసింది. ఈ కథ ముగ్గురు స్వతంత్ర భావాలు కలిగిన యువతుల జీవితాల చుట్టూ తిరుగుతుంది. యూపీఎస్సీకి సిద్ధమవు తున్న సురేఖ, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ కావాలనుకునే దివ్య, రాష్ట్ర స్థాయి జావెలిన్ క్రీడాకారిణి నేహా. ఇలా వారి జీవితాల్లోకి ప్రేమ పేరుతో ప్రవేశించిన యువకులు మాయమా టల తో వారిని తప్పుదారి పట్టిస్తారు. ప్రేమ, భరోసా, స్వేచ్ఛ అనే మాటలతో దగ్గరైన వారు తర్వాత అసలు ఉద్దేశ్యాన్ని బయటపెడతారు. నిజం తెలుసుకున్న తర్వాత ఆ యువతులు ఎదుర్కొనే మానసిక, శారీరక వేధింపులు కథలో కీలకంగా నిలుస్తాయి. దర్శకుడు కామాఖ్య నారాయణ్ సింగ్ కొన్ని వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందించినట్లు తెలిపారు. ప్రథమా ర్ధంలో యువత తీసుకునే తొందరపాటు నిర్ణయా ల ప్రభావాన్ని చూపించగా, ద్వితీయార్ధంలో సంఘటనలు తీవ్ర రూపం దాల్చుతాయి. ముఖ్యంగా హింసాత్మక సన్నివేశాలు, భావోద్వేగపూ రిత మలుపులు ప్రేక్షకుడిని కదిలిస్తాయి. అయితే కొన్నిచోట్ల సినిమాటిక్ స్వేచ్ఛ ఎక్కువగా ఉపయోగించారనే భావన కలుగుతుంది. కథను ఒకే కోణంలో చూపించడం వల్ల వాదోపవా దాలకు తావుంది. నటీనటుల విషయానికి వస్తే బాధితుల పాత్రల్లో నటించిన కళాకారులు భావో ద్వేగాన్ని సమర్థంగా వ్యక్త పరిచారు. ప్రతినాయ కుల పాత్రలు కర్కశంగా కనిపించడం వల్ల సన్నివేశాలకు బలం చేకూరింది. రచనలో విపుల్ అమృత్ లాల్ షా, అమర్‌నాథ్ తమదైన శైలిని చూపించారు. క్లైమాక్స్ భాగం కొంత అతిశయంగా అనిపించినా, దర్శకుడు చెప్పదలిచిన సందే శం స్పష్టంగా చేరుతుంది.

మొత్తానికి, ‘ది కేరళ స్టోరీ 2’ నేటి జెన్–జీ యువత తొందరపాటు నిర్ణయాలపై హెచ్చరికలా నిలుస్తుంది. ప్రేమ పేరుతో జరిగే మోసాలపై జాగ్రత్త అవసరమని గుర్తుచేసే ప్రయత్నంగా ఈ చిత్రాన్ని చూడవచ్చు.

# మెప్పు కోసం అప్పులు వద్దు
### యువతకు మంచు మనోజ్ సందేశం

అభిమానులతో ఎప్పుడూ ఉత్సాహంగా కలిసి పోతూ ఉండే మంచు మనోజ్ తాజాగా ఓ కళా శాల కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు ఆచరణాత్మక సందేశం ఇచ్చారు. ఇతరుల మెప్పు కోసం అప్పులు చేసి విలాసాలకు వెళ్లడం తప్పని, నిజమైన గౌరవం మన కృషి వల్లే వస్తుందని ఆయన పేర్కొన్నారు. తన మాటను నిరూపించేందుకు ఓ సరదా ఉదాహరణ కూడా చూపించారు. పాత ఐఫోన్‌కే కొత్త మోడల్ ‘ఐఫోన్ 17 ప్రో మ్యాక్స్’ కవర్ వేసుకుని వాడుతున్నానని చెప్పి ఫోన్‌ను విద్యార్థులకు చూపించారు. బయటికి కనిపించేదే అన్నీ కాదని, ఉన్నదానితో సంతృప్తిగా ఉండడం నేర్చుకోవాలని సూచించారు. అనవసర ఖర్చులు, అప్పులు యువత భవిష్యత్తుపై ప్రభావం చూపుతాయని హెచ్చరించారు.ప్రస్తుతం మంచు మనోజ్ ‘డేవిడ్ రెడ్డి’ చిత్రంతో బిజీగా ఉన్నారు. స్వాతంత్ర్యానికి పూర్వం బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడి కథ ఆధారంగా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి హనుమరెడ్డి యక్కంటి దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో మనోజ్ సరసన ‘ప్రిన్స్’ చిత్రంతో గుర్తింపు పొందిన నటి మరియా నటిస్తున్నారు



## ‘రణబాలి’తో మళ్లీ ట్రెండ్‌లో విజయ్–రష్మిక

వెడ్డింగ్ లుక్స్‌తో ఇటీవల సోషల్ మీడియాను షేక్ చేసిన విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న ఇప్పుడు ‘రణబాలి’ అప్డేట్‌తో మరోసారి హాట్ టాపిక్ అయ్యారు. రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో వీరిద్దరూ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. తాజాగా విడుదలైన పెళ్లి పాట గ్లింప్స్‌లో ‘ఏందయ్యసామీ..’ అంటూ సాగే సాంగ్‌లో జంట కెమిస్ట్రీ ఆకట్టుకుంటోంది. చిత్రంలో విజయ్ ‘రణబాలి’గా, రష్మిక ‘జయమ్మ’గా కనిపించనున్నారు. సెప్టెంబర్ 11న సినిమా విడుదల కానుంది.మూడోసారి జోడీ... పెరిగిన అంచనాలుఇప్పటికే గీత గోవిందం, డియర్ కామ్రేడ్ చిత్రాలతో మంచి ఆన్‌స్క్రీన్ జంటగా గుర్తింపు పొందిన వీరు, ‘రణబాలి’తో మూడోసారి కలిసి నటిస్తున్నారు. దీంతో సినిమాపై ఆసక్తి రెట్టింపైంది.ఇన్‌స్టాగ్రామ్‌లో రికార్డువివాహ ఫొటోలకు వచ్చిన స్పందన కూడా విశేషమే. రష్మిక షేర్ చేసిన ఓ ఫొటోకు 23 మిలియన్లకు పైగా లైక్స్ రావడంతో, విరాట్ కోహ్లీ టీ20 ప్రపంచకప్ తర్వాత చేసిన పోస్ట్ రికార్డును ఇది అధిగమించినట్లు సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది.వ్యక్తిగత జీవితం, సినిమాలతో విజయ్–రష్మిక జంట మరోసారి ట్రెండ్ సెట్ చేస్తున్నది.

### ఫిల్మ్‌ఫేర్ వేడుకలో రితికా నాయక్
## గ్లామర్ మెరుపులు

యువ నటి రితికా నాయక్ తాజాగా ఫిల్మ్‌ఫేర్ వేడుకలో తన స్టైలిష్ హాజరుతో అందరి దృష్టిని ఆకర్షించింది. ఇటీవల విడుదలైన మిరాయి చిత్రంలో తన నటనతో ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్న ఆమె, ఇప్పుడు గ్లామర్ లుక్‌తో సోషల్ మీడియాలో ట్రెండింగ్‌గా మారింది. ఈ కార్యక్రమానికి ఆమె గోల్డెన్ సీక్వెన్స్ డ్రెస్‌లో హాజరైంది. స్లీవ్‌లెస్, స్ట్రాపీ డిజైన్‌లో ఉన్న ఆ దుస్తులు ఆమె వ్యక్తిత్వానికి చక్కగా సరిపోయాయి. అందుకు సరిపోయే చెవిపోగులు, సాదాసీదా గాజులు ధరించి, హెయిర్‌స్టైల్‌ను మినిమల్‌గా ఉంచడం ద్వారా రితికా తన లుక్‌ను మరింత క్లాసీగా మలిచింది. సోఫాపై ఆత్మవి శ్వాసంతో కూర్చొని కెమెరా వైపు చిరునవ్వుతో పోజులివ్వడం ఆమె స్టేజ్ ప్రెజెన్స్‌కు నిదర్శనం. ఫొటోలలో ఆమె చూపించిన ‘ఫియర్‌లెస్ దివా’ ఆరా అభిమానులను ఆకట్టుకుంటోంది.

**‘పవర్ పేట’తో మరో కీలక అడుగు**

నటన పరంగా కూడా రితికా బిజీ షెడ్యూల్‌లో ఉంది. త్వరలో ఆమె సందీప్ కిషన్ సరసన ‘పవర్ పేట’ చిత్రంలో కనిపించనుంది. ఈ చిత్రా నికి కృష్ణ చైతన్య దర్శకత్వం వహిస్తున్నారు. గతంలో ‘రౌడీ ఫెలో’, ‘చల్ మోహన్ రంగ’, ‘గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి’ వంటి చిత్రాలను తెర కెక్కించిన ఆయనతో ఈ ప్రాజెక్ట్ రూపొందుతుం డటంతో సినిమాపై అంచనాలు పెరిగాయి. రితికా ఈ సినిమాపై ప్రత్యేకంగా ఆశలు పెట్టుకున్నట్లు సినీ వర్గాల్లో వినిపిస్తోంది. తన కెరీర్‌లో ఇది ఒక కీలక మలుపు అవుతుందనే నమ్మకంతో ఆమె పనిచేస్తోందట.

**వరుస ప్రాజెక్టులతో ఫుల్ బిజీ**

‘పవర్ పేట’తో పాటు రితికా ‘డ్యూయెట్’, ‘కొరియన్ కనకరాజు’ చిత్రాల్లో కూడా నటిస్తోంది. వరుస అవకాశాలు అందుకుంటూ, భిన్నమైన పాత్రలను ఎంచుకుంటూ ఆమె తన స్థానం బలపర్చుకునే దిశగా అడుగులు వేస్తోంది. గ్లామర్‌తో పాటు నటనకూ సమాన ప్రాధాన్యం ఇస్తూ ముందుకు సాగుతున్న రితికా నాయక్, టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకునే దిశగా దూసుకెళ్తోంది.

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad–500013.Published at H. No. 6–3–569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad–500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com